SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

మాణిక్యశర్మ, చక్రావధానుల

చిరంజీవులు

పిఠాపురము, 1928

Record no. 311

Māṇikyaśarma, Cakrāvadhānula

Cirañjīvulu

Piṭhāpuramu, 1928

Record no. 311

Bibliographic Record Target

మాణిక్యశర్మ, చక్రావధానుల.

చిరంజీవులు / ఇది చక్రావధానుల మాణిక్యశర్మచే రచియింపఁబడినది.- 2. కూర్పు.- పిఠాపురము : వేంకటపార్వతీశ్వరకవులు, 1928.

(2), 110 p. ;17 cm.

Record no. 311

Māṇikyaśarma, Cakrāvadhānula.

Cirañjīvulu / idi Cakrāvadhānula Māṇikyaśarmacē raciyimpam̐baḍinadi.- 2. kūrpu.- Piṭhāpuramu : Vēṅkaṭapārvatīśvarakavulu, 1928.

(2), 110 p. ;17 cm.

Record no. 311

శ్రీ...సహాయనిధిగ్రంథమాల. ౧.

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము.

చిరంజీవులు

ఇది

చక్రావధానుల మాణిక్యశర్మగారిచే

రచియింపఁబడినది.

రెండవ కూర్పు 2000

ప్రకాశకులు,

వేంకటపార్వతీశ్వరకవులు.

పిఠాపురము.

రైటు రిజిష్టర్డు] 1928 [వెల 0—10—0

Printed at
SCAPE & Co., PRINTERS,
COCANADA.
1928.

ఉపోద్ఘాతము.

"అశ్వత్థామా బలిర్వ్యాసో హనూమాంశ్చ విభీషణః
కృపః పరశురామశ్చ సప్తైతే చిరజీవినః"

ఈచిన్నిపుస్తకమునందు చిరంజీవులగు నేడ్గురుపురాణ పుణ్యపురుషుల పవిత్రచరిత్రములు సముచితముగ సమకూర్పఁబడినవి. ఆంధ్రదేశమునకుఁ జిరపరిచితులగు శ్రీచక్రావధానుల మాణిక్యశర్మగారు బహుగ్రంథపరిశోధనముచేసి యీచరిత్రములను సంగ్రహించి నీతిదాయకముగ రచియించి మాకొసంగియున్నారు.

ఇందలికథలు పురాణప్రసిద్ధంబులును, ధర్మబోధకంబులును, ప్రశంసనీయంబులును, నవశ్యపఠనీయంబులు నగుటచే చిరంజీవులనుపేరితో నీగ్రంథమును చిరంజీవులగు విద్యార్థులకొఱకుఁ బ్రకటించితిమి.

"విద్యార్థిసహాయనిధి గ్రంథమాల" యనునామములో నేఁటేఁట నొకగ్రంథముఁబ్రకటించుచు దానివలన లభించు మూల్యమును పేదవిద్యార్థుల సహాయముకొఱకు వెచ్చింపఁదలంచి ప్రథమగ్రంథముగా దీనిని బ్రకటించితిమి. విద్యాశాఖాధికారులును, పాఠశాలాధికారులును, ముఖ్యముగఁ బ్రధానోపాధ్యాయులును, మాసదుద్యమము నాదరించి చేయూఁతనొసంగి యీమాలమునఁ బాఠశాలలయందుఁగల పేదవిద్యార్థులకు సాహాయ్యముఁగావించుటలో మాకుఁ దోడ్పడఁగలరని విశ్వసించుచున్నారము.

పిఠాపురము.
1—9—1927

వేంకట పార్వతీశ్వరకవులు
ప్రకాశకులు.

విషయసూచిక.

		పుట.
1.	అశ్వత్థామ.	1
2.	బలిచక్రవర్తి.	25
3.	వేదవ్యాసుఁడు.	44
4.	హనుమంతుఁడు.	55
5.	విభీషణుఁడు.	73
6.	కృపాచార్యుఁడు.	86
7.	పరశురాముఁడు.	96

చిరంజీవులు.



అశ్వత్థామ.

శ్రీశివాంశ జనించి ప్ర ♦ సిద్ధమైన
ఘోరతరణంబునను మేటి ♦ వీరుఁడైన
భవ్యతేజుఁ డశ్వత్థామ ♦ స్వామిభక్తి
నవనిజనులకు నాదర్శ ♦ మగును గాత.

భారద్వాజనందనుండగు ద్రోణుండు పితృవియోగంబు నం బుత్త్రలాభార్థమై కృపాచార్యుని భగినియగు కృపిని వివాహం బయ్యెను. పరమేశ్వరప్రసాదంబున నాతని కా సహధర్మిణియం దొకపుత్త్రుం డుదయించెను. ఆకుమారుఁడు పుట్టినపుడే యుచ్చైశ్శ్రవమును బోలి ధ్వనిచేయుటచే ద్రోణుం డాతనికి నశ్వత్థామయని పేరుపెట్టెను. దురదృష్టవశంబున ద్రోణుఁడు నిర్ధనుఁడై తోడిబ్రాహ్మణులచేఁ బరిభవింపఁబడుచుండియు ధనాశచే నితరులను గొలిచియుండుట కంగీకరింపఁజాలకుండెను. ఒకప్పుడు కుమారుఁ డగునశ్వత్థామ పాలకొఱ కేడ్చుచుండుటఁ గాంచి సహింపఁజాలక గోసంపాదనమునకై ప్రయత్నముచే

సెను గాని యాతని కెక్కడను గొప్ప లభింపలేదు. తుదకాతఁడు చాలవిచారించి తనబాల్యసఖుఁడగు ద్రుపదునిపూర్వస్నేహము జ్ఞప్తికిఁ దెచ్చుకొని కుటుంబసహితముగాఁ బాంచాలమునకు బయలుదేఱి పోయి ద్రుపదమహారాజునకుఁ దనపూర్వస్నేహమునుదలంపునకుఁదెచ్చుచు సేవకమూలమునఁ దనయాగమనవార్త నెఱింగించెను. కాని, ద్రుపదమహారాజు రాజ్యమదముచేఁ బూర్వవృత్తాంతమును మఱచి యొకబీదబ్రాహ్మణుఁడు దనకు మిత్రుఁడని యంగీకరించుట తనగౌరవమున కుచితముకాదని భావించి ద్రోణాచార్యునకు దర్శనమైన నొసంగక పరాభవించి పంపివైచెను. ఇట్టియనుచితవ్యాపారముం గాంచి ద్రోణాచార్యునికోపము ప్రజ్వలించుటచేఁ దక్షణమే యాతఁడచ్చటినుండి వెడలిపోయెను.

పిమ్మటఁ గొంతకాలమునకు ద్రోణుఁడు హస్తినాపురమునకుఁబోయి తనబావయగు కృపాచార్యు నింట నుండి కాలక్షేపముచేయుచుఁ గ్రమముగా భీష్మనియోగంబునఁ గురుకుమారుల కస్త్రవిద్యాగురుం డయ్యెను. అచ్చట నే యశ్వత్థామ కూడఁ గురుకుమారులతోఁగలిసి తండ్రియొద్ద ధనురాగమము మొదలగు ననేకవిద్యలు నేర్చి మేటివిలుకాఁడై యొప్పుచుండెను. అశ్వత్థామ యీవిధముగా సర్వసద్గుణసంపన్నుఁడై యనవరతము మృణ్మయలింగమునుగావించి పరమేశ్వరారాధనముఁ జేయుచుండెడివాఁడు. కాని, యీతఁడు చిన్నతనమునుండియు

సులభకోపముగలవాఁడు; అధర్మమును సహింపఁజాలనివాఁడు; రణరంగమున వెనుకంజవేయనిమహావీరుఁడు. ఈతఁడు చిన్నతనమునుండియుఁ గురుపాండవులయెడల సమస్నేహభావముతోడనే మెలంగుచుండెడివాఁడు.

కౌరవుల వంచనోపాయముచేఁ బాండవులకు వనవాసాయాసమును రాజ్యవినాశమును ఘటిల్లి తుట్టతుదకు మహాభారతరణము తటస్థించెను. ఆసమయమునందుఁ గౌరవులయధర్మప్రవర్తనము తనకసహ్యముగఁదోఁచినను, ఆశ్రితధర్మమును బట్టియుఁ గృపద్రోణాదిగురుజనుల యాచరణమునుబట్టియు నశ్వత్థామ కౌరవపక్షముననే నిలిచి యుద్ధముచేయవలసినవాఁ డయ్యెను. ద్రోణునియొద్ద విలువిద్య నేర్చికొన్నవారిలోఁ బ్రియశిష్యుఁడగు నర్జునుఁడును, ప్రియపుత్త్రుఁడగు నీయశ్వత్థామయుమాత్రమే ద్రోణునంతటివారు కాఁగలిగిరి. అయినను వీరొకరిపైనొకరు స్పర్ధవహింపక యన్యోన్యగౌరవభావములనే కలిగియుండిరి. అందుచేతనే సమానప్రజ్ఞగలయీయిరువురును విరుద్ధపక్షములయందుండియు రణరంగమున నొకరినొక రెదిరించి యొకటిరెండు పర్యాయములకంటె నధికముగఁ దీవ్రయుద్ధమును గావించియుండలేదు. అప్పు డశ్వత్థామ యెంతటిమహావీరుడైనదియు నుభయపక్షములవారికిని విదితమయ్యెను.

మహాభారతరణమునందు మిషతోఁగూడినధర్మరాజుమాట విని ద్రోణాచార్యుఁ డస్త్రసన్యాసముచేసెను. ఆసమ

యమునందు ద్రోణునిచంపుటకై జన్మించిన ద్రుపదకుమారుఁ
డగు ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునిశిరమునవలీలఁగ ఖండించివైచెను. ఈవార్త దూరమునందు యుద్ధముచేయుచున్న యశ్వత్థామకుఁ దెలియవచ్చినంతనె తోఁకఁద్రొక్కినత్రాఁచువలె, నేయివోసిననిప్పువలె మండిపడి పాండవులయధర్మప్రవర్తనమును గూర్చియు, ధృష్టద్యుమ్నునిపాపకృత్యముంగూర్చియు నిందించుచు శీఘ్రకోపియగు నీయశ్వత్థామ తండ్రిమరణించెననుదుఃఖముచే నోడ లెఱుఁగక లోకము నపాంచాలముగాఁ జేసెదనని రారాజగు దుర్యోధను నెదుటఁ బ్రతిజ్ఞఁగావించెను.

అప్పు డశ్వత్థామయంతటిమహావీరుఁ డీవిధముగా నసాధారణమగుప్రతిజ్ఞ జేయుట నాలకించి పాండవసైన్యమంతయును గలఁగుండువడిపోయెను. కురుసేనలో నుత్సాహకోలాహలములు బయలుదేఱెను. అశ్వత్థామ ప్రళయ కాలరుద్రునివలెఁగోపావేశముచే యుద్ధరంగమునఁ బ్రవేశించి సమంత్రకముగ నారాయణాస్త్రమును బాండవసేనపైఁ బ్రయోగించెను. ప్రజ్ఞావంతుఁడగునశ్వత్థామ యమ్మహాస్త్రము నట్లు ప్రయోగించినంతనే భూమండలమంతయుమలినమైపోయెను. మేఘములులేకుండఁగనే పిడుగులు పడనారంభించెను, మహావాయువులువీవఁదొడంగెను. సకలజీవులునుసంక్షుభితములైపోయెను, మండువేసవియం దెండిన యడవింగాల్చుకారుచిచ్చువలె నారాయణాస్త్రము విజృంభించి పాండవసైన్యమును దహింప నారంభించెను. దానిబారినుండి

తప్పించుకొనుటకుఁ బాండవసైన్యమునం దెవ్వరికిని శక్తిలేకపోయెను.

ఆసమయమున భక్తపాలకుఁ డగువాసుదేవుఁడుపాండవపక్షమునందున్న యోధులనందఱంగాంచి "ఓమహావీరులారా! మీరు మీమీవాహనములనుండి దిగి విల్లమ్ములవిసర్జించి భక్తిపూర్వకముగా నా నారాయణాస్త్రమునకు నమస్కరింపుఁడు. అట్లు చేయనిచో మీకు నిష్కృతిలేదు" అని యుపదేశించెను. ఆసదుపదేశము ననుసరించి యోధులందఱును దమతమయస్త్రములను ద్యజించివైచిరి. బలగర్వితుండును మహాబలనందనుండు నగుభీముఁడుమాత్రము కృష్ణునిమాటలఁ బాటింపక తనయరదము నశ్వత్థామ కెదురుగ నడపించి యాతనిపై ననేకమహాస్త్రములఁ బ్రయోగింప నారంభించెను. అంతలో ననివార్యమగునారాయణాస్త్రజ్వాలలచే రథసహితముగ భీమసేనుఁడు కప్పువడిపోయెను. పాండవసేనయం దాహాకారములు బయలుదేఱెను. తోడనే కృష్ణార్జునులు పరుగుపరుగునఁబోయి యరదమునుండి భీమసేనుని బలవంతముగఁ గ్రిందికి దింపివైచి యాతనిచేతనున్నయస్త్రశస్త్రములను లాగివైచిరి. అప్పటికి నారాయణాస్త్రము ప్రశాంతమయ్యెను. ప్రియశిష్యుఁడగునర్జునునికంటెఁ బ్రియపుత్రుఁడగు నశ్వత్థామకు ద్రోణాచార్యుఁడు ప్రత్యేకముగనొసంగిన యధికశక్తి యిదియే.

అశ్వత్థామ తనదివ్యాస్త్ర మట్లు వమ్మగుటకుఁ జింతించి బిరాన వ్యాసునిచెంత కరిగి నాయస్త్రంబిట్లు వ్యర్థమగుటకు హేతు వెయ్యదియో యానతిమ్మని ప్రార్థించుటయు వ్యాసభగవానుఁడు "ఓద్రోణనందనా! పూర్వము నారాయణుండు లోకరక్షణార్థ మవతరింప నెంచి మైనాకపర్వతంబున నిరాహారియై శివునిఁగూర్చి పెద్దకాలంబు తపంబుసేయ నా బాలశశాంకమౌళి ప్రత్యక్షమై యతనియభీష్టముఁ దెలిసికొని నీవు సురాసురగరుడగంధర్వనాగప్రముఖుల నవలీల గెలువఁగలవని వరంబిచ్చి యంతర్హితుం డయ్యెను. అందువలన నారాయణున కట్టిశక్తి కలిగినది. ఆనారాయణుఁడే యీశ్రీకృష్ణుఁడు. ఆనారాయణాంశసంభవుఁడగు నరుఁడే యీయర్జునుఁడు. వారిరువురును గేవలలింగాధిష్ఠాతయగు మహాదేవు నర్చించిన మహానీయులు. నీవు పార్థివలింగమును బూజించుచుండుటచే నట్టిశక్తి నీయందుఁ గలుగలేదు. అంతియకాక, వారు నారాయణాంశసంభవులు. నీవు ప్రయోగించినది నారాయణాస్త్రము. వారిచేతితో వారినిఁగొట్టిన నెంతప్రయోజనమో వారిపైఁ బ్రయోగించిననారాయణాస్త్ర మంత ప్రయోజనమైనది." అనిప్రబోధించుటయు నశ్వత్థామ పులకితాంగుఁడై వ్యాసదేవునకు నమస్కరించి కృష్ణార్జునులప్రభావమును మెచ్చుకొనుచుఁ దనశిబిరంబున కేఁగెను.

పగదీర్చుకొనఁ దలఁచినవానికిఁ దనప్రయత్నములు విఫలములైనకొలఁదిని కోపానలము ప్రజ్వలించిపోవుచుండును. మహావీరుఁడగునశ్వత్థామకుఁగూడ నిట్టే పాంచాలురను నాశనము చేయువఱకును గోప ముపశమింపలేదు. అతఁ డెంతపట్టుదలతోఁ బనిచేసినను గార్యము కొనసాగుటలేదు. ఆతనికిఁ గృష్ణార్జునులయం దెంతగౌరవ మున్నను బాండవు లక్రమముగఁ మహాపురుషులగు భీష్మద్రోణులను సంహరించిరనువిషయము తలఁచికొన్నప్పు డాతనియొడలు కంపించిపోవుచుండెను. క్రోధము హెచ్చిపోవుచుండెను. ఆయపచారమునకు వారికిఁ దగినశాస్తి చేయువఱకు నాతనికిఁ దోఁచుటలేదు.

ఇట్లుండఁగా రణరంగమున రాజరాజునకుఁ ప్రధానాధారస్వరూపుఁడైనకర్ణుఁడు పార్థశరానలమున కాహుతియైపోయెను. ఆవార్త నాలకించినంతనే యశ్వత్థామ హతాశుఁడయ్యెను తానుసర్వసేనాధిపత్యమును వహించి యెట్లయినఁ బాండవులను జయించి పాంచాలుర నాశనముఁగావించి తన ప్రతిజ్ఞఁదీర్చుకొనవలయునని యెంతయో యాత్రపడుచుండెను. అందులకై మహారాజుదుర్యోధనుఁడు దప్పక తన్నుఁ బిలిపింపఁగలఁడని యాతఁ డారాత్రియంతయు నాలోచించుకొనుచు నెదురుచూచుచుండెను. తెల్లవాఱినదిగాని, రారాజాతని నాహ్వానింపనేలేదు. శల్యుని సర్వసేనాధిపత్యమునం దభిషి

క్తునిఁ గావించిన ట్లాతనికిఁ దెలియవచ్చెను. అప్పు డశ్వత్థామ కాశాభంగమైనను మహావీరుఁడుగావునఁ బట్టుదలను విడువక నిస్సంశయముగ సమరరంగమునఁ బ్రవేశించెను. తనయంతటి సమర్థుఁ డుండఁగా సుయోధనుఁడు తన్ను గౌరవింపకపోయి నను గార్యతత్పరుఁడై యున్న యశ్వత్థామ కది పరాభవముగా దోఁపలేదు. అందుచే నాతఁ డెప్పటివలెనే యుద్ధము చేయుటకుఁ గృతనిశ్చయుఁ డయ్యెను.

ఆ మధ్యాహ్న సమయమున మహారణమధ్యమునందు సేనాధిపతియగు శల్యుఁడు గాండీవిబాణవర్షమునఁ బడి మునిఁగి పోవుచుండెను. స్వపక్షాభిమానియు దీక్షాపరుఁడు నగు ద్రోణ నందనుండు శల్యునిరక్షించుటకై తనబలపరాక్రమముల వినియోగించెను. ఇంతలో శల్యుండు భగ్నరథుండై పోవుటయు నశ్వత్థామ యాతనిఁ దనస్యందనముపై నిడికొని పార్థు నెదిర్చి మహాయుద్ధము చేసి శల్యు నుద్ధరించుకొనియెను. కాని విధివశముచే నానాఁడు శల్యునకు మరణము తప్పినది కాదు. శల్యుఁ డట్లు సురక్షితుఁడై వేఱొకరథము నధిరోహించి యాసమీపమునం దున్న ధర్మరాజుతోఁ బోరాడఁదొడంగెను. ఆపోరునందుఁ దుద కామద్రరాజు ధర్మరాజు దివ్యశక్తిచే నిహతుఁడైపోయెను.

మాటిమాటికిని నిరాశకలుగుచుండుటచే నశ్వత్థామ యధైర్యముచేఁ గ్రుంగిపోవక కార్యోత్సాహముఁ దన్నుఁ బురికొల్పుచుండ సమరాంగణమున నతిదారుణముగ వీరవిహా

రముఁ గావింపఁదొడంగెను. ఇంతలో భీమసేనుని యన్యాయ యుద్ధమునందు రారాజగు దుర్యోధనుఁడు తొడలువిఱిగి పడి పోయెను. అప్పు డశ్వత్థామ తనప్రతిజ్ఞ నెఱవేఱకుండుటయుఁ దనపక్షమంతయు దుర్బలమైపోవుటయుఁ దనకన్నులయెదుటనే తనప్రభువగు రారాజు పడిపోవుటయుఁ బితృహంతకులగు పాంచాలు రింకను బ్రదికియుండుటయుఁ బాండవు లక్రమప్రవర్తకు లగుటయుఁ గాంచి కోపమును సంతాపమును శోకమును మాత్సర్యమును దన్ను ముంచివేయుచుండ నున్మత్తునివలె రారాజుసమీపమునకుం బోయి క్రోధశోకగద్గదస్వరంబున "మహారాజా! విధివిధానము తప్పినదిగాదు. జరిగినదానికి విచారించుటవలనఁ బ్రయోజనము లేదు. నేను ప్రతిజ్ఞాపూర్వకముగ మరల వచించుచున్నాఁడను వినుము. ఏవిధముగానైన వాసుదేవునిసమక్షమునందు సమస్తపాంచాలగణంబులను శమనసదనంబున కతిథులుగాఁ జేసివైచెదను. ప్రభుండవగు నీవు నాకనుజ్ఞ యొసంగుము." అని విన్నవించుటయు, నలసుఁడై ప్రాణావశిష్టుఁడై పడియున్న మహారాజు దుర్యోధనుఁడు కృపాచార్యునిం గాంచి "భూసురాగ్రణీ! మీకు నాయెడలఁ బ్రేమయే యున్నచో ద్రోణనందనుండగు నీయశ్వత్థామ నీక్షణమునందే సేనాపతిపదంబున కభిషిక్తుం గావించెదరుగాక! రాజాజ్ఞచే క్షత్రియ ధర్మము నవలంబించిన బ్రాహ్మణునకు యుద్ధము చేయుట దోషముగాకుండుఁగాక!" అని యాజ్ఞాపించుటయు మహావీరుండగు

కృపాచార్యుం డప్పుడే ప్రభుశాసనమును సక్రమముగా నిర్వర్తించెను.

అనంతరము ద్రోణి కృపకృతవర్మలతోఁ గలసి యనతిదూరమందున్న కురుక్షేత్రమహావనంబునఁ బ్రవేశించెను. అచ్చట నమ్మువ్వురువీరాగ్రేసరులును నొకవటవృక్షముక్రిందఁ గొంతసేపు విశ్రమించి గుఱ్ఱములచే జలపానంబు సేయించి ముందు చేయఁబోవుకార్యములనుగూర్చి యాలోచించుకొనుచుండిరి. సాయంకాలమయ్యెను. క్రమముగా నంధకారము దశదిశల నలముకొనియెను. గ్రహతారకలచే గగనమండలమలంకృతమయ్యెను. వనమధ్యమున ఘాతుకమృగములు విచ్చలవిడిగ సంచారము చేయనారంభించెను. తక్కినజీవకోటి యంతయు నిద్రాముద్రితమైపోయెను. అప్పు డమ్మువ్వురును నాచెట్టుక్రిందఁ గూరుచుండి శోకాకులచిత్తములతోఁ గౌరవపాండవులవినాశనమునుగూర్చి వితర్కించుకొనుచుండిరి. గమనాయాసముచేతను, శస్త్రఘాతములచేతను మిగులనలసియున్న వారిని నచిరకాలములోనే నిద్రాదేవత యాక్రమింపఁ దొడంగెను. ఇదివఱ కెన్నఁడును దుఃఖమన నెట్టిదియో యెఱుంగని కృపకృతవర్మలు దీనులవలె ధరాతలమునంబడి నిదురించిరి.

కాని, ప్రతిహింసానలజ్వాలలచే దహించుకొనిపోవుచున్న హృదయముగల యశ్వత్థామకుమాత్రము నిద్రాదేవత

సుఖ మీయఁజాలకపోయెను. వలలోఁ దగుల్కొన్నపక్షివలె నాతనిహృదయము కొట్టుకొనిపోవుచుండెను. అప్పు డాతఁడు నలుదెసలఁ దిలకించి లోపలను వెలుపలనుగూడ నంధకారమునే కాంచుచుండెను. ఆసమయమునందు వృక్షశాఖాంతరాళమునఁ బక్షులఱెక్కలచప్పు డాతనికి వినవచ్చెను. మిణుఁగురుబురుగులసన్నని వెలుఁగులో నొకగుడ్లగూబ యాతనికి దృగ్గోచరం బయ్యెను. అది నిదురించుచున్న కాకులగొంతులఁ గొఱుకుచుఁ గొన్నిటి నఖంబులఁ జీల్చుచుఁ గడుపారభక్షించుచు నిశ్శబ్దముగ నాచెట్టుపై వీరవిహారము సేయుచున్నట్లాతనికిఁ గానవచ్చెను. వాయసాంతకమగునులూక మీవిధముగా రాత్రివేళఁ దనకార్యసిద్ధిం గావించుకొనుచుండుటంగాంచి యశ్వత్థామకొడలు తెలియని యావేశము కలిగెను. అప్పుడాతఁడు తనలో "ఈయులూకము నాకిపుడు గురువై నాప్రతిజ్ఞానిర్వాహణమునకు మార్గముచూపినది. శత్రుసంహారమున కిదియే యుచితసమయము. నేనిప్పుడు రారాజునెదుటఁ బాండవవినాశముం గావింతు నని ప్రతిజ్ఞ చేసితిని. కాని, బహిరంగముగ నెదురించి వారిని జయించుట యసాధ్యము. ధర్మయుద్ధమునఁ బ్రాణత్యాగము సేయుటకంటెఁ గపటోపాయముచేనైన శత్రుసంహారముఁ గావించిమహారాజుఋణమునుదీర్చి స్వధర్మనిర్వాహణమును గావించుకొనుట యుచితము." అని యింకను ధర్మాధర్మములం గూర్చి యెన్నియోవిధంబుల వితర్కించుకొని తుదకు శత్రుసంహారముచేయుటయే యవశ్యధర్మముగా నిశ్చయించుకొని

ఖడ్గహస్తుఁడై లేచి ముందటికి నాలుగడుగులు నడచి "విశ్వమథనులైన కృష్ణార్జునులున్న చోటికిఁ బోవుట యుచితము కాదు. మామను, గృతవర్మను గూడ లేపెదను." అని యూహించుకొని కృపకృతవర్మలను జాగరితులను గావించెను.

అప్పుడు కృపాచార్యుఁడు లేచి "కుమారా! నీకింకను నిదురపట్టనేలేదా? ఈయసమయమునందు ఖడ్గము నేలధరించితివి?" అని యడిగెను.

అశ్వ—మామా! నానారాజకిరీటమణినీరాజితపాదపీఠుఁడైన రారాజు విధంబున భగ్నోరుద్వయుండై భండనరంగమునఁ బ్రాణావశిష్టుఁడై పడియుండ నాకురుకులతిలకుని ప్రసాదమున జీవించుచుఁ గృతఘ్నుఁడనై నేనెట్లు నిద్రింపఁగలను?

కృప—వత్సా! నీవు చెప్పినది యథార్థము. ప్రభుభక్తి నెఱపుట మనకు ధర్మమే. అయినను స్వయంకృతాపరాధమను మహాప్రవాహమునంబడి కొట్టుకొనిపోవుచున్న సుయోధనుఁడను నెండుకట్టియను మరలించి తీరమునకుంజేర్చుట బ్రహ్మాదులకైనను శక్యము గాదన్నచో మనమా యాతని నుద్ధరింపఁగలవారము?

అశ్వ—మామా! నీమాటసత్యమే. కాని, శిఖండిని ముందుంచుకొని యన్యాయముగ భీష్మునిఁ జంపి మహాపాపులను—అనృతవచనములచే శస్త్రసన్న్యాసముచేయించి యక్రమముగా నాజనకుని యుత్తమాంగము నుత్తరించిన కిల్బిషావ

తారులను—సంగరమధ్యమున శాపోపహతిచే భూమిలోఁ గ్రుంగిన తేరు నెత్తుకొను సమయమున నధర్మమని సుంతయును దలంపక కర్ణునిఁ దెగటార్చిన పాపవ్యవసాయపరులను—పాండవపక్షవీరులను బంధుమిత్రపరివారసహితముగా నొక్కసారి నాక్రోధరసప్రవాహమున ముంచివైచి యమలోకంబునకుఁ గొట్టుకొనిపోవునట్లు చేయువఱకును నాకు శాంతి యెక్కడిది? రారాజుమాట యటుండనిమ్ము—పాపు లెవ్వరైనను దమకర్మఫలము ననుభవింప వలసినదే. తొలుదొల్త కౌరవులే పాపవ్యవసాయమునకుఁ గడంగుటచే వారిదే పాపపక్షమైయినది. అందువలనఁ గౌరవులు దండ్యులైరి. భీష్మద్రోణాదిధర్మవేత్తలును, వేదవ్యాసాదిమహర్షులును, ప్రబోధించినను వినకుండుటచే దుర్యోధనుఁడు మూర్ఖుఁ డయ్యెను. అట్టివాని నేయుపాయంబుననో కడతేర్చుట పాండవుల కవశ్యకర్తవ్యమయ్యెను. కాని, నిరపరాధులైన భీష్మద్రోణాదిగురుజనంబుల నన్యాయంబుగ వధించిన పాపాత్ములకు పాండవుల నేమిచేసిన పాపమున్నది? ఇన్నిమాటలేల? కేవలఋజుమార్గప్రవర్తకుఁడని పేరువడసిన ధర్మజునంతటివాఁడు కపటతంత్రమునకు లోఁబడి అశ్వత్థామ మరణించెనని యనృతమాడి తనకుఁ బితృస్థానీయుఁడగు నాజనకుని దుర్మరణమునకుఁ గారకుఁ డయ్యెనుగాదా? అట్టిపాపకర్ము నెట్లయినను ససైన్యముగఁ బరిమార్చుట పాపము గానేరదు. నేనట్టివిశ్వాసముతోనే కృతనిశ్చయుఁడనై

యుంటిని. కురురాజు ప్రాణములతో నుండఁగనే యశ్వత్థామ విశ్వాసపాత్రుఁడై సంపూర్ణముగాఁ దనప్రతిజ్ఞను సాధింపఁగలిగెనను మనఃప్రియమైనవార్త యాతనిచెవులఁబడవలయును. సమయము దొరకినప్పుడు శత్రువులను వధించుటయే యంగీకృతక్షత్రధర్ముండ నగునాకుఁ గర్తవ్యము. అర్ధరాత్రిసమయంబున నిదురించుచున్న కాకులంజంపి తినుచున్న యులూకమును నాకన్నులయెదుటఁ బెట్టి పరమేశ్వరుఁడు శత్రువినాశనంబునకు నాకు ముఖ్యోపాయమును బ్రబోధించి యున్నాఁడు. నేనీరాత్రియే పాండవశిబిరంబులఁ బ్రవేశించి నిద్రానిమగ్నులై యుండు పాంచాలురను, బాండవసంతానంబును ససైన్యముగఁ బుడముట్టించి కసిదీర్చుకొని ప్రభుఋణమును, తండ్రిఋణమును జెల్లించుకొనియెదను. అంతవఱకును నాయీకృపాణ మొఱయందుఁ బ్రవేశింపదు. మీరును బ్రభుభక్తితత్పరులైనచో నావెంటరండు. ఆకస్మికముగ నాపైఁ దలపడినవారి నడ్డగించుటకై సాహాయ్యముచేయుఁడు. ఈదారుణకర్మమున కంతకును నేనె ప్రధానుఁడ నయ్యెదను. ఈవిషయంబునఁ బాపపుణ్యములతో నాకెంతమాత్రమును బ్రసక్తిలేదు. ఇక్కార్యము సిద్ధించువఱకును నాక్రోధమునకు శాంతిలేదు. ఎంతయడఁచికొందమన్నను నాఁగక కార్యోత్సాహము నన్నుఁ బురికొల్పుచున్నది. బ్రహ్మవంశమున జన్మించి క్షత్రధర్మము నవలంబించిననాకీవిషయమున నెట్టిసంశయమును గలుగుటలేదు. వంచకులను వం

చనముచేతనే జయింపవలయును. భగవదుద్దేశ మెట్లుండునో యట్లుజరుగక మానదు. మనము నిమిత్తమాత్రులము. మనకెందును గర్తృత్వములేదు.

ఇట్లశ్వత్థామ యున్మత్తునివలె సంభాషించుటయుఁ గృపకృతవర్మలు కళంకశంకితులై నిద్రించుచున్న జీవులను బలవంతముగ సంహరించుట వీరధర్మముకాదనియు మహాపాపమనియు నెన్నియోవిధములఁ బ్రబోధించిరి. కాని, ద్రౌణి వారివచనంబులఁ బెడచెవులంబెట్టి క్రోధావేశముచేఁ దూలుచుఁ బాండవశిబిరంబుల కభిముఖుఁడై పోవఁదొడంగెను. కృపకృతవర్మలికఁ జేయునదిలేక సహాయార్థమై దూరదూరముగ నాతని వెన్నంటి పోయిరి.

క్రమముగా నశ్వత్థామ పాండవశిబిరములను సమీపించెను. అప్పుడు పునుకలపేరులను సర్పభూషణములను ధరించి నయొకభూత మాతనికట్టెదుట నిలిచి తనకరాళవదనగహ్వరమును దెఱచి భువనంబుల నన్నిటిని దిగమ్రింగునట్లార్భాటములు సేయఁదొడంగెను. దారుణకర్మాచరణమునందుఁ దదేకనిష్ఠుఁడైయున్న యశ్వత్థామ యాభూతముంగాంచి సుంతయును భీతిల్లక దానిపై నిశితసాయకంబుల నవ్వారిగాఁ బ్రయోగించుటయు నది యాబాణముల నవలీలగ మ్రింగివేయసాగెను. అశ్వత్థామ యాశ్చర్యముతో నాభూతము నంకదృష్టినిగుడించుటయు దానిముఖంబున శంఖచక్రగదాద్యాయుధహస్తులగు నారా

యును లనేకులు పొడకట్టి యాతనికి గమననిరోధంబుఁ గావించిరి. అయినను ద్రోణనందనుం డించుకంతయును జలింపక వివిధంబులగు దివ్యాస్త్రములను బ్రయోగింపసాగెను. కాని, యవియన్నియు భూతగర్భమున విలీనములై పోవుచుండెను.

అప్పు డశ్వత్థామ నిశ్చేష్టుఁడై యంతలోఁ దెలివి తెచ్చుకొని పౌరుషముకంటె దైవము బలీయమైనదని నిశ్చయించుకొని తత్క్షణమే రథమునుండిదిగి సర్వభూతనాథుండును విశ్వేశ్వరుండు నగు నారుద్రదేవుని మనంబున ధ్యానించి యనేకవిధంబులఁ బ్రస్తుతింప నారంభించెను.

అంతలో నాభయంకరభూతం బంతర్ధానంబై మెట్టయెదుట మంటలతోఁ బ్రజ్వరిల్లుచున్న యొకకనకవేదిక యాతనికిఁ గానవచ్చెను. అప్పు డశ్వత్థామ యుచ్చస్వరముతో "ఓపరమేశ్వరా! ఈజగంబులు సృష్టించుటకును, పాలించుటకును, సంహరించుటకును నీవే కర్తవు. నీవిలాసము లనంతములు. నీవు భావాతీతుఁడవు. నీలీలలయర్థంబుఁ దెలియ నేనసమర్థుండను. నీకిప్పుడే యాత్మోపహారంబు సేయుటకుఁ గృతనిశ్చయుఁడనై యున్నాఁడను." అనిపలుకుచు ద్రోణనందనుండు సాహసించి తనయాయుధముల నన్నిటి నాయగ్నికుండంబున కాహుతిఁ జేసి తన హృదయపద్మమునందు సదాశివమూర్తినిఁ బ్రతిష్ఠించుకొని నిశ్చలచిత్తముతో నిస్సంశయముగా నాయగ్నికుండమునఁ బ్రవేశించెను. కాని, యాయగ్నిజ్వాల లశ్వత్థామకుఁ జందనజలంబులకంటెను నతిశీతలంబులై పోయెను.

వీరాగ్రేసరుండగు నశ్వత్థామ భక్తిసాహసధైర్యంబులకు మెచ్చి యాదిదేవుండగు పరమేశ్వరుండు ప్రత్యక్షమై "ద్రోణనందనా నీవర్పించిన యాత్మోపహారంబునకుఁ బ్రమోదంబు నందితిని. నీయభీష్టవరంబు లొసంగెద నర్థింపుము." అని కరుణాకటాక్షమాలికలచే నాతని నలంకరించెను. అప్పు డశ్వత్థామ సంభ్రమంబున నవ్వేదిక వెడలివచ్చి యాయభవు పాదపద్మములకుఁ బ్రణామంబుచేసి సంస్తుతించుటయుఁ బినాకపాణి యాతని నాదరించి "వత్సా! సత్యశౌచపరుండై నిశ్చలభక్తితో నన్నారాధించు కృష్ణునకు మేలుసేయందలంచి భూతాకృతితో నీకునిరోధకుండనైతిని. నీచిత్తశుద్ధిని శోధించుటకై యిట్లనేకమాయల నొనర్చితిని. పాంచాలురకుఁ గాల మాసన్నంబైనది. అప్రతిహతంబగు నీఖడ్గమును బరిగ్రహించి కృతకృత్యుండ వగు" మని యనుగ్రహించి యాతనిశరీరంబు తనపవిత్రకరకమలంబులచే నిమిరి "కుమారా! నీవసమానప్రభావసంపన్నుండవై చిరంజీవివైమను"మని యాశీర్వదించి యంతర్హితుండయ్యెను. మున్ను భూతంబుచే నపహృతంబులైన యస్త్రశస్త్రంబులును, తా నగ్నికుండంబున వేల్చిన యాయుధంబులును మరల నశ్వత్థామను జేరుకొనియెను.

ఇట్లు లబ్ధాభీష్టుండైన గురునందనుండు మహానందపరవశుండై మహాబలసంపన్నుఁడై యీశ్వరదత్తంబగుదివ్యకృపాణం

బును జళిపించుచు వెనుకనున్న కృపకృతవర్మలంజూచి "వీరవరులారా! మీరును వెంపువహించి నాతో నింతవఱకు వచ్చినందులకు సంతసించుచున్నాఁడను. ఇఁక మీరు వెనుకంజవేయక జాగరూకులై యుండుఁడు" అని హెచ్చరించి, ఆయిరువురను శిబిరద్వారదేశంబున నిలిపి తాను నిశ్శబ్దముగా ధృష్టద్యుమ్నుని శయనాగారమునఁ బ్రవేశించెను. ధృష్టద్యుమ్నుఁడు విజయోత్సాహముచే నిర్భయముగా మైమఱచి నిద్రించుచుండెను. ఆతనిం గాంచినంతనే క్రోధపరవశుం డగు నశ్వత్థామ యొక్కతన్నుఁ దన్ని నిద్రనుండి మేల్కొల్పి మదమాతంగముపై నుఱుకు సింగమువలె నాతనిపైఁబడి యాతని నతిదారుణంబుగ బాధించి పశువును జంపినట్లుచంపివైచెను. ఆభయంకరకోలాహలము నాలకించి శిబిరములోని వారందఱును మేల్కాంచి తత్తరపాటుతోఁ దమతమయాయుధముల వ్యత్యస్తంబుగఁ గైకొనివచ్చి యశ్వత్థామను దలపడిరి. శివవరప్రభావముచే మత్తిల్లియున్న ద్రోణనందనుండు, యుధామన్యుఁడు, ఉత్తమౌజుఁడు మొదలగు పాంచాలురను దనఖడ్గధారకు బలిగావించి రక్తధారలచే దొప్పఁదోఁగుచున్న శరీరముతో నతిభయంకరముగసంచరించుచుఁ దనకంటఁబడినవారినెల్లఁ జిత్రవధ గావింపఁజొచ్చెను. ప్రతివింధ్యుఁడు, శ్రుతసోముఁడు, శతానీకుఁడు, శ్రుతకర్ముఁడు, శ్రుతకీర్తియను ద్రౌపదీపుత్త్రులేవురునుఁగూడ నాతని దారుణఖడ్గధార కెఱలై పోయిరి. క్రమముగా నాతఁడు శిబిరంబులఁ

బ్రవేశించి మిగిలిన పాండవసేననంతను నాశనముఁ గావించెను. అశ్వత్థామను దప్పించుకొని పాఱిపోవుచున్న యోధులను విధిప్రేరణంబునఁ గృపకృతవర్మలు ద్వారంబునఁగాచి సంహరించుచుండిరి.

ఈవిధముగా నశ్వత్థామ జగత్సంహారము సేయు ప్రళయకాలరుద్రునివలె విజృంభించి శత్రువినాశనంబుఁ గావించి యంతటఁ దనివిసనక యాశిబిరంబులన్నియు దగ్ధంబులుగఁ జేసి పితృదుర్మరణజనితంబగు క్రోధానలమును శత్రురక్తప్రవాహంబుచేఁ జల్లార్చుకొని యచిరకాలంబుననె కృపకృతవర్మలం గలిసికొని కురురాజగు దుర్యోధనునిపాలికిం బోయి యావృత్తాంతము నివేదించెను. దుర్యోధనుండును బరమాహ్లాదంబున నావీరులఁ గౌఁగిలించుకొని ప్రశంసించుచుఁ బ్రాణములను విడిచెను.

తెల్లవాఱినది. అశ్వత్థామ యొనరించిన దారుణకృత్యము పాండవులకుఁ దెలియవచ్చెను. తనపితృకులంబంతయు వినష్టంబగుటయే కాక నిజసంతానంబుగూడ వినాశంబగుటచే ద్రౌపది దుస్సహశోకావేగంబున మూర్ఛపడిపోయెను. అప్పుడు రజోగుణప్రధానుండును వీరుండునగు భీమసేనుండు ద్రౌపదిని మూర్ఛఁ దేర్చి యూరార్చుచు దురాత్ముండును బుత్త్రహంతకుండు నగు నశ్వత్థామను బరాభవించి యతని శిరోరత్నంబు దెచ్చియిచ్చెద నని ప్రతిజ్ఞచేసి కాంచన రథారూఢుండై

పకులసహితంబుగా నశ్వత్థామను వెంబడించుటకు బయలుదేఱెను.

అప్పుడు శ్రీకృష్ణుఁడు ధర్మజునుద్దేశించి "మహారాజా! నీతమ్ముఁడగు భీముఁడు ద్రౌపదిశోకమునుజూడఁజాలక సాహసకర్మముంగావింపఁ బోవుచున్నాఁడు. ధనుర్విద్యావిశారదుండగు ద్రోణుఁడు తనకుమారుఁ డగునశ్వత్థామకుఁద్రిలోకభీకరంబగు బ్రహ్మశిరోనామకాస్త్రమును బ్రసాదించియున్నాఁడు. అందుచే నాతఁడు దేవగణంబులకుఁగూడ నజేయుఁడు. కావున భీమసేనుఁ డిప్పు డాతనిచేతులలోఁ బడిపోకుండ రక్షించుకొనవలయును." అని యుద్బోధించి రథము నాయత్తముచేసి కిరీటితోఁగూడ ధర్మజుని వెంటఁబెట్టుకొని బయలుదేఱెను. ఇట్లా ముప్వురును గొలఁదికాలములోనే భీమసేనుని గలసికొని క్రోధోద్ధతుఁడగు నాతనిప్రయత్నమును మరలింపఁజూచిరి. కాని, వృకోదరుఁడువారిమాటలు వినక యశ్వత్థామను వెదకికొనుచు భాగీరథీతీరమువఱకును బోయెను. ధర్మజుఁడును గృష్ణార్జునులునుగూడ దూరమునుండి యాతని ననుసరించియే పోవుచుండిరి.

గంగాతీరమునందు వ్యాసాదిమహర్షుల సన్నిధానమున నశ్వత్థామ కుశాంబరధారియు, ధూళిధూసరితగాత్రుండునై కూర్చుండియుండెను. ఆతనింగాంచినంతనే మహావీరుండగుభీమసేనుండు క్రోధోద్దీప్తుండై శరాసనంబున బాణసంధానంబుచేసి యతిత్వరితగమనంబున "లెమ్ము. రమ్ము; యుద్ధమునకురమ్ము" అని ధిక్కరించుచు నాతని నెదుర్కొనెను. ఆకస్మికముగ నెదుర్కొనిన భీమసేనునింగాంచి మహారథికుండగు నశ్వత్థామ తత్తరముతోఁ లేచి మరల యుద్ధము తటస్థించినదని వితర్కించియేకాకియైయుండుటచే నేమియుందోఁపక బ్రహ్మశిరోనామకాస్త్రమును దృణసంయోజితంబుగఁ జేసి "పాండుకులక్షయంబగుఁగాక!" అనిపలుకుచుఁ బ్రయోగించెను. తోడనే యాదివ్యాస్త్రమునుండి త్రిలోకంబులను దహింపఁజేయునంతటియగ్నిజ్వాలలు బయలుదేఱెను.

మహాభాగుండగుమాధవుండు దూరమునుండియే యుదంతయుంగాంచి ధనంజయు నవలోకించి "సఖా! ద్రోణోపదిష్టంబగు నొకదివ్యాస్త్రము నీయొద్ద నింకను ననుపయుక్తంబై యున్నయది. ఆదివ్యాస్త్రము నిప్పుడు ప్రయోగించి నీవంశము నుద్ధరించుకొనుము." అని ప్రబోధించెను. అర్జునుండప్పుడురథావతరణంబుఁ గావించి ప్రప్రథమంబుననే అశ్వత్థామకును, తనసోదరులకును, శుభంబగుఁగాక యనివచించి గురువునకును దేవతలకును నమస్కారంబుచేసి "ఈయస్త్రప్రభావంబుచే నశ్వత్థామదివ్యాస్త్రము మరలింపఁబడుఁగాక!" అని సమంత్రికంబుగా బ్రహ్మశిరోనామకాస్త్రంబును బ్రయోగించెను. తోడనే యాదివ్యాస్త్రంబుల రెండింటినుండియుఁ బ్రళయకాలానలజ్వాలలు ప్రజ్వరిల్లఁదొడంగెను. ఆకసమునుండి వేలకొలఁది యుల్కాపాతములు గాఁజొచ్చెను. సకలజీవగణంబులును భయభ్రాంతములై పోయె

ను. సాగరవలయితంబును గిరికాననపూర్ణంబును నగుధరామండలమంతయును గంపించిపోవుచుండెను.

అట్లాదివ్యాస్త్రములు రెండును గలిసి త్రిజగంబులను దహించివేయునో యనుభయముచే సర్వభూతహితార్థియగు వేదవ్యాసుండును దేవమునీంద్రుండగు నారదుండును వారినడుమఁ బ్రవేశించి లోకసంరక్షణార్థమై మీమీయస్త్రముల నుపసంహరింపవలయునని ప్రబోధించిరి. అప్పుడు సాధుశీలుండగునర్జునుండు వారికి నమస్కరించి "మునిశ్రేష్ఠులారా! నేనీయశ్వత్థామయస్త్రవేగమునుపశమింపఁజేయు నుద్దేశముతోడనే నేనునాదివ్యాస్త్రమును బ్రయోగించితిని.ఇప్పుడు నేను దీని నుపసంహరించినచో నీయశ్వత్థామ నిశ్చయముగఁ దనయస్త్రప్రభావముచే మమ్మందఱ భస్మీభూతులంగావించివైచును. కావున నందఱకును శుభంబగునట్టి యుపాయము నాలోచింపవలయునని వేఁడికొనుచునే తనయస్త్రము నుపసంహరించివైచెను. క్రోధోద్దీప్తుండగు నశ్వత్థామమాత్రము తనయస్త్రము నుపసంహరించుకొనఁజాలక మునిద్వయముంగాంచి లజ్జితుఁడై" మహర్షులారా! భీమసేనభయంబున విపన్నుండనై యాత్మరక్షణంబు కొఱకాశపడి క్రోధోన్మత్తతచే ధర్మాధర్మపరిగణనంబుఁ జేయఁజాలక దుష్కర్ముండనై పాండవవంశవినాశనంబు సంకల్పించి నేనీయస్త్రంబుఁ బ్రయోగించితిని. సంకల్పసిద్ధియగువఱకు నిది మరలునదికాదు. నేనేమిచేయుదును?" అనియెను.

వేదవ్యాసుం డప్పుడు "వత్సా! మహాత్ముండగు నర్జునుండు రోషావేశుం డయ్యును,నీవినాశనమును గోరి తనయస్త్రమును బ్రయోగింపలేదు. నీమిత్రుండగు నర్జునుండు పుత్రహంతకుండవైనను నీకపకారంబు సేయఁ దలఁపలేదు. కావునఁ బాండవరాజ్యసంరక్షణంబుఁ గావించుట నీకవశ్యకర్తవ్యంబై యున్నది. కావున, నీవిప్పుడు నీయస్త్రము నుపసంహరింపుము. క్రోధమును విడువుము. పాండవులకు భద్రమగుఁగాక ! నీశిరోరత్నమును భీమసేనున కర్పింపుము. ధర్మాత్ముండగు యుధిష్ఠిరుండు నీకభయదానంబు సేయఁగలఁడు." అని యుపదేశించెను.

అశ్వత్థామ వ్యాసదేవునియుపదేశమును మన్నించి,అతికష్టముచేఁ దనశిరోమణిని వృకోదరున కర్పించుట కంగీకరించెను. కాని, పగదీర్చుకొనుటకై ప్రయోగించిన దివ్యాస్త్రమును మరలించుటకు సమర్థుఁడు కాఁజాలకపోయెను. అప్పుడు మహామతియగువాసుదేవుం డాతనియుద్దేశమును గ్రహించి "ద్రోణనందనా! నాచేఁబరిరక్షింపఁబడుచున్నయిప్పాండవుల నెవ్వరను నీయస్త్రమేమియుఁ జేయఁజాలదు. పాండవసంతానము నీవిదివఱకే విధ్వంసంబుగాఁజేసితివి నీవింకనునపాండవం బెట్లు సేయఁగలవు" అనియెను.

అశ్వ—శ్రీకృష్ణా! భగవత్స్వరూపుండవగు నీవెట్లుచేసిన నట్లే యగును. కాని, బ్రహ్మవంశతిలకుండను భారద్వాజపౌత్రుండనునగు నామాటమాత్రము వమ్ముకానేరదు.నాదివ్యా

స్త్రము నాసంకల్పము ననుసరించి, ఉత్తరాగర్భస్థంబగు శిశువును హరింపక మానదు.

శ్రీకృ— బ్రాహ్మణాశీర్వాదముచే నుత్తర భరతవంశోద్ధారకుం డగుపుత్త్రుం బ్రసవింపక తప్పదు. బ్రాహ్మణుండవగు నీచేఁ బ్రయోగింపఁబడిన యయ్యస్త్రము తనకార్యమును సాధించుకొనుఁగాక. నేనామృతశిశువును దైవబలముచేఁ బునర్జీవితునింగావించి పాండువంశము నుద్ధరించెదను.

అనుటయు నశ్వత్థామ సిగ్గుచేఁ దలవంచుకొని తచ్ఛిరోమణినిదీసి పాండవుల కర్పించి పరాభవక్లేశముచే హృదయము దహించుకొనిపోవుచుండ నుత్తరాభిముఖుండై మహారణ్యపథంబుపట్టి పోవుచు నాకస్మికక్రోధముచేఁ దా నొనరించిన యకార్యములంగూర్చి పరితపించుచుఁ బశ్చాత్తప్తచిత్తుండై యది మొదలుగ క్షత్త్రధర్మంబుఁబరిత్యజించి తామసంబువిడిచి తత్త్వగుణంబు నాశ్రయించి సత్కర్మంబులచేఁ బరిశుద్ధహృదయుండై క్రమంబుగ బ్రహ్మతేజస్సంపన్నుఁడై చిరంజీవి యయ్యెను.

మహాపురుషులగు వారు కాలకారణవశంబునంగలిగిన మనశ్చాంచల్యముచే నొడలెఱుంగక యాకస్మికముగ నేదేనొక యకార్యకరణంబుఁ గావించినను మరల స్వబుద్ధిచేతనే యాత్మదోషమును గ్రహించి పశ్చాత్తప్తులై యిట్లే పరిశుద్ధహృదయులై యావజ్జీవమును బవిత్రచరిత్రులై ప్రశంసనీయు లగుదురు.

చిరంజీవులు.

౨ బలిచక్రవర్తి.

శర్వు మెప్పించి వరవిశే ♦ షములఁగాంచి
త్రిజగముల గెల్చి విపులకీ ♦ ర్తినిగడించి
ధర దివి శిరంబు శౌరికి ♦ దానమొసఁగి
నట్టిబలిచక్రవర్తికి ♦ డగుదు రెవరు?

శ్రీమన్నారాయణుని చరణారవిందభక్తులలో నగ్రగణ్యుఁడగు ప్రహ్లాదు నెఱుఁగనివారు లేరు. ఆమహాత్మునికుమారుఁడు విరోచనుఁడు. ఆతని కుమారుఁడగు బలి చక్రవర్తియై త్రిజగంబులఁ బ్రసిద్ధింగాంచి మించెను. ఆతనియున్నతింగాంచి దేవతలు చింతించి యందఱు నేకీభవించి యెట్లయిననాతనిజయింపవలయునని మంత్రాలోచనంబు సేయనారంభించిరి.

ఆతని రాజ్యపాలనంబున ముల్లోకంబులును నిష్కంటకంబులై యుండెను. ఆతనిరాజ్యమునం దీతిబాధలుగాని, అధర్మముగాని, దుర్భిక్షముగాని, ఆర్తనాదములుగాని, ఉపద్రవములుగాని, వ్యాధులుగాని, శత్రుభయములుగాని యెవ్వరికినిగలలో

నైనఁ గానరాకుండెను. ఆతనియున్నతిచే దేవతలహృదయములును, ఆతని ఖడ్గధారచే వారిసకలాంగకములును, ఆతనిశాసనముచే వారిసకలగౌరవములును జెదరిపోయెను. ఆరాక్షసరాజేంద్రునికీర్తిచంద్రిక లగ్నిజ్వాలలవలెసకలదేవతాహృదయములను దహించివేయుచుండెను.

దేవత లందఱును బలిభయంబుచే విహ్వలులై మాత్సర్యవశంబున బృహస్పతియుపదేశంబువడసి వైకుంఠంబునకుం బోయి విష్ణుదేవుని సన్నిధిచేసికొని ప్రణామపూర్వకంబుగా దీనస్వరముతో "దేవదేవా! శంఖచక్రగదాధరా! దుర్బలుల మగుటచే నార్తులమైయున్నమమ్ము రక్షింపుము. జనార్దనా! నీవు మారక్షణంబుకొఱకే యాయుధములను ధరించితివి. నీవంటిరక్షకునిప్రాపుఁగాంచి యుండియు మేమిట్టికష్టముల ననుభవింపవలసియున్నది. దేవా! నిన్నుఁ గీర్తించుటకై వినియోగింపఁదగినమావాక్కుల నిపుడు ఆదైత్యుని సంస్తుతించుటకై యెట్లుపయోగింపఁగలుగుదుము? మేమందఱమును నీవే దిక్కుగా జీవించియున్నారము. నీపాదపద్మముల నాశ్రయించియున్నమే మాదనుజున కెట్లు నమస్కరింపఁగలము? అనేక యజ్ఞంబులయందు మేము నిన్నే యర్చించుచు నుదారవచనంబులతో నిన్నే కీర్తించుచుందుము. నీవంటిదేవదేవుని కాశ్రితులమగు మేమాతని నెట్లాశ్రయింతుము? ఇంద్రప్రముఖులగు దేవతలందఱును నీబలమే యాధారముగా నీ మూలమున

నున్నతపదముం గాంచియున్నారు. అట్టివారుహీనుండగునొక్క దైత్యునకు లోఁబడియుండుట యవమానకరముగాదా? దేవా! ఈజగంబునం దైశ్వర్యమే ప్రధానమైనది. అది లేకున్నచో లాభమేమున్నది? నిర్భాగ్యులమగు మే మిప్పుడాతని నెట్లనుకరింపఁగలము? ఆదిమధ్యాంతరహితుఁడవును, చరాచరగురుండవు.నగునీవుండఁగా వినశ్వరుండును శత్రుండు నగుదైత్యుని మేమెట్లుకొలిచియుండఁగలము? మేమందఱమును నీయనుగ్రహముచే నెప్పటికైన విజయులమై సుఖింతుముగాని యాదైత్యునకు వినతులమై యుండఁజాలము." అని యనేకవిధంబులఁ బ్రార్థించిరి.

గదాధరుండగు నారాయణుండును దేవతలయెడలఁ గరుణాళుండై "సురవరులారా! దైత్యేశ్వరుండగుబలి నాప్రియభక్తుఁడగు ప్రహ్లాదునకుఁ బౌత్త్రుఁడు; విశేషించి భగవద్భక్తులలో నగ్రగణ్యుఁడు. కావుననే యాతఁడు సురాసురగణంబుల కవధ్యుఁడై యున్నాఁడు. మీసంరక్షణభారమును వహింపవలసినట్లే యాతనిపరిపాలనాభారమునుగూడ నేను భరింపవలసియున్నది. నేనాతని నెదిరించి యుద్ధము చేయఁజాలను. సమయముంజూచి సదుపాయము నాలోచించి యెట్లయిన నాతని రాజ్యముంగైకొని మీకొసంగెదను. అంతవఱకును మీరు నిశ్చింతులై యుండుఁడు" అని యనుగ్రహించుటయు దేవతలు పరమానందహృదయములతో నమ్మహాదేవునికడ సెలవు గైకొని నిజనివాసంబులకుఁ బోయిరి.

ఇట బలిచక్రవర్తియుఁ జతుర్దశభువనములయందును దన్నెదిరించువా రెవ్వరును లేకయుండ ముల్లోకముల నేలుచు సార్వభౌముఁడై ప్రసిద్ధిం గాంచి తనకీర్తిచంద్రికలు దశదిశలయందును వ్యాపించి వర్ధిల్లుచుండ ననేక క్రతుసహస్రంబులు గావించి నిరంతరమును విప్రసహస్రంబులకుఁ బసిఁడిపళ్లెరంబులం దన్నదానంబుఁ గావించుచు భూరిదక్షిణలతో ననేకగోదానంబులు సేయుచు ధర్మకార్యతత్పరుండై ధర్మశాసనంబునఁ బ్రజాపాలనంబు సేయుచుండెను.

మహాదాతయును, మహాతేజుండును, మహాప్రభుండును, మహాఋషియు నగు నాబలిచక్రవర్తి యీవిధముగా సత్కాలక్షేపము సేయుచు నొకప్పు డశ్వమేధయాగదీక్షితుండై విధివిధానంబున యజ్ఞకార్యంబులు నిర్వర్తించుచుండెను. ఇట్లాతఁ డనేకభూసురపరివృతుండై తన్మధ్యంబున మహావిష్ణువుంబోలి తేజరిల్లుచున్న సమయంబున నాకస్మికముగ నొక బ్రాహ్మణవటువా సభామధ్యమునఁ బ్రవేశించెను. ఈతఁడు పరమేశ్వరుఁడో, పురుషోత్తముఁడో, భారతీనాథుఁడో యగుంగాని కేవల మానవమాత్రుఁడు కాఁడని సభ్యులందఱు నాతనింగాంచి తమలోఁ దాము గుజగుజలు వోవుచుండిరి. ఆవటుని తేజ మిట్టిదని వర్ణింప నలవిగానిదై చూపఱ కాశ్చర్యముం గొల్పుటయు సభవారందఱు చేతులుసాఁచి దయసేయుండని యాతనికిఁ బ్రత్యుత్థానముఁ గావింప నారంభించిరి.

కాని, యావటువుమాత్ర మొక్కఁడను గూరుచుండక కొందఱితోఁ దర్కవితర్కములును, గొందఱితో శబ్దచర్చయుఁ, గొందఱితో శాస్త్రచర్చయుఁ గావించుచు నపరిమితంబును మనోహరంబు నగు తనవాగ్ధోరణినుండి యమృతవర్షము గురియించుచుఁ గ్రమముగా నాపరిషత్తునంతను నాకర్షించివైచెను. ఏశాస్త్రము నెఱుఁగని మూఢులుగూడ నాతనిమాటలయందలి తేటతేనియలం గ్రోలుచు నన్యంబెఱుంగక సుందరుండగు నక్కుమారుని ముద్దుమొగమువంకనే చూచుచుఁ దన్మయులై యుండిరి. ఈవిధముగా నవరూపములు ధరియించిన వేదరాశియుంబోలె నావటువు దండమును, గొడుగును, బట్టుకొని కక్షతలంబున భిక్షాపాత్రము వ్రేలాడుచుండ నింద్రనీలంపుఁగోవలవలె నున్న కురుచజడలు, కన్నులకింపులింపుచుండ సభ్యులను దప్పించుకొనుచు నెఱింగినవాఁడునుంబోలె నందఱిని సేమమడుగుచు నడుమ నడుమఁ గోమలమధురకంఠస్వరముతో సామగానము సేయుచు యజ్ఞదీక్షితుండగు బలిచక్రవర్తిని సమీపించి కుశపవిత్రాంకితంబగు దక్షిణహస్తంబు సాఁచి "ఇతఁడే నాదానవలోకచక్రవర్తి?" అని ప్రశంసించి గంభీరస్వరముతో "నిఖిలబృందారకగర్వాపనయప్రవర్తికి, వివిధదానాభరణాసురత్తికి, బలిచక్రవర్తికి! స్వస్తి, స్వస్తి" యనియాశీర్వదించెను.

అప్పుడు బలిచక్రవర్తి ప్రహృష్టమానసుండై లేచి యక్కుమారునకు సాష్టాంగనమస్కారంబు చేసి యాతని నుచి

తాసనంబున నాసీనుం గావించి సహధర్మిణియగు వింధ్యావళీదేవి సమయ మెఱింగి కనకకలశంబులఁ గొని తెచ్చిన పాద్యజలంబులచే నాతనిపాదకమలములు బంగారుపళ్లెరమున నుంచి యభిషేచనంబుఁ గావించి యాపవిత్రోదకమును బత్నీసహితంబుగ శిరంబునఁ జల్లుకొని వినయమధురస్వరముతో "వటుగా! నీవెవ్వరివాఁడవు? నీనివాసంబెచ్చట? నీవిచ్చటికి విచ్చేయుటచే నేనుతరించితిని. నావంశమంతయునుదరించినది. నాయజ్ఞము సఫలంబైనది. అగ్నిహోత్రంబులు సంపన్నంబులైనవి. నీదర్శనలాభముచే నీసమయము కల్యాణకరంబైనది. నీయాగమనకారణంబు వచియించి నన్ననుగ్రహింపుము. నీకలంకారములు కావలయునేని యమూల్యమణిఖచితంబులగుసువర్ణభూషణంబులచేనిన్నలంకరించెదను. పరిణయముం గోరుదువేని త్రిలోకసుందరీమణులగు కన్యారత్నములనిచ్చి నీకుఁగల్యాణంబుఁగావించెదను. ప్రభుత్వమునభిలషించినచో సర్వసంపత్సమృద్ధంబులగు గ్రామముల నీకర్పించెదను. సార్వభౌమత్వము నభ్యర్థించెదవేని యీత్రైలోక్యసింహాసనంబున నిన్నుఁబ్రతిష్ఠించి నీకభిషేకంబు గావించెదను. వటుశిరోమణీ! నీకేమికావలయునోకోరుము. ఈక్షణంబ నీయభీష్టంబుఁ దీర్చి చరితార్థుండ నయ్యెదను." అనివిన్నవించెను.

అంతవామనుండు తనముద్దుమోమునకు లేఁతనవ్వువన్నెలుఁదిద్దుచుండ మృదుమధురగంభీరస్వరముతో "ఓదానవసార్వభౌమా! నిలుచుటకు నాకొకనివాస మనునదిలేదు. నే నెల్లయెడల నివసించుచుందును. నేనెవ్వరివాఁడనని చెప్పుదును? నావారందఱిలోనను నేను నాయంతవాఁడనై తిరుగుచుందును. ఎల్లవృత్తుల నవలంబించియున్ననాకు నిదివృత్తియని చెప్పుటకవకాశమేమున్నది? అన్నియు నేర్చియున్ననేను ప్రత్యేకముగనేది నేర్తునని చెప్పుదును? మహారాజా! నాకెవ్వరునులేరు. నేనందఱివాఁడనై యున్నాను. ఒంటివాఁడను. నాకొక్కచుట్టమైనను లేఁడు. పూర్వము నేను శ్రీమంతుఁడనే. నేను తఱచుగా సాధుసంఘమున సంచరించుచుందును. నామాట యటుండనిమ్ము. నీవిప్పుడుచెప్పినమాట కీర్తికరంబును గులోచితంబును ధర్మయుతంబునై యున్నది.

కరుణార్ద్రహృదయులును పరాక్రమసంపన్నులును గానివారు మీకులంబున జనియింపరు. రణభీరువులును వితరణభీరువులును మీవారిలో లేరు. శత్రువులను మహారణంబులను యాచకులను మహావితరణంబులను దనుపుచుఁ బ్రశంసనీయులైన మీతాతలందఱును మేటిమగలు. ఆకాశమును జంద్రునివలె మీకులమునంతను వెలయించిన ప్రహ్లాదుఁడు మీపితామహుఁడు. మీవంశము రత్నాకరమువలె భాగ్యగౌరవములచేఁ బ్రశంసనీయమైనది. మీమూఁడవతాత యగుహిరణ్యాక్షునిపరాక్రమమునకు భయపడి విష్ణుండు పలాయితుఁడై యజ్ఞవరాహరూపమును ధరించి పాతాళలోకంబున వసియించెను. నీతం

డ్రియగువిరోచనుఁ డొకప్పుడు బ్రాహ్మణవేషముతో వచ్చి తన్నుయాచించినదేవేంద్రునకుఁ తనయాయువునే సమర్పించెను. అట్టిదానవీరులగు దానవశేఖరులవంశమునందు ప్రభవించిననీవుమాత్రము సామాన్యుఁడవా? నీఘనతననుసరించి నీవింతయుదారబుద్ధితో నేదేనొకమహావరమును గోరుకొమ్మని వచించితివి. కాని, నీమణులును, మాన్యములును, గ్రామములును, సామ్రాజ్యమును నాకెందులకు? జగంబులెల్ల నీదానయశోగీతి కలఁ బాడుచుండ వినుచుండియు నేను నిన్నెన్నఁడును యాచింపరాలేదు, ఏకాకి నగునాకు నొకటిరెండడుగులనేల యిచ్చితివేని చాలును. అదియే నాకు బ్రహ్మాండము." అనివచించెను.

అప్పుడు బలిచక్రవర్తి పరమయాచకుండగు విప్రకుమారుంగాంచి "ఓచిన్నివడుగా! నీమాటలన్నియు యుక్తియుక్తములును, సత్యములును, సాధుసమ్మతములు నైయున్నవి. కాని, నీవడుగఁదలంచియును గొంచెపుగోరికంగోరితివి; పసిబాలుఁడవు. అడుగుట చేతఁగానివాఁడవు. దాతపెంపైనను దలంపవలదా? ధనకనకవస్తువాహనాదులును, కన్యకామణులును, గ్రామములును, రాజ్యములును నుండఁగా నీవు గోరిన దిదియా? నీయదృష్ట మింతటిదే యైనఁ గావచ్చునుగాని, దానవసార్వభౌముఁడ నగు నాకీయల్పదానము గావించుట చిన్నతనముగాదా?" అనియెను.

ఆమాటలకు వామనుండు మందహాసంబుఁ జేయుచు "వదాన్యశేఖరా! గొడుగును, జన్నిదమును, కమండలువును, మౌంజియు, దండమును దాల్చి నిత్యోచితకర్మంబులఁ గావించుకొనుచుండు వటువునగు నేనెక్కడ? భూములును, గజాశ్వాదులును, మణులును, కన్యకామణులును, రాజ్యములును నెక్కడ? నేనడిగినమూఁడడుగులనేలయు లేదనకుండ నిచ్చుటయే నాకుఁజాలును. సంతుష్టిలేనియాచకుఁడు సంతాపభాజనుఁ డగును. సంప్రాప్తంబైనతృణమే మహామేరువుగా భావించి సంతోషించువానికి సుఖసామ్రాజ్యము కరతలామలకం బగును. ఆశాపాశమున కంతమెక్కడనున్నది? సముద్రవలయితంబగు సామ్రాజ్యముచేకూరినను వైన్యగయాదిమహారాజు లర్థలోభమును విడువఁజాలకపోయిరి. నీవు మహారాజు వని సర్వస్వమును నిన్నడుగుట యుచితముకాదు. నాకుఁ దగినట్లు నేనీమూఁడడుగులనేలను వేఁడికొంటిని" అనియెను.

బలిచక్రవర్తి కట్టియల్పదానమును జేయుట కసంతుష్టిగానున్నను, పాత్రగౌరవమునుబట్టి యాతని కాభూదానంబు సేయ నిశ్చయించి జలకలశంబు నందికొనుటయు దానకుతుకసాంద్రుండగు నాదానవేంద్రుంగాంచి దనుజకులగురుండు భృగువరుం డిట్లనియెను.

"దనుజేంద్రా! ఈతఁడు కేవల విప్రకుమారుఁడు కాఁడు. దేవకార్యమును సాధించుటకై విష్ణుదేవుఁ డీవిధముగా నదితిగ

ర్భమునఁ గశ్యపపుత్త్రుఁడై జన్మించినాఁడు. ఈవిషయము నెఱుంగక నీవీతనిఁగోర్కెఁదీర్ప నిశ్చయించితివి. ఇందువలన దైత్యకులంబున కంతకు నుపద్రవంబు రాఁగలదు. ఈతఁడు నిన్ను వంచించి నీయైశ్వర్యమును, దేజమును, రాజ్యమునుగూడ వాసవునకుఁ బ్రసాదింపఁదలంచి యున్నాఁడు. ఈతఁడు నిన్నడిగినమూఁడడుగులదానముచేతను ముల్లోకముల నాక్రమింపఁగలఁడు. సర్వస్వమును విష్ణుదేవున కర్పించి దీనుఁడవై నీ వెట్లు బ్రదుకఁగలవు? ఇచ్చెదనని వాగ్దానముచేసి యీయకుండువానికి నరకప్రాప్తియగుననుట సత్యమే. కాని, యేదానముచే సర్వనాశనము కలుగునో యది దానము కాదని పెద్దలు వక్కాణించియున్నారు. ధనవంతుఁడగువాఁడు తనసర్వస్వము నైదుభాగములుగాఁ జేసి ధర్మార్థకామములకును, గీర్తికిని, నాశ్రితులకును, సమముగా వెచ్చింపవలయును. అట్టివారికే యిహపరసుఖంబులు గలవు. తనకుమాలినధర్మము తగదు. కేవలసత్యముకొఱకు భ్రమపడి సర్వస్వమును దానముచేసినచో నీకేమిలాభమున్నది? నిన్ను నీవు రక్షించుకొని పిదప నీవు నీధర్మమును నిలుపుకొనవలయును. స్త్రీలవిషయమునను, వివాహవిషయమునను, ప్రాణాపాయసమయమునను, ధనమానహానియందును, భీతవిప్రసంరక్షణమునందును, గోరక్షణమునందును నన్నృతమాడినను బాపము వాటిల్లనేరదు. ఈదానమువలన నీకే కాక నీకులమునకంతకు నపాయము రానైయున్నది, కావున నీవిప్పట్టుననసత్యమాడినను దోషము లేదు."

అని యిట్లు హితోపదేశంబు సేయుచున్న శుక్రాచార్యుం గాంచి యించుకసేపు నిమీలితలోచనుండై యోచించి "మహాత్మా! అనృతమాడినచో నొకవిషయమున దోషముండుననుటయు, వేఱొకవిషయమున దోషము లేదనుటయు, నాకంతసమంజసముగా నగపడుటలేదు. నేను తొలుదొల్త నీవడుగునకు నర్థము, కామము, యశము, వృత్తి, యనువానిలో నేదికోరినన దియిచ్చెదనని మాటయిచ్చితిని. అర్థలోభముచే నిప్పు డీతనిం బొమ్మని లోకులయపవాదమునకుఁ బాత్రుఁడనగుటకంటె నిఁకఁ బాపమేమున్నది? భూదేవి యెంతటిపాపాత్ములైనను మోయఁజాలును గాని యసత్యవాదిని మాత్రము భరింపఁజాలనని చెప్పియున్నది. యుద్ధమున వెనుదిరుగక చచ్చుటకంటెను, పలికి బొంకక బ్రతుకుటకంటెను, మించిన సౌభాగ్యము మానధనుల కిఁక నేమున్నది? రాజులు లేరా? ఐశ్వర్యములు లేవా? అందొకచిల్లిగవ్వయైన మూటఁగట్టుకొని పోయినవారెవ్వరైన నున్నారా? ఈలోకంబున వారిపేరైన నున్నదా? కాని, కీర్తికాములై యర్థులు కోరినకోరికలనొసంగి ధన్యులైన శిబిప్రముఖుల నెన్నటికైన మఱవఁగలమా! ఆచార్యవర్యా! మీరన్నట్లీవడుగు నారాయణుఁడే యగుఁగాక! ఎన్ని యోయజ్ఞములు గావించినను వ్రతములనాచరించినను, అందని సర్వేశ్వరుఁ డీపొట్టివడుగు రూపమున వచ్చి నన్ను యాచించినప్పు డీతని యభీష్టమును దీర్చుటకంటె నాకుఁ గావలసినదేమున్నది?

సకలప్రాణిలోకమునకును నిత్యజీవనప్రదానముం గావించు చుండు శ్రీనాథుని కరకమలంబు క్రిందగుటయు నాచేయిమీఁ దగుటయు మేలుగాదా? ఈరాజ్యమును గీజ్యమును శాశ్వత మా? ఈజీవితము సుస్థిరమా? నరకమైనను, నిర్బంధమైనను, నాశనమైనను, దుర్మరణమైనను, కులాంతమైనను సరియే; నేను సత్యముఁ దప్పఁజాలను. ఈయతిథి హరుఁడైనను, హరియైనను, అజ్ఞానుఁడైన నగుఁగాక! నామాట తిరుగనేరదు. మేరువు తలక్రిందులైనను, సముద్రము లింకిపోయినను, ధరాతలము నుగ్గైపోయినను, గ్రహగతులు తప్పిపోయిననుపోవుఁగాక! నేనీ దానము నొసంగక తప్పువాఁడనుగాను. ఎన్నఁడు నితరులవేఁ డనివాఁడును, నేకాత్ముఁడును, సర్వవిద్యలకు మూలకారణుఁడు ను నగు నీపొట్టివడుగు చేతులొగ్గి యాచించుచుండ లేదనిచె ప్పుటకు నానోరెట్లాడును?" అని వచించెను.

ఇట్లు దృఢనిశ్చయుండై దానాచరణమునకుఁ ద్వరపడు చున్న సత్యసంధుండును, కీర్తికాముండును, నైన బలింజూచి దనుజకులపురోహితుండగు శుక్రుండు కోపించి "నాయుపదే శంబును దిరస్కరించిన స్వేచ్ఛాచారుండవగు నీవచిరకాలంబు ననే పదభ్రష్టుండ వయ్యెదవుగాక!" అని శాపంబిచ్చెను. కుల గురునిచే నట్లు శపింపఁబడియు, నిశ్చలచిత్తుండగు బలిచక్ర వర్తి యనృతమార్గంబున కభిముఖుండు గాకుండెను. ఎట్టినిర్బం ధములు దటస్థించినను, ఎంత లేమివచ్చినను, ఎట్టిప్రాణసంక

టములు సంఘటిల్లినను మానధనులెన్నఁటికిని మాటఁ దిరుగఁ జాలరుగదా!

ఆసమయంబున నాథుండగు దనుజేశ్వరుని కనుసన్న నెఱింగి సహధర్మిణియగు వింధ్యావళీదేవి జలకలశంబు గొని తెచ్చెను. వదాన్యశిరోమణియగు బలిచక్రవర్తి యప్పుడక్క పటవటుని దక్షిణపాదమును బంగరుపళ్ళెమునందుంచి భక్తిపూ ర్వకంబుగా వింధ్యావళీదేవి జలంబులు వోయ, నిర్మలచిత్త ముతో సకలలోకసముద్ధరణంబును, భవసంహారణంబును, నగు నాశ్రీహరిచరణంబు నభిషేకించి యాజలంబుల శిరంబునఁ జల్లి కొని యాతనిదక్షిణహస్తమున దానజలధారను విడువఁబోవఁ గలశరంధ్రమునుండి జలంబు వెలువడ దయ్యెను. అప్పుడు విశ్వాత్ముండగు వామనమూర్తి కలశరంధ్రమునకు శుక్రుం డడ్డుపడియెనని గ్రహించి యటఁ గుశాగ్రంబునఁ బొడుచుట యుఁ గన్నులొట్టవోయి శుక్రుఁడచ్చటినుండి తొలఁగిపోయెను. తోడనే బలిచక్రవర్తి "విష్ణుస్వరూపుఁడవును, విప్రుఁడవును, వేదవేద్యుఁడవును నగునీకు మూఁడడుగుల నేలను దానముచే యుచున్నాఁడను." అనిచెప్పుచు దానజలధార నావామనుని దక్షిణహస్తమున విడిచిపెట్టెను. అర్థివిష్ణుండని యెఱింగియు నాత్మవినాశంబును నెఱింగియుఁ గులగురుని యుపదేశము సత్య మని యెఱింగియు, సత్పాత్రము లభించెనుగదా యనుసంతో షముతో సర్వస్వమును దానముచేసిన బలివంటి వదాన్యు లీలోకములో నెవ్వరున్నారు?

వామనుండిట్లు భూదానమును బరిగ్రహించి "రాజేంద్రా! నీవిహపరలోకంబులయందుఁ గీర్తిసుకృతంబులుబడయఁ గలవు. నేనింతటిచిన్నకోరికం గోరితినని విచారింపకుము. మాకిది యిచ్చుట ముల్లోకములు నిచ్చుటయే" అనివచించుటయు నాచిట్టివడుగు ముద్దుపలుకులకుఁ బలిచక్రవర్తి పరమానందభరితుం డయ్యెను. దానవీరుండగు బలియొసంగిన భూదానంబునకు సర్వభూతనాథుండగు పరమేశ్వరుండు సంతుష్టుండగుటచే నట్టిదానముంగూర్చి దశదిశలును బంచభూతములునుఁగూడఁ బ్రశంసించెను. సకలగ్రహతారకంబులును, మునీంద్రులును,సిద్ధగంధర్వకిన్నరాదులును, దేవతలును గూడ దానవీరుండగు బలిసార్వభౌము ననేకవిధములఁ గీర్తించిరి. సకలలోకానందసూచకముగాఁ బుష్పవర్షములు గురిసెను. దేవదుందుభులు మొరసెను.

అప్పుడు వామనమూర్తి చూచుచుండఁగనే క్రమక్రమముగ నెదిగి మేఘమండలమునంటి, చంద్రమండలమునుదాఁటి, ధ్రువస్థానము నతిక్రమించి,సత్యపథము నధిగమించి, సకలలోకంబులును గడచి, బ్రహ్మాండమంతయు నాక్రమించి యెల్లయెడలఁ దానయై విశ్వరూపంబుఁ దాల్చి శతకోటివిద్యుల్లతాతేజంబునుమించి విరాజిల్లుచుండెను.ఆవిశ్వరూపదివ్యతేజము కంటికినిమింటికినినందకుండ వ్యాపించియుండుటయు మిఱుమిట్లుగొనుచున్నకన్నులతో నాదివ్యతేజమునుగాంచనేరక బలిసార్వ

భౌముండును సభాసదులునుగూడ నాదేవదేవు ననేకవిధంబులఁ బ్రస్తుతింప నారంభించిరి. ఆవిశ్వమూర్తి, ఒక్కపాదంబుచే భూమండలమును, వేఱొకపాదముచే గగనమండలమునుగూడ నాక్రమించి బ్రహ్మాండమునిండి వాక్కులకును దృష్టులకును గూడ నందరాక సర్వమయుండై వెలుంగుచు మరలఁ గ్రమక్రమంబుగ వామనాకారంబు వహించి నిలువంబడియెను.

అప్పు డక్కపటవటుకుమారుని మోసమును గ్రహించి రాక్షసులందఱును రోషావేశముచే నాతని నాక్రమింపఁ విజృంభించిరి. అది యంతయుంగాంచి బలీంద్రుండు శుక్రశాపంబుఁ దలంచుకొని శాంతంబువహించి తమవారిని వారించుచు "ఓరాక్షసవరులారా! ఇది పోరాటమునకు సమయము కాదు.

సర్వజీవసంపదలకును, ఆపదలకును, . కారణస్వరూపుఁడైన పరమేశ్వరుని మనము పరిభవింపఁజాలుదుమా? మనకు విజయమును దేవతల కపజయంబును గటాక్షించిన యావిశ్వనాథుఁడే యిట్లు విపరీతముచేయుట మన దురదృష్టముగాక వేఱేమున్నది? మిమ్ముఁ గనుఁగొన్నంతనే భయపడి యెన్నియోసారులు పలాయితులైన విష్ణుభటు లిప్పుడు మిమ్మెదిరించి నిలుచుట దైవలోపముకాదా? మనకు మంచిదినములువచ్చినప్పుడు క్రమ్మఱ మనము మనశత్రువులను జయింతముగాక!

ఇప్పటికి శాంతివహింపుఁడు" అని ప్రబోధించుటయు నిరుత్సాహులై రక్కసులు రసాతలంబునకుఁ బోయిరి.

ఆసమయంబున దేవదేవుని హృదయంబెఱింగి గరుఁడుఁడు దనుజవల్లభుని వారుణపాశంబులచే బంధించెను. బలిచక్రవర్తి యట్లు బంధితుండయ్యును నదియంతయు నీశ్వరానుగ్రహమే యని భావించుచు నిశ్చలచిత్తముతో నిలుచుటయు దశదిశల, దిగంతములయం దాహాకారంబులు బయలువెడలెను. దైన్యమును గంపమును లేక మునుపటికంటెను ధైర్యమును సాహసమును మెఱయుచుండ జ్ఞానతేజంబున వెలయుచున్న వదాన్యమూర్తియగు బలిచక్రవర్తిం గాంచి వామనమూర్తి "ఓయీ! నీవు నాకు మూఁడడుగులభూమి దానముచేసితివి. ఈభూమండలమును గగనమండలమునుగూడ నాకు రెండడుగులయ్యెను. మూఁడవయడుగున కిఁక నెచ్చటనైనఁ దావున్నదా? ఇయ్యఁగలవా? దానముచేసి యియ్యకున్నచో మహాపాపము సంఘటిల్లును. పాపంబుఁ దప్పించుకొనఁదలఁచినచో శీఘ్రముగ నాకు మూఁడవపదమునకుఁ దావుచూపుము" అనివామనుండు నిరోధించుటయు సత్యభంగశంక హృదయమును గలంచుచున్నను బలీంద్రుండు ధైర్యంబువిడనాడక నిర్భీకుండై ప్రసన్నవదనముతో "వటుశిఖామణీ! నాజిహ్వా కసత్యలేశస్పర్శమైనను లేదు. ఎట్టికష్టసమయమునందైనను నేను బొంకనొల్లను. నేనసత్యమునకు వెఱచినట్లు నరకమునకైనను నిగ్రహంబునకైనను పదభంగమునకైనను నిర్బంధమునకైనను సర్వనాశనమునకైనను మఱియెట్టిదుఃఖమునకైనను వెఱచువాఁడనుగాను. నీమూఁడవపదము నాశిరంబున నుంచుము. దేవా! నీకీయరానిదేమున్నది? మృత్యువు చెలిమికత్తెయగునా? యముఁడు చుట్టమగునా? యమకింకరులు పరిచారకు లగుదురా? జీవితముసుస్థిర మగునా? మూఢు లీసంసారమును నిత్యముగా భావించి సత్యదానధర్మవిముఖులై దుర్గతులపాలగుచుందురు. మహాత్మా! మాతాతయగు ప్రహ్లాదుఁ డొక్కఁడుమాత్రమే నీపాదకమలంబుల నాశ్రయింపఁగలిగెను. కావుననే యాతనికి మృతిలేని బ్రదుకు గలిగెను. కాని, తక్కినమావారందఱును వైరులైకాని నిన్ను దర్శింపఁజాలకపోయిరి. నీవిపుడు యాచకుఁడవై నాయొద్దకువచ్చి నన్నర్థించుట నాపుణ్యఫలముకాదా?" అని యానందపారవశ్యమునఁ బలుకుచున్నసమయంబున నాకస్మికముగఁ బ్రహ్లాదుం డచ్చట సాక్షాత్కరించుట నసురవల్లభుఁడు వారుణపాశబద్ధుండు గావునఁ దాతకుఁ జేయెత్తిమ్రొక్కఁజాలక బాష్పాకులితలోచనుండై సిగ్గునఁదలవంచు నెపంబున మ్రొక్కు చెల్లించుకొనియెను.

అప్పుడు ప్రహ్లాదుఁడు వామనమూర్తిం గాంచి మొడలు పులకింప నానందబాష్పంబులు వెల్లివిరియ సాష్టాంగదండప్రణామం బాచరించి "మహాదేవా! తొల్లి నీవీతని కింద్రపదం బిచ్చి మరలఁ గైకొనుట మేలేయైనది. నీవీతనియజ్ఞానాంధకా

రకును మాన్పి కరుణతో రక్షించుటగాని యొది బాధించుట గాదు. జ్ఞానమూర్తులకు స్వర్గముతోఁ బనియేమున్నది? 'మహేంద్రత్వముతోఁ బనియేమున్నది? మీపాదసేవకు మించిన భాగ్యము మఱి యెచ్చటనున్నది?" అని విన్నవించుచుండఁగాఁ గన్నులనుండి బాష్పకణంబు లాణిముత్తియములవలె జాలు వాఱుచుండ నిటలతటఘటితాంజలియై వింధ్యావళీదేవి మందగమనంబుతో వామనమూర్తిని సమీపించి "పతిభిక్షాం దేహి" యనిప్రార్థించుచు దేవదేవునిచరణసన్నిధిని బ్రణామంబుఁగావించి నిలువఁబడి "దేవదేవా! నీకుఁ గ్రీడారంగములగు నీలోకములంగాంచి దుర్మదాంధులగురాజులు మేము లోకాధీశుల మనుకొనుచుందురు. సర్వేశ్వరా! ఈలోకంబునందు నీకంటెఁ బ్రభుఁ డెవ్వఁడున్నాఁడు? ప్రభూ! నానాథుఁడు సత్యసంధుఁడు. రాజ్యమదంబునఁ గన్నుఁగాననివాఁడుగాఁడు. నిన్నుఁగాదన లేదు. నీకిచ్చినది లేదనలేదు. నిశ్చలహృదయముతో నీజగత్త్రయంబును నీకర్పించియున్నాఁడు. ఇట్టినాస్వామిని నీప్రియభక్తుని పౌత్త్రుని నిర్దయుండవై యీవిధముగా నేలబంధించెదవు? ఆశ్రితవత్సలా! రక్షింపుము! రక్షింపుము!!" అని ప్రార్థించెను.

అప్పుడు పరమేశ్వరుండగువామనుండు ప్రసన్నుండై "సతీమణీ! మానధనుండగు దానవేంద్రునిసహధర్మిణివగునీవు ధన్యురాలవు. పుణ్యమయంబగుమీదాంపత్యము ప్రశంసనీయమైనది." అని యనుగ్రహించి బలీంద్రు నవలోకించి "దానవేశ్వరా! నీనిశ్చలహృదయంబునకును ననుపమానంబగు నీదానదీక్షకును సత్యనిష్ఠకును నేను సంప్రీతుండనైతిని. నీయభీష్టవరప్రదానంబు గావించెదను. కోరుకొమ్ము" అని యానతిచ్చెను.

కాని, సర్వజ్ఞుండును, శాంతుండును, సంతుష్టుండును, సాధుశీలుండు నగుబలిసార్వభౌండు నిరపేక్షుండై యూరకుండెను. అప్పుడు జగన్నాథుండును ద్రివిక్రముండునగువిష్ణుదేవుండు సంతోషించి మహాదానశీలుండగు దనుజలోకపాలునకు రసాతలరాజ్యంబును నాత్మాధిపత్యంబును భావికాలంబున నింద్రపదంబును శాశ్వతంబగుమహాయశంబును జిరజీవనమును బ్రసాదించి సస్త్రీకుండగు బలిదానవేంద్రుని సపరివారముగా రసాతలరాజ్యసింహాసనమునఁ బ్రతిష్ఠించెను.

చిరంజీవులు.

3 వేదవ్యాసుఁడు.

వేదములను నాల్గు ♦ విధముల భాగించి
పుణ్యతమపురాణ ♦ ముల రచించి
జగతియందు ధర్మ ♦ సంస్థాపనముఁ జేసి
నట్టివ్యాసమౌని ♦ నభినుతింతు.

బ్రహ్మమానసపుత్త్రుండును, బుణ్యశ్లోకుండు నైన వసిష్ఠమునీంద్రుఁడు త్రిలోకవిదితుఁడు. ఆతనికుమారుఁడు శక్త్రి. ఆశక్త్రికిఁ బరాశరుఁడు జన్మించెను. బ్రహ్మతేజస్సంపన్నుఁడగు నప్పరాశరుండు నియతవ్రతుండై తీర్థయాత్రలఁ గావించుచుండెను. ఆతనియనుగ్రహంబున జాలరికన్నెయగుమత్స్యగంధిగర్భమునుండి, దివ్యజ్ఞానసంపన్నుండును, దివ్యతేజోమయుండును, సకలవేదశాస్త్రపరిజ్ఞాతయు, నగువ్యాసమహర్షి యుదయించెను. వ్యాసమునీంద్రుండు పుట్టినప్పుడ సద్యోయావనుండై, జననింగాంచి నమస్కరించి "అమ్మా! నీవుతలంచినప్పుడు వచ్చి నీయాజ్ఞను నెఱవేర్చుచుండెదను. తపశ్చరణంబునకు

నాకనుజ్ఞ నీయవలయును." అని వేఁడికొని, తల్లిని వీడుకొని, తపంబునకు వెడలిపోయెను.

ఆతఁడు పుట్టుకతోడనే జ్ఞానవంతుండగుటచే శ్రీహరిచరణభక్తుండై మహాతపమునుగావించి విజ్ఞానంబు వడసి నిరంతరమును జగత్సంచారము సేయుచు నజ్ఞానులును, నధోగతులునగురాజులకును, ప్రజలకును, జ్ఞానోపదేశముగావించుచుఁ దనజీవితమంతయు లోకోపకారమునకే వినియోగించి స్వజనస్తవనీయచరిత్రుఁడయ్యెను.

శ్రీమన్నారాయణుని యేకవింశత్యవతారములలోపలను బదునేడవది వ్యాసావతారమని భాగవతమునందుఁ బ్రశంసింపఁబడియున్నది. ఆతఁడు చిన్నతనమునుండియుఁ బ్రజ్ఞానసంపన్నుఁడై లోకావనంబుకొఱకు సత్కర్మంబుల నాచరించుచుఁ గాలక్షేపము సేయుచుండెను. ఆతఁడొకప్పుడు సరస్వతీనదీతీరమునం దుపవసించి వేదములంగూర్చి యాలోచించుచు జ్ఞానస్వరూపమగు వేదమి ట్లేకముఖంబుగా నుండుట సరిగాదనితలంచి భూతభవిష్యద్వర్తమానకాలంబులఁ బరిశీలించి భావికాలంబున క్షీణశక్తులును, నిస్తేజులును, ధైర్యశూన్యులును, మందప్రజ్ఞులును, నల్పాయువులును, దుర్బలులును జనింతురనియుఁ గాలవశమున జనులు క్రూరులును, నసత్యవాదులును నధర్మపరులునై యధోగతులగుదురనియు భావించి యట్టివారి నుద్ధరించుటకై శుద్ధికరంబులగు వైదికకర్మంబులును, యజ్ఞంబులును, నెడతెగ

కుండ నాచరితంబులు గావలయు ననియు నిశ్చయించి, యేక
ముఖంబగు వేదమును, చతుర్విధంబుల విభాగింప నెంచి, సర
స్వతీజలంబులఁ గృతస్నానుండై నిత్యకర్మంబులం దీర్చి నియ
తుండై ఋగ్యజుస్సామాథర్వణనామంబులచే వేదవిభాగంబుఁ
గావించెను. అందు ఋగ్వేదము పైలునకును, యజుర్వేదము
వైశంపాయనునకును, సామవేదము జైమినికిని, అథర్వణవేద
ము సుమంతునికిని నుపదేశించి, వారిచే నావేదములను లోక
కల్యాణముకొఱకు సర్వదేశములయందును బ్రకాశింపఁజేసెను.
అందుమూలముననే మునివరుండగు వ్యాసునకు వేదవ్యాసనా
మ మన్వర్థమైనది.

తరువాతఁ గ్రమక్రమముగ జగంబునందలి ప్రజలలో
భిన్నాభిప్రాయములు గలిగి, సర్వప్రపంచమునకును గర్తయ
గువాఁడు శివుఁడేకాని, యితరులు కారని కొందఱును, విష్ణువే
సర్వేశ్వరుఁడని మఱికొందఱును, సృష్టికర్తయగు బ్రహ్మయే
విశ్వనాథుఁడని వేఱొకకొందఱును, జీవకోటియంతయు సృ
ష్టింపఁబడుట కాధారము మహాశక్తియే యని యింకఁగొంద
ఱును దర్కవితర్కములం జేయుచు, వివిధమార్గముల నవలం
బించి విధివిధానముల నెఱుంగక పెడత్రోవలం బట్టి చెడు
చుండుటచే, భూలోకమునం దనాచారవాహినులు పొంగిపొరలి
తత్ప్రవాహంబునఁ బడి జీవకోటులు కొట్టుకొనిపోవుదు రేమో
యను భయంబున ధర్మసంస్థాపకుండగు వేదవ్యాసుండు శ్రుతి

ధర్మబోధకంబులును, నిహపర సాధకంబులునగు మాత్స్యము,
కౌర్మము, వారాహము, శైవము, వైష్ణవము, పాద్మము, గా
రుడము, బ్రహ్మవైవర్తము, భాగవతము, నారదీయము, మా
ర్కండేయము, లైంగము, స్కాందము, బ్రహ్మాండము, ఆగ్నే
యము, భవిష్యము, వామనము, బ్రాహ్మము నను పదునెని
మిదిపురాణంబులను రచియించి శిష్యులచే జగద్రంగమున
వ్యాపింపఁజేసెను. క్రమముగా నాపురాణములు జగత్ప్రసిద్ధము
లై సర్వజనాదరణీయములై యాధర్మ ప్రవాహసేతువులై
నాఁడు మొదలు నేఁటివఱకును, జ్ఞానరత్నాకరములై, పఠ
నీయములై ప్రశంసనీయము లగుచున్నవి.

అందువలన వేదవ్యాసుం డపరవిష్ణుస్వరూపుఁడై, సం
యమీంద్రులలో శ్రేష్ఠుఁడై, ప్రభావగరిష్ఠుఁడై, అజ్ఞానులకు
దివ్యదృష్టిప్రదాతయై, అవతరించిన విజ్ఞానచంద్రుఁడో యనవి
రాజిల్లుచుండెను. ఈమహాత్ముఁడు నిరంతరమును నధర్మపరుల
ను సన్మార్గమునకు మరలించుటయే తనజీవితోద్దేశముగా
భావించుకొనుచుండును.

ఇట్లు భగవానుండైన వేదవ్యాసుం డొకానొకప్పుడు
సకలగుణసంపన్నుఁడును, దేవతుల్యుండును నగునొకపుత్త్రునిఁ
బడయవలయు ననియుద్దేశించి వాయుభక్షణంబు సేయుచు
మహాదేవుంగూర్చి యత్యద్భుతంబగు కఠోరతపంబు గావింప
నారంభించెను. ఇట్లొకసంవత్సరంబు గడచెను. అట్టితపఃప్రభా

వముచే నాతనిజటాపటలమునుండి యగ్నిజ్వాలలు బయలుదేఱెను. ఇదియంతయుఁగాంచి త్రిభువనంబులవారును విభ్రాంతులై పోయిరి.

మహాదేవుం డమ్మహర్షి తపంబునకు సంతుష్టుండై సాక్షాత్కరించి "మునిశ్రేష్ఠా! నీకచిరకాలంబున నేపంచభూతంబులం బోలి పవిత్రుండును, పరమకళ్యాణగుణుండును నగు నొకపుత్త్రుండు లభింపఁగలఁడు. ఆతఁడు మనఃప్రాణంబులు భగవదధీనంబులుగాఁ జేసి చరించుచు ముల్లోకంబులయందును శాశ్వతకీర్తినందఁగలఁడు" అని యానతిచ్చుటయు వ్యాసుండు పరమానందభరితుండై, మహాదేవునకు నమస్కరించి తపంబు చాలించి నిజాశ్రమంబునకుం బోయెను. అట నాతఁ డొకప్పు డగ్నికార్యంబుఁదీర్ప నుద్యోగించి యరణిమథించుచుండ నయ్యరణిదండమధ్యమునుండి పావకసమతేజుండును, త్రిలోకసుందరుండును నగు నొకకుమారుం డుదయించెను. వ్యాసనందనుం డగు నాతఁడు శుకనామంబునఁ బ్రసిద్ధుండయ్యెను.

శుకుం డట్లు జన్మించినంతనే గంగాదేవి స్వయముగా నచ్చటికి వచ్చి, తనపవిత్రజలంబులచే నక్కుమారుని సుస్నాతుంగావించెను, అప్పుడే దండమును, కృష్ణాజినమును, స్వర్గమునుండివచ్చి యాతని నలంకరించెను. దేవతలు దుందుభిధ్వానములు సేయుచుఁ బుష్పవర్షమును గురియించిరి. మహాదేవుండప్పుడు దేవీసహితుండై వచ్చి మహానందముతో నాతనికుపనయనంబు

గావించెను. దేవేంద్రుండాతని కపూర్వంబగు కమండలువును, దివ్యవస్త్రమును, బ్రసాదించెను. సర్వసముండగు నాతని చుట్టును గలసిమెలసి సర్వప్రాణులును సంచరించుచుండెను. ధర్మతత్పరుండగు నాతఁడు దేవగురునియొద్ద సకలవిద్యల నభ్యసించి కొలఁదికాలముననే సర్వజ్ఞుండయ్యెను. సంతుష్టుండు కాఁజాలక తండ్రియగు వ్యాసునియొద్దకువచ్చి "నాయనా! నేను ముక్తి నభిలషించుచున్నాఁడను. కుమారుండనగు నాయందు దయయుంచి నాకామార్గమును బోధింపవలయు"నని ప్రార్థించెను.

ఆమాట విన్నంతనే పరమానందముచేఁ గృష్ణద్వైపాయనుని నయనములు బాష్పపూరితములై పోయెను. అప్పుడు బాదరాయణుండు కుమారునకు ముక్తిమార్గంబున కుపాయంబు నుపదేశించి "వత్సా! నీవు మిథిలానగరమునకుం బోయి జనకమహారాజుచెంత ముక్తితత్త్వమును గ్రహింపుమని చెప్పి వీడ్కొల్పెను.

మహాకవిచంద్రుఁడగు వ్యాసమునీంద్రుఁడు వేదశాస్త్రంబులయందల్లి సారము నుద్ధరించి యతిపవిత్రంబగు మహాభారతమును రచియించి, దీని నెట్లు శిష్యులచే లోకమునఁ బ్రవర్తిల్లఁజేయుదునా యని యాలోచించుకొనుచుండ బ్రహ్మదేవుం డప్పు డాతనికిఁ బ్రత్యక్షం బయ్యెను. పారాశర్యుండద్దేవుని యాకస్మికసందర్శనమున విస్మితుండై తత్తరంబున లేచి విధి

విధానంబుగ నవ్వీరించి నర్చించి సుఖాసీనుం జేసి "మహాత్మా! నేనొకయద్భుతకావ్యమును రచియించితిని. వేదవేదాంగముల సారమంతయు నందు జేర్చితిని. భూతభవిష్యద్వర్తమానంబులంగూర్చియు, వివిధవర్ణాశ్రమధర్మంబులంగూర్చియుఁ, దపోబ్రహ్మచర్యాదినియమంబులంగూర్చియు. భూగోళఖగోళంబులంగూర్చియు నందువర్ణించియుంటిని. సృష్టితత్త్వమును,పుణ్యతీర్థక్షేత్రంబులను, నదీనదసముద్రంబులను, పర్వతగ్రామనగరంబులను, వనోపవనంబులను గూర్చి యందుఁ గీర్తించియుంటిని. రాజధర్మములను, బ్రజాధర్మములను, లోకధర్మములను, సర్వమునుగూడ నందు స్పష్టముగా నిరూపించితిని. కాని, యీవిశాలప్రపంచమునందు సాగ్రంథమును లిఖించి వ్యాపింపఁజేయఁగలలేఖకుఁ డెవ్వఁడును నాకగపడుటలేదు." అని విన్నవించెను.

ఆమాటవిన్నంతనే బ్రహ్మదేవుండు సాత్యవతేయుని మిగులఁబ్రశంసించి "మునిచంద్రా ! ఆశ్రమంబు లన్నిటియందును గృహస్థాశ్రమముంబోలి సకలకార్యంబులయందును నీచే రచియింపఁబడినయిమ్మహాభారత ముత్తమోత్తమకావ్యంబగుఁగాక! నీగ్రంథలేఖనంబునకై గణేశ్వరునిఁ బ్రార్థింపుము. ఆతఁడు నీయుద్దేశమును సఫలముసేయఁగలఁడు." అనిబోధించి,వనజాసనుం డంతర్హితుండయ్యెను.

తలఁచుకొన్నంతనే గణనాథుం డచ్చటసాక్షాత్కరించుటయు, వేదవ్యాసుండు భక్తిశ్రద్ధలతో యథోచితంబుగ

సత్కరించి, కుశాసనంబున నాతని నుపవసింపఁజేసి "గణనాథా! మహాభారతనామంబున నేనొకకావ్యంబు రచింపఁదలంచితిని. నామనంబునఁ దోఁచినభావంబులను బ్రవాహరూపంబున నీకుఁ జెప్పుచుందును. నీవెప్పటికప్పుడు వానిని లిఖించుచు నా పరిశ్రమమును సార్థకముగఁజేయఁగోరెదను." అనిచెప్పుటయు వినాయకుండు "మునీంద్రా! లిఖియించుపట్టున నాలేఖిని యొక్కనిమిషమైన నాఁగకుండఁబనిచేయునట్లు నీవుచెప్పఁగలిగితివేని నేను వ్రాయుట కంగీకరించెదను" అనుటయు వ్యాసదేవుండు "విఘ్నరాజా!నీవానతిచ్చినవిధంబుననే నేను విడువక చెప్పుచుందును. కాని, నీవుమాత్రము ప్రతిశ్లోకమునుగూడ బాగుగ నర ముచేసికొని మఱివ్రాయుచుండవలయును." అనియెను.

విఘ్నేశ్వరుఁ డందులకు సమ్మతించెను. యుక్తిపరుఁడైన వ్యాసుఁడు మహాభారతరచనాసమయంబున లేఖకుఁడగువినాయకుఁడు తన్నుఁ దొందరపెట్టకుండుటకై, యచ్చటచ్చట గూఢార్థసంకలితంబులైనశ్లోకంబులనురచియించుచువచ్చెను.గణేశ్వరుఁడు వాని నర్థముచేసికొని వ్రాయులోపల నిమ్మహాకవి యనేక శ్లోకములరచించి, వచించి యించుకగ్రుక్కతిప్పుకొనుచుండెడివాఁడు.మహాభారతమునం దక్కడక్కడఁ గానవచ్చు నిట్టిశ్లోకములనే వ్యాసఘట్టములని చెప్పుకొనుచుందురు.

వేదవ్యాసుఁ డీవిధముగా మహాభారతమును రచించి ముందుగాఁదనపుత్త్రుండగుశుకదేవునిచే నధ్యయనంబుసేయించె

ను. అనంతర మీగ్రంథమును దగినశిష్యులకుఁ బ్రబోధించెను. ఈభారతసంహిత మొట్టమొదట నిరువదినాలుగువేల శ్లోకములుగ రచియింపఁబడియెను. అందుపాఖ్యానములేమియును లేవు. తరువాత నమ్మహర్షి భారతదేశమునందలిసకలవృత్తాంతములను గూర్చి, యేఁబదివేలశ్లోకములుగలయనుక్రమణికను దానితోఁ జేర్చెను. పిమ్మటనఱువదిలక్షలశ్లోకములుగలయొక భారతసంహితను రచించెను. అందు ముప్పదిలక్షలగ్రంథము దేవలోకమునందును, పదునేనులక్షలగ్రంథము పితృలోకమునందును, పదునాలుగు లక్షలగ్రంథము గంధర్వలోకమునందును, లక్షగ్రంథ మిప్పటికిని మానవలోకమునందును బ్రచారమునం దున్నట్లు తెలియవచ్చుచున్నది. ఈగ్రంథమును నారదుఁడు దేవలోకమునందును, అసితుండగుదేవలుఁడు పితృలోకమునందును, కుమారుండగుశుకుఁడు గంధర్వయక్షరాక్షసలోకంబులయందును, బ్రచారంబుఁ గావించిరి. వ్యాసశిష్యుండగు వైశంపాయనుఁడు మానవలోకమునం దీమహాభారతమును వ్యాపింపఁజేసెను.

వాస్తవముగా నింతటిమహాకావ్యము నెన్నఁడు నేభాషయందును నేమహాకవియు రచియించియుండలేదు. మహారాజగు జనమేజయుని సర్పయాగసమయంబున వేదవ్యాసానుమతంబున నాతనిశిష్యుండగు వైశంపాయనుఁ డీమహాభారతమును బఠించియుండెను. ఆతనివలన గ్రహించి లోమహర్షణపు

త్త్రుండగునుగ్రశ్రవుఁడు నైమిశారణ్యంబునఁ గులపతియగు శౌనకునిచే నాచరింపఁబడుచున్న ద్వాదశవార్షికంబగు సత్రయాగసమయంబునసభ్యులగుమహర్షులందఱకును నిమ్మహాభారతకథను వినిపించెను. తరువాత నెన్నిమహాసభలయం దీమహాభారతము కీర్తింపఁబడియెనో లెక్కింపఁజాలము.

కృష్ణద్వైపాయనునిచేరచియింపఁబడినపరమపవిత్రంబగు నిమ్మహాభారతము కేవలముఁ బంచమవేదముగా మహాత్ములందఱును బ్రశంసించి యున్నారు. వసంతకోకిలమధురకంఠస్వరము నాలకించువారికిఁ గర్కశంబగుకాకస్వరము చెవికెక్కనట్లే, మహాభారతేతిహాసమునందలిరుచిమరగినవారి కితరకావ్యము లేవియు రుచింపఁజాలవు. పంచభూతములనుండి సృష్టి యేర్పడునట్లే సర్వోత్కృష్టంబగు నీయితిహాసమునుండి కవిగణంబుల కవితాసృష్టి యుత్పన్నంబగుచుండును. కవులందఱును నీభారతేతిహాసమును నిరంతరము నుపాసించుచుందురు. పౌరాణికులు పరమభక్తిపూర్వకంబుగ నిమ్మహాభారతమునుబఠించి ప్రజాలోకమును బాపవిముక్తులుగాఁ జేయుచుందురు. సర్వధర్మరత్నాకరమగు నిమ్మహాకావ్యమును బఠించువారికి సకలార్థములును సిద్ధింపఁగలవు.

ధర్మజ్ఞుండును, ధర్మబోధకుండును, ధర్మసంస్థాపకుండును, మహామతియు, మహాతపస్సంపన్నుండును,మహాకవియునగు నిమ్మహాత్ముఁడు కేవలము నారాయణావతారమని చెప్పుట

కేమియును సందియములేదు. ఈతఁడు మహాభారతేతిహాసము
ను రచించుటయేకాక, మాతృవాక్యపరిపాలనంబునకై భరత
వంశమునకుఁ బ్రతిష్ఠాపకుండై యాకారణమునఁ దానుగ రచించిన
కావ్యమునఁ దానొకప్రధానపాత్రముగూడ నయ్యెను. కావు
ననే భరతవంశము నుద్ధరించుటకై యాతఁ డెన్నియో ప్రయ
త్నములఁ జేసెను.

ఈమహాత్ముని ధన్యజీవిత మంతయును గేవలము లోక
కల్యాణముకొఱకే వినియోగింపఁబడియెను. ఇమ్మహాకవికావ్య
రచనమంతయును గేవలధర్మాధర్మోపదేశముకొఱకే యుద్దే
శింపఁబడియెను.

ఈప్రజ్ఞానిధి బుద్ధివిశేషమంతయును, నిహసంసార
మును బవిత్రముగఁ జేయుటకును బరతత్త్వమును దర్శనీయ
ముగ నొనర్చుటయందును నుపయోగపడియెను. ఈయవతార
మూర్తి లోకసంగ్రహమునకై కావించు కర్మకలాప మంత
యునుగూడ నిరపేక్షమైనదియే. పరార్థజీవనుఁడగు నిమ్మహా
పురుషునకు స్వప్రయోజనం బనునది యేదియును లేదు. కావు
ననే యీవేదవ్యాసుఁడు విశ్వప్రియుఁడై విశ్వమయంబులును
విశ్వబోధకంబులును విశ్వజనరంజకంబులును విశ్వశ్రేయోదా
యకంబులును నగుతనమహాకావ్యములతోఁగూడఁ జిరంజీవియై
విశ్వసంస్తవనీయచరిత్రుఁడయ్యెను.

చిరంజీవులు.

౪ హనుమంతుఁడు.

విద్యలను నేర్చి శ్రీరామ ♦ విభునిఁగొల్చి
లంకఁగాలిచి రావణు ♦ పొంకమణఁచి
రుద్రుఁడై క్రూరదనుజులఁ ♦ ద్రుంచినట్టి
మాహనూమంతు గుణవంతు ♦ మదిఁదలంతు.

మహాభక్తుం డగునీహనుమంతున కంజనాకేసరులు
జననీజనకులు. ఈతఁడు జగత్ప్రాణుండగు వాయుదేవునియను
గ్రహమున వైశాఖబహుళదశమినాఁడు జనియించెను. ఇతఁడు
పుట్టినయాఱవదిన మమావాస్య యయ్యెను. ఆనాఁ డీచిన్నికు
మారుఁడు తాను శయనించినడోలికనుండి లేచి సమీపమున
దలియొకచిన్నగుట్టపైకిఁ బ్రాఁకిపోయి మెల్లఁగఁ దలయెత్తి
తూరుపుదెసవంకఁ దిలకించి యప్పుడే యుదయించుచున్న బాల
భానునింగాంచి యాతనిబింబ మొకయెఱ్ఱనిపండని భావించి
దానిఁ గైకొని భక్షించుటకై మింటి కెగయ నారంభించెను
ఆసమయంబున వాయుదేవుఁడు భాస్కరుని వేఁడివెలుంగులచేఁ
దనకుమారున కెట్టియాపద తటస్థించునో యనిశంకించి తనచ

ల్లనిసుగంధవాయువులతో సేదఁదేర్చుచు నాతని ననుసరించి పోవుచుండెను.

హనుమంతుం డశ్రమంబున నట్లంతరాళము నధిగమించి నిర్భయముగా బాలార్కబింబము నొడిసిపట్టి బాల్యచాపలముచేతను, ఫలభ్రాంతిచేతను నోటఁగబళించుటయు నా వేఁడివేలుపుసోఁకుచే నోరుచుఱ్ఱుమన నూఁదుకొనుచు నాబింబము నొకచేతినుండి మఱియొకచేతికిమార్చిమార్చి త్రిప్పికొనుచు వేఁడిచల్లార్చుటకై ప్రయత్నించుచుండెను. ఆనాఁడు సూర్యగ్రహణంబగుటచే యుక్తసమయమునకు రాహువచ్చుటకై వచ్చి రవిమండలమును గ్రసింపఁబోయి కుమారుం డగు హనుమంతునిఁగాంచి వీఁడెవ్వఁడో కోఁతిమూతి క్రొత్తరాహువువచ్చి తనకంటెముందుగ సూర్యుని మ్రింగుచున్నాఁడని కోపించి యొక్కయుదుటున నంజనీతనయునిపైఁబడి యొకతీవ్రప్రహారముంగావించెను.

ఇదివఱకే దినాకరుని దిగమ్రింగుటకై ప్రయత్నించి సఫలమనోరథుఁడు కాఁజాలక శ్రమపడుచున్న వాయుపుత్త్రుం డప్పుడా రాహువుంగాంచి యదియేదో నల్లనిపండని భ్రమించి యాతనిఁ బట్టుకొని నలుపనారంభించెను. అక్కపికుమారుని కరమర్దనమును సహింపఁజాలక రాహువు భయభ్రాంతుఁడై "హా పురందరా ! రక్షింపుము. రక్షింపుము. ఈక్రూరగ్రహ మేదియోవచ్చి గ్రహాచారమునంతను మార్చివైచుచున్నది."

అని యింద్రునిఁ బ్రార్థింపఁదొడంగెను. అయ్యార్తనాదము నాలకించి యమరేంద్రుం డైరావతము నధిరోహించి యతిత్వరితంబుగ నచ్చటికివచ్చుటయు నాంజనేయుం డదియేదియో చల్లని తెల్లనిఫలమని యెంచి వెల్లయేనుఁగుతోఁగూడ విబుధనాథునిఁబట్టి మ్రింగఁబోయెను. బాలబుద్ధియగు పావని కప్పుడగపడి నదంతయు ఫలమయముగనే కన్పట్టుచుండెను.

ఆవానరకుమారుని దుండగీనితనమునకు సురేంద్రుఁడు కోపించి యాతనిపై వజ్రాయుధమును విసరెను. అయ్యాఘాతముచే భగ్నహనుండై యాహరికుమారుండుమూర్ఛిల్లెను. అందువలననే యాతనికి హనుమంతుఁ డనునామము కలిగెను. ఇట్లు తనకుమారుని దేవేంద్రుం డన్యాయముగఁ బ్రహరించి మూర్ఛిల్లఁ జేసెననుకినుకచేఁ బవనదేవుం డక్కుమారుఁ గ్రిందఁబడకుండ నంతరాళమున నిలిపికొని జగత్సంచారము మానివైచెను. అందుచే నిర్వాతమగు నంతరిక్షమునుండి యింద్రాదిదేవతలందఱును దమతమ విమానములతో స్తంభించిపోయిరి. సకలజీవులకును నూపిరాడుటలేదు. ఆకాలమునం దిట్టి వాయునిరోధమునకుఁ గారణ మేమని యోచించి బ్రహ్మదేవుం డచ్చటికి వచ్చి సర్వముదెలిసికొని శక్రుని మందలించి హనుమంతుని బ్రదికించి యతనిఁ జిరంజీవిగ నాశీర్వదించి పవమాను ననునయించి లోకసంచారము నెప్పటియట్ల గావించి యంతర్హితుండయ్యెను.

ఇట్లు సురక్షితుండగు పావని తమతల్లిదండ్రులకు దినదినము నొకక్రొత్తయానందముం గూర్చుచుఁ దనసద్గుణంబులతోడను బలపరాక్రమములతోడను శుక్లపక్షచంద్రునివలెఁ గ్రమక్రమముగా వర్ధిల్లుచుండెను. ఆతని కించుకలోకజ్ఞానము కలిగినతోడనే తల్లిదండ్రులయనుమతంబున సమీపాశ్రమంబునకుంబోయి మునికుమారులతోఁ జదివికొనుచు నంతమాత్రమునఁ దనివి సనక సర్వవిద్యలను దనకుబోధింపఁగలగురుం డెవ్వఁడై యుండునని యోచించి భాస్కరునికంటెఁ బండితుఁ డీజగంబున నెవ్వఁడును లేఁడని తెలిసికొని యాతనిచెంతకుఁ బోయి చదువుకొనుటకు నిశ్చయించుకొనియెను. అనంతరమాతఁడు గురుజనానుమతంబువడసి యాదిత్యభగవానునిచెంతకుం బోయి, భక్తివినయంబులతోఁ బ్రణామంబుచేసి "ఓలోకబాంధవా! నాకు విద్యాదానము సేయువలయు"నని ప్రార్థించెను.

వేదమూర్తియగుప్రభాకరుం డాతని భక్తిశ్రద్ధలకు సంతసించి యించుకసంశయించి "కుమారా! అనునిమిషమును లోకసంచారముఁ గావించుటయే నావిధాయకకృత్యమై యున్నది. ఇట్టి నాచెంత నీవు విద్యాలాభము నెట్లుపొందఁగలవు? పాపము! నీవెంతయో యాశపడి వచ్చితివిగాని నీకోర్కెఁ దీర్చుట కుపాయ మగుపడుటలేదు." అని వచించుటయు హనుమంతుండు చేతులు జోడించుకొని "స్వామీ! నాకు విద్యాభిలాష మిక్కుటముగ నున్నది. అందుకొఱకు నేనెట్టికష్టములనైన ననుభవింపఁగలను. అనుగ్రహించి మీరంగీకరించినచో నుదయశైలమునం దొకపాదమును, నపరశైలమునం దొకపాదమును నిలిపి నిత్యము మీవెంటనే యుండి మీయొద్దఁ జదివికొనుచుందును. అందువలన నాకెట్టి యాయాసమును లేదు. నేను మీనిత్యకృత్యముల కెంతమాత్రము నంతరాయము గలుగనీయను. విద్యాభ్యాసమునందలి యాశయే నాకిట్టిశక్తిని గల్పింపఁగలదు. మీరు చెప్పునదంతయు శ్రద్ధగా విని గ్రహించుచుండుటయే కాని, యూరక మరలమరలఁ బ్రశ్నించుచు మీకు వేసటఁ గల్పించువాఁడను గాను. మహాత్మా! నన్ను మీశిష్యునిగా నాదరించి యనుగ్రహింపుఁడు" అనియెను.

హనుమంతుని విద్యాసముత్సాహమునకును, విశ్వవ్యాపనశీలంబగు నాతనియద్భుతశక్తికిని, సవితృదేవుండు సంతోషించి శ్రద్ధాన్వితుండగు నిట్టియుత్తమశిష్యునకు బోధించిన విద్య సార్థకంబుకాఁగలదని నిశ్చయించి యందులకంగీకరించెను. ఉత్తములకు నుత్తమసంకల్పములు శుభముహూర్తములయందే కలుగుచుండును. ఆదిత్యుఁ డాంజనేయుని శిష్యుఁడుగా నంగీకరించిన యాముహూర్తమే శుభముహూర్తమయ్యెను. ఆముహూర్తమునందే విశ్వసంచారియగు భాస్కరునియొద్ద జగత్ప్రాణతనయుండగు హనుమంతుఁడు విశ్వమూర్తిందాల్చి

చరించుచు విద్యారంభముఁ గావించెను. ఇట్లు క్రమముగా నాతఁ డంశుమంతుని చెంత నఖిలవిద్యల నభ్యసించి సంపూర్ణ విద్యానిధియై గురువనుగ్రహంబును దదాశీర్వాదంబును బడసి కృతార్థుఁడై సెలవు గైకొని కిష్కింధానగరమందున్న తనజననీ జనకులయొద్దకు వచ్చి వారికిఁ బరమానందముం గూర్చెను.

ఆనగరమునందలి కపిశేఖరు లందఱును విద్యానిధియు, బలపరాక్రమ సంపన్నుఁడును, గుణనిధియునగు కేసరీపుత్త్రుని మిగులగౌరవభక్తి తాత్పర్యములతో నాదరింపఁదొడంగిరి. క్రమముగా నాతనిమహత్త్వముం గ్రహించి మర్కటేశ్వరుండును, మార్తాండతనయుండు నగు సుగ్రీవుం డాతనిఁ దనమంత్రిగాఁ జేసికొనియెను. అంజనాదేవిని బట్టి యాయిరువురకును బంధుత్వముకూడఁ గలదు. అందువలన నయ్యిరువురకు నన్యోన్యానుబంధము దినదినప్రవర్ధమాన మగుచుండెను. ఇట్లుండఁ గాలకారణవశంబున సుగ్రీవునకు సహోదరుండగు వాలితో విరోధమేర్పడి రాజ్యభంగ మగుటయు నాతఁడు మంత్రిసామంతపరివారపరివృతుండై ఋష్యమూకాచలంబు నాశ్రయించి యట నివసించుచుండెను.

అంతఁ గొంతకాలంబునకుఁ బితృవాక్యపరిపాలనంబు సేయందలంచి సీతాలక్ష్మణసహితుఁడై వనవాసముచేయుచున్న శ్రీరామచంద్రమూర్తి విధినియోగంబున సతీవియోగముం గాంచి సంతప్తచిత్తముతో సతినన్వేషింప నడవులఁదిరుగుచు

క్రమముగా లక్ష్మణసహితుఁడై ఋష్యమూకాచలవనప్రాంతమునకు విచ్చేసెను. భ్రాతృభయవిహ్వలుఁడై వలసవచ్చియున్న సుగ్రీవుఁడు దూరమునుండి ధనుర్ధరులును, తాపసవేషధారులునగు రామలక్ష్మణులం గాంచి తనవినాశంబునకై యన్నచేఁ బంపఁబడినశత్రుప్రు లేమోయని భ్రమించి మతిమంతుఁడగు హనుమంతుంబిలిచి వారివృత్తాంతముఁ దెలిసికొనిరమ్మని పంపించెను.

సర్వజ్ఞుండగుసామీరి స్వామియాజ్ఞ ననుసరించి రామలక్ష్మణులకడకుంబోయి సవినయంబుగ సందర్శించి సవిస్తరంబుగ వారివృత్తాంత మంతయుఁ దెలిసికొని తనప్రభుండగు సుగ్రీవునియవస్థయు రామలక్ష్మణులయవస్థయు నొక్కటేరీతిగ నున్నదని గ్రహించి రాజనీతినిపుణుండుగావున నీయిరువురకును బరస్పరమైత్రిం గూర్చినచో నన్యోన్యసాహాయ్యమువలన నభ్యుదయము నందఁగలరని యూహించి తనయాగమనవృత్తాంతమును, దనప్రభుండగు సుగ్రీవునియునికియు వారి కెఱింగించి తనప్రజ్ఞయంతయు వినియోగించి సూర్యశిష్యుండగు నాహనుమ సూర్యకులాలంకారులగు రామలక్ష్మణులకును సూర్యతనయుండగుసుగ్రీవునకును సూర్యచంద్రాగ్నిసాక్షికముగ మైత్రినిసంఘటిల్లఁజేసి తనమంత్రిత్వమును సార్థకము చేసికొనియెను. దూరదర్శియుఁ బ్రత్యుత్పన్నమతియుఁ బ్రతిభాశాలియు నగు నమ్మంత్రిశేఖరుని మిత్రలాభతంత్రమూలముననే సుగ్రీవునకు శత్రువిజయమును రాజ్యలాభమును జేకూరినవి.

పిమ్మట సుగ్రీవుఁడు స్వస్థచిత్తుఁడై మిత్రకార్యసర్వహణమునకుఁ బ్రయత్నములఁ గావింపనారంభించెను. ఆంజనేయునిం జూచినది మొదలుగ శ్రీరామచంద్రున కాతనిగుణగణంబులయందును నాతనిభక్తిశ్రద్ధలయందును గౌరవాభిమానములు హెచ్చుచుండుటచే నాతనిఁ దనయాత్మీయునిఁగా భావించుకొనఁ జొచ్చెను. సీతాన్వేషణంబున కాతఁడే తగినసమర్థుఁడని రామలక్ష్మణులకు దృఢవిశ్వాసము కలిగెను. అందుచేతనే రామభద్రుఁడు, కపివరులందఱును సీతను వెదకుటకై పోవుసమయంబునఁ దనయంగుళీయకము నానవాలుగా హనుమంతున కేయొసంగెను.

ఎంతటికార్యభారమునైనను వహించి కష్టములను గణింపక స్వామికార్యమును నిర్వహించుటయందు హనుమంతుని మించినసమర్థు లెవ్వరునుండరు. ఆతఁడు స్వామికార్యనిర్వహణమునకు బద్ధకంకణుఁడై కపివీరులతోఁ గలసిపోయెను. గుంపులుగుంపులుగా నందఱు నన్నిదిక్కులకునుబోయి సీతను వెదకనారంభించిరి. కాని, యాదేవి యెందును గాన్పింపదయ్యెను. క్రమముగాఁ గొంతకాలమున కందఱును దక్షిణసముద్రతీరమునఁ జేరికొని యాలోచింపనారంభించిరి.

ప్రసంగవశమున సీతను లంకాధిపతియగు రావణుఁడెత్తికొనిపోయినట్లు వారికిఁ దెలియవచ్చెను. లంకకుఁ బోవుటకై మహాసముద్రమును దాఁటుటకంటె నుపాయాంతరమేమి

యును లేదు. అట్టి దుస్తరకార్యమును సాధించుటకుఁ గపివీరు లెవ్వరును సాహసింపలేకపోయిరి. అప్పుడు మహాబలనందనుఁడగు నాంజనేయుఁడు శ్రీరాముని యాదరమును, సుగ్రీవుని యాజ్ఞయు నూతగాఁ జేసికొని కపివరులందఱు నాశ్చర్యముతోఁ గనుఁగొనుచుండ నవలీలగా నంతరాళమున కెగసి యంబుధి నుత్తరించి యశ్రమంబున లంకాద్వారమునఁ బ్రవేశించెను.

మహత్కార్యములకు విఘ్నములే విశేషముగాఁ దటస్థించుచుండును. లంకఁ జేరితిమి గదా యని సంతసించుచున్న హనుమంతునకు లంకిణి యడ్డమువచ్చి లోపలికిఁ బ్రవేశింపనీయకుండెను. మహావీరుఁడైన పావని యాఁడుదానితోఁ బోరుటకు శంకించి సామోపాయముచేఁ దప్పించుకొనిపోవలయునని ప్రయత్నించెను. కాని, సాధ్యముకాకపోయెను. తుదకాతనికి లంకిణిని జావఁగొట్టి లంకానగరమునఁ బ్రవేశింపవలసివచ్చెను. సామీరికిఁ గామగమనము, కామరూపము మొదలుగాఁగలదివ్యశక్తులుగలవు. అప్పుడాతఁడు సూక్ష్మాకృతిని ధరించి సీతాదేవికొఱకు లంకానగరమంతటను శోధింపనారంభించెను. ఆరాత్రివేళ నానగరమంతయు మహావైభవసమన్వితమై మనోమోహనకరమై యలరారుచుండెను. సీతను వెదకుటయందే నిమగ్నచిత్తుఁడై యున్న వాయునందనున కవియేవియుఁ గనపడుట లేదు. మేడలు, మిద్దెలు, తోఁటలు, దొడ్లు, కోటలు, పేటలు అంగణములు, అంతఃపురములు, వేయేల, లంకానగరంబునందలి ప్రతిప్రదేశమును బరిశోధించెను. కాని, యాతని కగపడలేదు.

స్వామికార్యతత్పరుఁ డగుసామీరి యప్పుడు తనపరిశ్రమయంతయు నిరర్థకమయ్యెఁగదా యనువిచారముతో లంకాంతర్భాగమునందున్న యశోకవనమునకుఁ బోయి యొకవృక్షశాఖాగ్రమునఁ గూరుచుండి చింతించుచుండెను. అంతలో నదృష్టవశమున సమీపమునుండి "రామా! రామా!" యను నార్తనాద మమృతరసమువలె నాతనివీనులకువింపుగావించెను. తోడనే యాతఁ డులికిపడి "నరఘాతుకులగు నసురులచే నిండియున్న యీనగరమునందు మహావిష్ణుస్వరూపుఁడైన శ్రీరామచంద్రమూర్తిని దలఁచువా రెవ్వరై యుందురు?" అని భావించి చటాలున నటకుఁబోయి యొకయశోకవృక్షముక్రింద మూర్తీభవించిన శోకదేవతలవలెఁ గూర్చుండి పరిదేవనంబు సేయుచున్న యొకస్త్రీమూర్తిం గాంచి యామెయే సీతయైయుండునని యూహించి సమయముఁజూచి దర్శించి సత్యము తెలిసికొనవలయు నని నిశ్చయించుకొని యాచెట్టుకొమ్మపైఁ గూర్చుండియుండెను. ఆమెచుట్టునుమూఁగియున్న వికృతస్వరూపలగు రాక్షసస్త్రీలందఱును నామె ననేకవిధములఁ దర్జనంబులతో, దుర్బోధలు సేయుచు బెదరించుచు నెంతకు నామె తమకు వశీకృతురాలు గాకుండుటచే విసిఁగివేసారి క్రమముగా నందఱును నిదురించిరి. ఆసతీమణిమాత్రము ధూళిధూసరితగాత్రముతో మలినవసనముతో, నేకవేణితోఁ, బతివియోగదుఃఖముతోఁ, బరాభవసంతాపముతో నిద్దురయనుమాటలేక "రామా! రామా" యని యుల్లేపలవించుచుఁ గూర్చుండియుండెను.

హనుమంతుఁ డదియంతయుం గాంచి యీయామె జానకీదేవియే యని నిశ్చయించుకొని యామెను దర్శించుట కిదియే యదనని భావించుకొని మెల్లఁగఁ జెట్టుకొమ్మనుండి క్రిందికిదిగి శ్రీరామనామసంకీర్తనము గావించుచు నామెను సమీపించి "తల్లీ! నేను శ్రీరామదూతను హనుమంతుఁడనువాఁడను. స్వామిపంపున నీసేమ మరయవచ్చితిని. పుత్త్రవాత్సల్యముతో నన్నుఁ దిలకించి నిస్సంశయముగ నీకష్టసుఖములను నాకెఱింగింపుము." అనినమస్కారపూర్వకంబుగా విన్నవించుటయు నింతవఱకును రాక్షసమాయలచే నెన్నియోకష్టములఁబడి మతిచెడియున్న సీతాదేవి యాతని విశ్వసింపఁజాలక కోఁతిరూపమున వచ్చినరావణుఁడే యని భావించి ప్రతివచనం బీయకుండెను.

అప్పు డంజనానందనుఁడు వినయవినమితగాత్రుండై మృదుమధురస్వరంబున "తల్లీ! నాయెడల నీకెట్టిసంశయంబును వలదు. నేను రక్కసుఁడనుగాను. నిశ్చయముగా నీస్వామిసేవకుఁడనని నమ్ముము. భయభ్రాంతిచే వికలహృదయవైయున్న నీకింకనుసంశయము వదలదేని యీశ్రీరామముద్రికం జూచియైనను నామాట విశ్వసింపుము." అనిపలుకుచు శ్రీరామాంగుళీయకమును సీతాదేవి కర్పించెను. దానిం గాంచినంతనే సీతాదేవి ప్రాణేశ్వరుని దిలకించినట్లగుటయు నొక్కసారిగా నుప్పతిల్లిన యానందశోకావేగముచే మూర్ఛిల్లి యంతలోఁ దెలివి తెచ్చుకొని గద్గదస్వరముతో రామలక్ష్మణులసేమ మడిగి

తెలిసికొని తనకష్టముల నాతని కెఱిఁగించి తనచూడామణి విభున కానవాలుగానొసంగి యాశీర్వదించి పంపించెను.

ఆంజనేయుం డామణిని గైకొని యింతశ్రమపడి లంకానగరమునకు వచ్చినందుకుఁ దనసంగతి లంకలోనివారికిఁ దెలియకుండఁబోవుట యుచితముగాదని తలంచి యశోకవనమునఁ బ్రవేశించి యందలిఫలభూరుహములను బుష్పలతలనుగూడ విఱిచి చెఱచి విహరింపనారంభించెను. రావణుఁడు వనపాలుర వలన నీవృత్తాంతముఁ దెలిసికొని ససైన్యముగ నక్షయకుమారుని నాతనిఁ గట్టితెచ్చుటకై పంపించెను. జగదేకవీరుఁడగు మహాబలనందనున కాయసురసైన్య మేపాటిది? అతనిచేతిలో నక్షయకుమారుఁడు సపరివారముగా నిహతుఁడై పోయెను. తరువాతఁ బరాక్రమధనుండగు నింద్రజిత్తువచ్చి బ్రహ్మాస్త్రముచే హనుమంతునిబంధించి తీసికొనిపోయెను.

బ్రహ్మాస్త్రముచేఁ గట్టువడియు, బలవంతులగుశత్రువులనడుమ నేకాకియైయుండియుఁ బవననందనుఁడు రావణసభామండపమున నిర్భయముగా నిలిచి యాతనిదుర్నయంబులనుగ్గడించి తృణీకరించి ధర్మోపదేశముఁ గావించెను. ఆమాటలకుదశకంఠుఁడు మండిపడి యీదురాత్ముని తోఁక గాల్చిపంపివేయుఁడని యాజ్ఞాపించెను. తోడనే రాక్షసులందఱును హనుమంతునివాలమునకు నూనెగుడ్డలనుజుట్టి ముట్టించిరి. వాయునందనుఁ డప్పుడు శత్రువులుగావించినపరాభవముఁగూడఁ దనకుఁ గార్య

సాధకమే యయ్యెనని యుత్సహించి లంకానగరమునందలిసౌధములమీఁదికి లంఘించి తనవాలాగ్నిచేఁబట్టణమంతయు భస్మీభూతముగాఁ జేయనారంభించెను. కొలఁదిసేపటిలోఁ బురమంతయు బుగ్గియై పోయెను.

తరువాత నాతఁడు మహోత్సాహముతో సీతయొద్దకుఁ బోయి, దూరముగ నిలిచి "అమ్మా! ఇఁకవిచారింపకుము. అధర్మపరాయణుఁడగునసురేశ్వరున కంత్యకాలము సమీపించినది, ఈలంకాదహనమే దానికంకురార్పణమైనది. అచిరకాలములోనే శ్రీరామచంద్రమూర్తి వారిధి బంధించివచ్చి పుత్త్రమిత్రకళత్రాదులతో రావణసంహారంబుఁగావించి నిన్నుద్ధరింపఁగలఁడు. తల్లీ! ధైర్యమువహించియుండుము. నేఁబోయివచ్చెదను. సెలవిమ్ము" అని యామెకు నమస్కరించి వీడుకొని యొక్కయుదుటున సముద్రతీరమునకులంఘించి తోఁకచిచ్చుఁజల్లార్చుకొని గగనమార్గంబున మహేంద్రాద్రికిఁ జేరి పట్టరాని సంతోషముతో శ్రీరామనామసంకీర్తనముఁ గావించుచుఁ దనరాకకై వేచియున్న కపిపుంగవుల వెంటఁబెట్టుకొని పోయి శ్రీరామచంద్రుని దర్శించి సీతాకుశలవార్తయు, లంకాదహనచరిత్రంబును, విన్నవించి సన్నుతులం గాంచెను.

తరువాత రామలక్ష్మణులు సుగ్రీవసేనాసహాయంబున లంకావిజయయాత్రకు బయలుదేఱిరి. మధ్యమార్గమున సముద్ర మడ్డముగానుండెను. దానికొక సేతువు నిర్మింపవలసివచ్చెను.

కపివీరు లందఱును నీలునిసహాయంబునఁ బర్వతములను బెకలిం
చి తెచ్చి సేతువును నిర్మించిరి. ఆఘనకార్యమునందు మిగిలిన
కపివీరులందఱును నెంతపని చేసిరో మనహనుమంతుఁ డొక్కఁడు
నంతిసాయముఁ గావించెను. అందువలన మహాసైన్యముతో
రామలక్ష్మణు లతిసులభముగా లంకానగరమును జేరి ముట్ట
డింపఁగలిగిరి.

యుద్ధ మారంభమయ్యెను. అందు హనుమంతుఁడు
మహావీరుఁడై యసమసమరవిహారము సేయుచు నజేయులగున
నేకరాక్షసయోధుల నశ్రమంబుగ నురుమాడుచుండెను.
రాక్షససైన్యమంతయు గుట్టలుగుట్టలుగా పీనుఁగుపెంటలై పడి
పోవుచుండెను. ఒకప్పుడు దుర్జయుండగు నింద్రజిత్తు వరగర్వం
బున మదించి దివ్యరథంబుతో రణరంగమునఁ బ్రవేశించి
శ్రీరామసేననంతను జెల్లాచెదరుగఁ జేయుచుండెను. ఆత్రి
లోకవీరు నెదిరించుట కెవ్వరికిని సాధ్యము కాకుండెను. అప్పుడు
మహావీరశేఖరుండగు లక్ష్మణుండు శ్రీరామచంద్రునియనుమ
తింబడసి మేఘనాథునితో యుద్ధముచేయుటకుఁ బూనుకొనియె
ను. రామలక్ష్మణులు తాపసవేషములతో నున్నవారుగావున
వారికి రథాదివాహనంబులు లేకుండెను. అప్పుడు స్వామిభక్తి
తత్పరుండగు సమీరనందనుఁడు మహావీరుఁడగు లక్ష్మణునకు
వాహనస్వరూపుఁడై యాతనిఁ దనమూపున నెక్కించుకొని
యింద్రజిత్తు నెదిరించుటకుఁ దోడుపడియెను. ఆతనిసహాయము

వలననే లక్ష్మణుం డప్పుడశ్రమంబున నింద్రజిత్తును సంహ
రింపఁగలిగెను.

పుత్త్రమరణదుఃఖముచే రావణుఁడు మహాసైన్యముతో
రణరంగమునకేతెంచి రామలక్ష్మణులను ససైన్యముగ సంహ
రింపవలయుననుపట్టుదలతో మహారణము సేయఁదొడంగెను.
ఆదారుణయుద్ధంబున నమోఘంబగు రావణుని దివ్యశక్తిచే
లక్ష్మణకుమారుండు మూర్ఛితుఁడై పడిపోయెను. శ్రీరామచం
ద్రుఁ డప్పుడు తనసహోదరుఁడు మరణించె నని భావించి
బాలునివలె రోదనముచేయనారంభించెను. కపిసేనయంతయు
నిరుత్సాహసంక్షుభితమై పోయెను. అప్పుడు ధన్వంతరిసమా
నుండగు సుషేణుండు లక్ష్మణునిఁ బరీక్షించి యాతఁడు మరణిం
పలేదనియు సంజీవకరణిచే జీవింపఁగలఁడనియు, దానిని దెల్ల
వాఱకుండఁ దెచ్చి యుపయోగింపవలయుననియు నెఱిఁగించెను.
సహస్రాధిక యోజనములదూరమునం దున్న సంజీవి నట్లు దెచ్చు
టకు సామర్థ్య మెవ్వరి కున్నది? కపిసేనలో నందఱును నొకరి
మొగ మొకరు చూచుకొననారంభించిరి. నిరాశాసముద్రమున
మునిఁగిపోవుచున్న శ్రీరామచంద్రున కప్పుడొకయాశాతరంగ
ము తేల్చినట్లయ్యెను.

రఘువీరుం డపుడు తనశోకము నించుకయుడంచుకొని
హనుమంతునిదివ్యశక్తి నెఱింగినవాఁడుగావున, నాతనియందే
పరిపూర్ణవిశ్వాసముకలవాఁడుగావున, నాత్మబంధుస్వరూపుఁడ

గునాంజనాతనయునిఁ బిలిచి "నాయనా! ఈతమ్ముఁడు నీతమ్ముఁడు. నాతమ్ముఁడని చెప్పుకొనుటకు నాకెట్టియవకాశము లేదు. ఈయాపత్సమయమునందు నేనీతని కెట్టియుపకారమును జేయఁజాలకున్నాఁడను. దుఃఖభారముచేఁ దూలిపోవుచున్నాఁడను. అనితరదుర్లభమైన యీదివ్యౌషధమును దెచ్చి నీతమ్ముని నన్నును బ్రదికించుకొనుము. నీకెల్లయెడల శుభంబగుఁగాక." అని యతికరుణముగా వేఁడికొనియెను.

హనుమంతున కెంతటియసాధ్యకార్యమైనను, నిర్వహింపఁజాలనేమోయను సంశయమైనను లేదు. స్వామికార్యమనిన నాతని కెక్కడను లేని ధైర్యమును, నెక్కడను లేని మహాశక్తియుఁ గలిగి యాతఁడుత్సాహముచే నుబ్బిపోవుచుండును. అప్పుడాతఁడు గోటితోఁ గొండలను మీటివేయఁగలుగుచుండును. ఇప్పుడట్టియుత్సాహమే యతనికిఁ గలిగెను. సముద్రము దాఁటినవానికి సంజీవిఁ దెచ్చుట యేపాటిపనియని తోఁచెను. ఇఁక మాఱుమాట చెప్పక హనుమంతుఁడు శ్రీరామచంద్రునియొద్ద సెలవు గైకొని సుషేణునివలన నెల్లసంగతులను దెలిసికొని తత్క్షణమే సంజీవి దెచ్చుటకు బయలుదేఱెను.

అట్లు పోవుచున్నయాంజనేయునకు మార్గమధ్యమునం దనేకములగు నంతరాయములు కలిగెను. కాని, కార్యతత్పరుఁడగు నాతఁడు వానినన్నిటినిఁ దప్పించుకొని యతివేగముగఁ బోయి సంజీవిపర్వతమును సమీపించెను. సుషేణుఁడు చెప్పినలక్షణము

లనుబట్టి సంజీవకరణిం దెలిసికొనుటకై ప్రయత్నించెను. కాని, దివ్యౌషధీలతలచే నిండి వెలుంగుచున్న యాశైలరాజమునందుఁ బ్రధానవస్తువును బరీక్షించి గైకొనుట కాతని కవకాశము లేకపోయెను. హనుమంతునకుఁ గార్యనిర్వహణమే ప్రధానముగాని తత్ప్రయత్నమునఁ గలుగుకష్టముల హెచ్చుతగ్గులం గూర్చి యాతఁ డాలోచించువాఁడు కాఁడు. కార్యసిద్ధికొఱ కెంతకష్టమునైనను సహింపఁగలస్వభావము కలవాఁడు. కావుననే మన హనుమంతుఁ డిప్పు డవకాశము లేని యీస్వల్పసమయమునం దోషధీపరిశీలనాభారమును దనతలపైఁ బెట్టుకొనక, స్వామికార్యముకొఱకు మహాపర్వతభారమునైన వహించుటకు సిద్ధపడి తన్నడ్డగించుచున్న గంధర్వులనందఱఁ బాఱఁదోలి సంజీవి పర్వతమును బెకలించి నెత్తిపైఁ బెట్టుకొని యాకాశమార్గమున సూర్యోదయము కాకుండఁ దీసికొనివచ్చి లక్ష్మణకుమారునకుఁ బ్రాణదాతయై కృతకృత్యుండయ్యెను.

జగత్ప్రాణనందనుండగు నీహనుమంతుని నిరుపమాన సహాయముచే శ్రీరామచంద్రమూర్తికి మఱువరాని మహోపకారములు జరిగెను. లక్ష్మణకుమారుఁడు జీవించుటచే రామునకు మరల ద్విగుణితోత్సాహము కలిగెను. ఆయుత్సాహావేశమువలననే త్రిలోకకంటకుండగు దశకంఠుఁడు సపరివారముగ నిహతుఁడైపోయెను. ముల్లోకములయందు శాంతి నెలకొనియెను. విజయోత్సాహుండగు రఘువీరుం డప్పుడు విభీషణునకు లంకారాజ్యపట్టాభిషేకము చేసి హనుమత్సీతాలక్ష్మణసహితుండై సుగ్రీవాదివీరులతో ససైన్యముగఁ బుష్పకారూఢుండై

కదలి యయోధ్యానగరంబున సుఖముగాఁ బ్రవేశించెను.

పరమభక్తాగ్రగణ్యుండగు పావని శ్రీరామచంద్రుని ప్రభువుగను, బాంధవునిగను, భగవానునిగను, భావించుచు, భయభక్తితాత్పర్యములతో నిరంతరమును సేవించుచుండెను. శ్రీరామనామకీర్తనతత్పరుండగు నాతని కంతరంగమును బహిరంగమునుగూడ రామమయమైయుండెను. శ్రీరామపాదసేవనమే యాతనిజీవనమైయుండెను. శ్రీరామచంద్రుఁడుగూడనతి వాత్సల్యముతో హనుమంతు నాదరించుచుండెను; అతివిశ్వాసముతో గౌరవించుచుండెను; అత్యుత్సాహముతో నభినందించుచుండెను. అతనికి హనుమంతుఁడొక్కఁడే సర్వాంగరక్షకుఁడును, సర్వకాలసన్నిహితుండును, సర్వప్రధానుండును, సర్వస్వమునై యుండెను. అందుచేతనే, రామునివంటి రాజును, పావనివంటి బంటును లేఁడని ప్రఖ్యాతఁబయ్యెను. దాశరథివంటి దైవతమును, పవనతనయునివంటి భక్తుఁడు గూడ లేఁడని చెప్పినను చెప్పవచ్చును.

శ్రీరామపట్టాభిషేకానంతరమున జగత్పితరులగు సీతారాములు పరమభక్తుండగు పవననందనుండు తత్త్వదర్శనంబునకుఁ దగిన యధికారియని నిశ్చయించి యనుగ్రహంబుచేసి సవిస్తరంబుగా సప్రమాణంబుగా బ్రహ్మతత్త్వోపదేశంబుఁ గావించి నిరపేక్షితసత్కర్ముండగు నాతనిధన్యజీవితమును సార్థకముగాఁ జేసి చిరంజీవి వగుమని యాశీర్వదించి యాతనికిఁ గల్పాంతంబున బ్రహ్మపదంబు లభించునట్టివరంబును బ్రసాదించిరి.

చిరంజీవులు.

౫ విభీషణుఁడు.

భవ్యతపమున దేవభా ♦ వంబుఁ గాంచి
శఠుల నన్నల విడిచి దా ♦ శరథిఁ గొలిచి
దైత్యకులభూషణుండయి ♦ తనరినట్టి
సాధుమూర్తి విభీషణు ♦ సంస్మరింతు.

మహాత్ముఁ డగునివ్విభీషణుఁడు కైకసీవిశ్రవసుబ్రహ్మలకు మూఁడవతనయుఁడు. దురాత్ములగు రావణకుంభకర్ణులీతని కగ్రజులు. పంకము నుండిపద్మముదయించినట్లు, రాళ్లలో నుండి రత్నముపుట్టినట్లు, దుష్టరాక్షసకులమునందుఁబరమభాగవతోత్తముఁడగు నీతఁడు జనియించెను. పుట్టినప్పటినుండియు నీతఁడు పరమశాంతస్వభావుఁడై కన్నవారికిని గనుఁగొన్నవారికిని గూడఁ బరమాహ్లాదముంగూర్చుచు సద్గుణములతోఁ బాటు వర్ధిల్లుచుండెను.

ఈతనిభ్రాతలగు రావణకుంభకర్ణులు మొదటినుండియుఁ గ్రూరమార్గప్రవర్తకులై విజృంభించి తపోవనంబులఁ బ్రవేశించి మహామునుల సత్కర్మంబులకు విఘ్నములఁగల్పించుచు నిర్దయు

లై వారి ననేకవిధముల బాధలఁ బెట్టుచుండెడివారు. అట్టిసమయములయందుఁ బరమదయాళుండును, పాపభీరుండును, బరదుఃఖదుఃఖితుండును నగు విభీషణుండు దనయన్నల ననేకవిధముల బ్రతిమాలి యాదారుణకృత్యములనుండి వారిని మరలించి తపోధనులను క్షమింపఁ బ్రార్థించి యాపద్విముక్తులగు వారివలన శుభాశీర్వాదంబుల నందుచుండెడివాఁడు.

విభీషణుండు చిన్నతనమునుండియు బ్రహ్మవంశోచితంబులగు సత్కర్మంబులను బ్రతిదినంబును విధివిధానంబున నిర్వర్తించుచు నియమపరుండై తండ్రియగు విశ్రవసుబ్రహ్మయొద్ద వేదాభ్యాసము సేయుచు వేదార్థముల నతిశ్రద్ధాన్వితుండై యడిగి తెలిసికొనుచుఁ బరతత్త్వమునుగూర్చి యాలోచించుకొనుచుఁ దన్మయుఁడై యానందబాష్పంబుల విడుచుచు నన్నలవలె నెన్నఁడును గలనైనఁ బరహింసాపరాయణుండుగాక కరుణార్ద్రహృదయుండై ప్రశాంతచిత్తముతోఁ గాలక్షేపము సేయుచుండెను. ఆకాలమునం దాతనికిఁ బ్రతిదినమును బ్రధానకృత్యములు రెండైయుండెను. తనయగ్రజులచే నతిదారుణముగ బాధితులగుచున్న తపోధనుల యపాయనివారణమున కుపాయ మాలోచించుటయొకటి; సర్వజ్ఞుఁడగుజనకునివలన సకలధర్మతత్త్వములను గ్రహించి నియతవ్రతుండై స్వధర్మాచరణంబుఁ గావించుట మఱియొకటి; విభీషణునిబాల్యమంతయు నీవిధముగ జరిగెను.

ఇట్లుండ విధివశంబున దుర్మదాంధులగు రావణకుంభకర్ణులు విశ్వవిజయాపేక్షులై బలసాధనంబుకొఱకు గోకర్ణక్షేత్రంబునకుంబోయి యచ్చటఁ బరమేష్ఠింగూర్చి యనన్యసాధ్యంబును, నతికఠోరంబును నగుతపంబు సేయ నారంభించిరి. సాధుశీలుండగు విభీషణుండును నాత్మమంగళాకాంక్షియై తపశ్చరణాభిలాషచే గోకర్ణంబునకుఁబోయి భ్రాతలయాశ్రమంబుల కనతిదూరంబున నొకయాశ్రమంబుఁ గల్పించుకొని, నియతచిత్తుండై ప్రాణాయామంబు చేసి నిర్మలహృదయకమలపీఠంబునఁ బద్మసంభవుని నెలకొల్పి నిశ్చలభక్తియుక్తుండై యేకపాదంబున నిలిచి, నిరాహారియై పెక్కేండ్లు తపంబుఁ గావించెను. అనంతర మున్మీలితనయనుండై తదేకదృష్టితో నాదిత్యమండలము నవలోకించుచు నూర్ధ్వబాహుఁడై విశుద్ధచిత్తంబున శ్రుతిసంకీర్తనంబుఁ జేసికొనుచుఁ గొంతకాలము మహాతపముఁ గావించెను.

పరమశాంతుఁడగు నాతని తపఃప్రభావముచేఁ దపోవనమంతయు శాంతినిదానంబయ్యెను. అందుచే నచ్చటిసకలజీవనముదాయంబును తమతమజాతివైరంబులను వీడి పరమానందంబునఁ బరస్పరసహాయంబులు చేసికొనుచు మిత్రభావంబున మెలంగుచుండెను. మఱియు సాధువిహంగములు నిర్భయముగా విభీషణునికంఠమునుండి వ్రేలాడుచున్న రుద్రాక్షమాలికలపై వ్రాలి బ్రహ్మానందపారవశ్యముచే నాతనికన్నులనుండి వెలువడుచున్న ప్రేమాశ్రుధారల నాప్యాయనంబుగ నాస్వాదించి

తృష్ణానివృత్తిఁగావించుకొని యానందగీతముల గానము సేయుచుండెను.

ఇట్లు పరమనిష్ఠాగరిష్ఠుండై విభీషణుండు గావించుచున్న మహాతపంబునకు సంతుష్టుండై భక్తవత్సలుండగు పంకజాసనుం డాతనికి సాక్షాత్కరించి కరుణాకటాక్షవీక్షణంబుల నాతనిపైఁబరగించుచు "వత్సా! విభీషణా! యోగరంజితమతివై నీవాచరించు తపంబునకుఁ బ్రహృష్టహృదయుండ నైతిని. అపారంబగు నీభూతదయాపరత్వమును, ననుపమానమగు నీధర్మబుద్ధియుఁ బ్రశంసనీయంబులు. ఈజగంబునందలి తపోధనులలో నీకు సముండగువాఁ డెవ్వఁడును లేఁడు. నీనిశ్చలారాధనంబునకు మెచ్చితిని. నీయభిమతార్థంబుఁ దీర్పుటకై వచ్చితిని. ఏమికావలయునో కోరికొను"మని యనుగ్రహించెను.

అప్పుడు విభీషణుఁడు పరమేశ్వరసాక్షాత్కారముచేఁ బరమానందపులకితాంగుండై చేతులుజోడించుకొని "స్వామీ! కమలాసనా! తేజఃకిరణంబులచే సూర్యుండును, శాంతకళలచేఁ జంద్రుఁడును, పావనజ్వాలలచేఁ బావకుండును, వన్నెఁగాంచి సవిధంబున సకలసద్గుణంబులచే సంస్తవనీయుండవై సర్వజగంబులను సృష్టించుటకుఁ గర్తవైన సర్వేశ్వరుండవగు నీవు నాతపంబునకు మెచ్చి పరమానుగ్రహంబున నాకు సాక్షాత్కరించితివి. నాజీవితము ధన్యమైనది. నేనుకృతకృత్యుండనైతిని. ఇదియే నాకుఁ బదివేలు. ఇంతకంటెను నాకపేక్షణీయం బేము

న్నది? అయినను నమోఘదర్శనుండవగు నీ విట్లనుగ్రహించి వరప్రార్థనంబు గావింపుమని యానతిచ్చినప్పు డుదాసీనుండనై యుండుట భావ్యంబుకాదు. మహాత్మా! నీకు నాపై వాత్సల్యము గలదేని నన్నెన్నఁడును దుస్సహంబులగు నాపదలు పొరయకుండునట్లును, నాచిత్తము నిరంతరమును ద్రిలోకపూజ్యంబగుధర్మమార్గమునే యనుసరించుచుండునట్లును నుపదిష్టంబుగాకుండఁగనే యిచ్చవచ్చినప్పు డనివార్యంబగు బ్రహ్మాస్త్రంబు నాకు వశంబగునట్లును వరంబులు దయసేయుము. మఱియునా యాశ్రమధర్మంబుల కనుకూలంబుగ నాచిత్తవృత్తి యుండున ట్లనుగ్రహింపుము." అని ప్రార్థించెను.

లోకపితామహుండగువిధాత యాతనిసాధుస్వభావంబునకుఁ బరమానందభరితుండై యభీష్టవరప్రదానంబుఁ గావించి "విభీషణా! నీవు రాక్షసవంశంబున జన్మించియుఁ గ్రూరవృత్తి సుంతైనను లేకుండ సౌమ్యగుణవిరాజితుండవై యొప్పుచున్నాఁడవు. దేవతలుగూడ నీసమానులుగాఁజాలరు. భక్తిభావపూరితంబులగు నీపవిత్రవచనంబులు నన్నుఁ బరమానందంబునఁ దేల్చినవి. వత్సా! నీకు, అమరత్వమును, చిరంజీవత్వమును, అకుంఠితసౌశీల్యమును బ్రసాదించితిని. నీవింతటినుండి దేవదానవమానవాదులయం దుత్తమోత్తముఁడవై స్తవనీయచరితుఁడవై మెలంగెదవుగాక!" అని యనుగ్రహించి యంతర్ధానుండయ్యెను. ఆసమయంబున నంతరిక్షమునుండి పుష్పవృష్టి గురిసెను, దేవదుందుభులు మొరసెను.

అదిమొదలు విభీషణుఁడు, పరమేశ్వరుఁడు సత్స్వరూపుఁడనియుఁ దద్భావమే సత్యమనియుఁ దత్కళయే శాంతమనియు దద్గుణమే సౌమ్యతయనియుఁ దదంగమే ధర్మమనియు నట్టి ధర్మము నాశ్రయించినగుణవిశిష్టులే మాననీయు లనియుఁ దద్వ్యతిరిక్తులగువారు కామక్రోధాదులకువశులై యధోగతు లగుచుందు రనియు, వారి నీడ ననుసరించియే సకలవిపద్వ్రాతంబులును సంచరించుచుండుననియు నీవిధముగా ధర్మాధర్మవిచారణముచేసి తత్త్వమును గ్రహించుచు భగవద్భక్తుఁడై మెలంగుచుండెను.

ఇట్లు విభీషణుఁడు ప్రశాంతభావంబున మెలంగుచుండ రావణుఁడు దుర్మదాంధుఁడై దేవగంధర్వాదులను, మానులను, మానవులను బరిభవించుచుఁ బరధనపరదారాపహారియై, నిరంతరమును దుష్కృత్యములచేతనే కాలక్షేపము సేయుచుఁ ద్రిలోకంబులయందునుఁ దన కెదు రెవ్వరును లేమిం జేసి విశృంఖలుఁడై సంచరింపఁదొడంగెను. తనయగ్రజుం డిట్లు పాపాత్ముండై తల్లిదండ్రులకును వంశంబునకును నపకీర్తి తెచ్చుచుండుటంగాంచి సహింపఁజాలక యాతని కనేకధర్మముల బోధించి యాయాసమయములయందు హితోపదేశంబు చేయుచుండెడివాఁడు. కాని, యాతనిమాట లెప్పుడును రావణుఁడు లక్ష్యముసేయలేదు. ఒకప్పుడు రావణుఁడు తనసోదరియగు శూర్పణఖ పరాభవమును దీర్చుటకని నెపముపెట్టు

కొని శ్రీరామునియెడల మత్సరించి కామాతురుండై కపటోపాయంబున సీతాదేవి నపహరించి తనరాజధానికిఁగొని తెచ్చెను. మహాపతివ్రతాశిరోమణియగు నామెను నాతఁ డనేకవిధముల బాధింపఁదొడంగెను. మహావీరశిరోమణియగు శ్రీరామచంద్రుఁ డీవృత్తాంతమంతయుఁ దెలిసికొని సుగ్రీవసాహాయ్యంబున జగంబంతయుఁ గంపింపఁజేయునంతటి మహాసైన్యముతో సముద్రమును దాఁటివచ్చి లంకానగరమును ముట్టడించి పుత్త్రమిత్త్రకళత్రాదులతో రావణుని సంహరించి సహధర్మిణియగు సీత నుద్ధరించుటకుఁ బూనుకొనియుండెను.

అతిదారుణంబగు నట్టివిపత్సమయంబున దూరదర్శియు ధర్మాత్ముండునగు విభీషణుండు చింతాకులితచిత్తుండై యన్నయగు దశకంఠుని చెంతకుఁబోయి వినయవినమితుండై హితమధురగంభీరవచనంబులతో "సోదరా! అసురకులపరిపాలకుండవును, దనుజరాజ్య సంస్థాపకుండవును నగు నీవి ట్లధర్మమార్గమునఁ జరించుచు నపకీర్తిపాలగుటయేకాక, యాత్మవినాశంబుఁ గల్పించుకొనుట పాడిగాదు. శ్రీరామచంద్రుఁ డసురసంహారణార్థమై యవతరించిన యాదినారాయణుఁడుగాని కేవలమానవమాత్రుఁడుగాఁడు. నీవు నిస్సంశయముగ నపహరించి తెచ్చి చెఱఁబెట్టిన సీతాదేవి నిశ్చయముగా లోకమాతయగు నాదిలక్ష్మీదేవిగాని, కేవలమానవకాంతగాదని నమ్ముము. ఆరాముఁడు కోట్లకొలఁది పరాక్రమధనులగు కపిభల్లుకవీరులతోఁ

గలసి నీపైదండెత్తి వచ్చియున్నాఁడు. ఆతని నాశ్రయించియున్న యోధులు సామాన్యులుగారు. మొన్న నొకకపివీరుఁడు సముద్రము లంఘించివచ్చి నిర్భయముగా నీకు బుద్ధిసెప్పి యీలంకానగరమంతయును ధ్వంసముచేసిపోయెనుగదా! ఆతనితో సమానులును నధికులునుగూడ ననేకవీరయోధు లాసేనయందున్నారు. బలాబలముల మాట యటుండనిమ్ము. విజయమనునది యెప్పుడును ధర్మపక్షమునం దుండునుగాని యధర్మపక్షమునం దుండదు. నీవు శ్రీరామచంద్రుని యెడలఁ గావించినది కేవల మధర్మమని సకలధర్మార్థవేదివగు నీకు వేఱుగఁ జెప్పనక్కఱలేదు. అసురసార్వభౌమా! నీవు నీరాజ్యమును, బ్రజలను, కులమును, కుటుంబమును, విపత్తులపాలైపోకుండనిలుపుకొనఁదలంతువేని నాప్రార్థనమును మన్నించి యిప్పుడైనను జానకీదేవిని గొనిపోయి సవితృకులతిలకుండగు రఘువీరున కర్పించి శరణంబు వేడికొనుము. అట్లు చేయకుంటివేని దానవకులంబంతయు నీమూలమున నిర్మూలమై పోఁగలదు. ఇంతయపచారముఁ గావించిననే నేమొగముఁబెట్టుకొని రామచంద్రుని దర్శింపఁగలనని శంకింపవలదు. అతఁడు శరణాగతరక్షకుఁడు; శాంతమూర్తి; కరుణామయుఁడు; ఉదారహృదయుఁడు. కాఁబట్టి యవతారమూర్తియగు నాతనిఁ శరణుఁజొచ్చుటకుఁ ద్వరపడుము. ఈయుచితసమయమును వ్యర్థముచేసి పిదపఁ జింతించుటవలనఁ బ్రయోజన మేమియును లేదు." అనియనేకవిధముల బోధించెను.

కఠినచిత్తుండును దృఢనిశ్చయుండును స్వతంత్రుండును సత్త్వగుణవిహీనుండు నగు రావణునకు సాధుశీలుండగు విభీషణుని మాటలు తలకెక్కునా? అప్పుడాతఁడు, తోఁకద్రొక్కిన త్రాచువలె నెగసిపడి క్రోధోద్రేకంబునఁ గన్నులనుండి యగ్నిస్ఫులింగములు వెలువడుచుండఁ దమ్మునింగాంచి "ఛీ! దురాత్మా! ఏమేమో పెద్దవలెఁ దగుదునని, యగ్రజుఁడు పూజ్యుఁడు ననితలంపక నాకు నీతులు గఱపవచ్చితివా? త్రిభువనేశ్వరుండనగు నాపెంపుఁ దలంపనైనఁదలంపక యొకమానవమాత్రుని దైవసమానుఁడని బట్టువలెఁ బొగడుటకు నీనోరెట్లాడినది? నావైభవమంతయు నీకన్నులఁ గుట్టుచున్నది కాఁబోలును. "జ్ఞాతిశ్చేదనలేనకిమ్" అనుమాట నీయెడల నిదర్శనముగ నగపడుచున్నది. జగదేకవీరుండనగు నేనొక సామాన్యమానవుని శరణంబు వేడుకొనుచుండఁగా నీకుఁ గన్నారఁ జూచి సంతసింపవలె ననియున్నదా? ఛీ! ఇఁక నీమొగముచూడఁగూడదు." అని తనవామపాదముచే విభీషణునిఁ దన్ని గెంటివైచుచు "కృతఘ్నా! పిఱికిపందా! నీవిక్షణమునందే నారాజ్యమును విడిచి పొమ్ము." అని యతిదారుణముగ శాసించెను.

నిండోలగంబునఁ గలిగిన యీదారుణపరాభవమునకు విభీషణుఁడు సహింపఁజాలకపోయెను. అప్పుడాతని కాకస్మికముగా నాగ్రహమును దుఃఖమునుగలిగినవిగాని సత్త్వగుణప్రి

ధానుండగు నాతఁ డంతలోనే మనసు పదిలపఱచుకొనియెను. అన్నతమ్ముఁ డన్ననువిచారముకంటె నిష్కారణముగ దనుజవంశక్షయమున కాతఁడు కారకుఁడయ్యెఁగదా యనువిచారమే విభీషణునిహృదయమును గలఁచివైవఁదొడంగెను. అట్టి వికలహృదయముతో నాతఁ డాక్షణమునందే సభవిడిచి యడుగులు తడఁబడుచుండ సకలాంగకములును గంపించిపోవుచుండ నంతఃపురంబునకుఁబోయి జననియగు కైకసిని దర్శించి, నమస్కరించి సర్వవృత్తాంతము నామెకెఱింగించి, "అమ్మా! నేనిఁక నీనగరమునందుండఁజాలను. ఏయరణ్యంబులకైననుబోయి తపంబు చేసికొనుచు శాంతముగఁ గాలక్షేపము సేయఁదలంచితిని. ఈ దారుణకృత్యములఁ గాంచుచు నీనగరమునం దుండుటకంటె నరణ్యావాసమే సుఖకరమైనదని తోఁచుచున్నది. తల్లీ! నాకిఁక సెలవిమ్ము." అనియెను.

ఆమాటలాలకించి తల్లియగుకైకసి కన్నులఁ నీరునించుచు "బిడ్డా! ఇందుకొఱకు నీవేమియును విచారింపకుము. విధివిధాన మవిలంఘ్యమైనది. మీయన్నలగు రావణకుంభకర్ణులిరువురును రాక్షసకులనాశకులనియు, వారిమూలమునఁ ద్రిభువనంబులకును జేటగుననియు నీవే సుగుణమూర్తివనియు నీవలననే దానవవంశము సుస్థిరముగా నిలిచి సుప్రసిద్ధకీర్తిగాంచుననియు నీజనకులును నీపితామహుఁడగు పులస్త్యుఁడును నిదివఱకే చెప్పియున్నారు. జరుగవలసినదెల్లను జరుగక మానదని

నేనిఁక నావిచారమంతయును వదలుకొనియున్నాను. త్రికాలవేదులగు నీపితృపితామహులు చెప్పినవాక్య మెప్పటికి నసత్యము కాదు. నీవుగాదు బ్రహ్మాదులు వచ్చి బోధించినను వారు వినువారుగారు. వారిదుష్కర్మము వారి నాత్రోవ కీడ్చుకొనిపోవుచున్నది. నీవు మాత్ర మేమిచేయఁగలవు? నిన్నుఁగూడఁ దమతోఁజేరి పనిచేయవలయునని నిర్బంధింపక యీవిధముగాఁ ద్యజించివైచుట మేలే యనితలంపుము. నీవిప్పుడే పోయి శ్రీరామచంద్రమూర్తిని శరణంబువేఁడి యాతనిసేవించుచు జీవింపుము. ఆతఁడు కేవలముఁ బరాత్పరుఁడుగాని మానవమాత్రుఁడుగాఁడు. సహోదరుల కపకారమగునేమోయని సంశయింపకుము. పొమ్ము." అని యాశీర్వదించి సెలవొసంగెను.

విభీషణుఁడును మాతృవాక్యమును శిరసావహించి పూర్వాపరంబులు విచారించుకొని కార్యనిశ్చయంబుఁ గావించుకొని లంకానగరమునందును రావణకుంభకర్ణులయందును రాక్షసకులంబునందును గలమమకారమును ద్యజించి గగనమార్గంబునఁ బోయి వానరసేనామధ్యంబునందున్నశ్రీరామచంద్రుని చరణకమలములయందుఁబడితనయన్వయనామగోత్రంబులు దెలుపుకొని శరణంబు వేఁడికొనియెను. ఆశ్రితజనశరణ్యుండగు రఘువీరుండాతని కభయప్రదానంబుఁగావించెను. ఈతఁడుశత్రు

పక్షములోనివాఁడనియు, రావణునకు సహోదరుఁడనియు రాక్షసుండుగావున విశ్వసనీయుండుగాఁడనియుఁ గొందఱు వానరవీరులు తమవ్యతిరేకాభిప్రాయములను శ్రీరామచంద్రునకు విన్నవించిరి. కాని, సర్వవృత్తాంతము నెఱింగియున్న హనుమంతుఁడు వారివారిసంశయముల నివారించి విభీషణుని యోగ్యతనుగూర్చి రామునకు విన్నవించెను. రాఘవుండప్పుడు విభీషణునిఁ దనయాత్మీయునిగా నంగీకరించి లంకారాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిఁగావించెదనని యనుగ్రహించెను.

విభీషణుండును మహాప్రసాదముగ భావించి బాంధవాభిమానమును విసర్జించి భువనమంగళంబుకొఱకు దుష్టసంహారము కావలయునని భావించి రామునియుదారస్వభావమునకు సంతోషించుచు నావశ్యకంబులగు లంకారహస్యవిషయంబుల నాతని కెడనెడ నెఱింగించుచు రామచంద్రునకు హితుండును, బంధుండును, సహాయుండును, విశ్వాసపాత్రుండునై మెలంగుచుండెను.

రావణాదిదుష్టరాక్షససంహార మయ్యెను. అప్పుడు విభీషణుఁడు సీతామహాదేవిని సగౌరవముగ సభక్తికముగఁ దీసికొనివచ్చి శ్రీరామచంద్రమూర్తి కర్పించెను. విజయరాఘవుఁడు పరమానందముతో విభీషణునకు మహావైభవంబు మెఱయ లంకారాజ్యపట్టాభిషేకంబుచేసి తొల్లి దానొనరించినవాగ్దానముఁ జెల్లించుకొనియెను. విభీషణుండును హతశేషులైన రాక్షసకుటుంబములకుఁ దగినయుపాధులను గల్పించి రాజ్యపరిపాలనంబుఁ గావించుచు నంతటినుండి తనరాజ్యమునందు దానవులు దారుణకర్మ

ముల నాచరింపఁగూడదనియు, హింసారతులుగాక, యిష్టదైవంబుల నారాధించుకొనుచు, ధర్మమార్గంబునఁ జరించుచుండవలయుననియు శాసనముంగావించెను. లంకానగరమధ్యమున మహావైభవసమన్వితంబును, నమూల్యమణిసువర్ణఖచితంబును జిత్రవిచిత్రభూషణాలంకృతంబును, మనోహరంబును దర్శనీయంబును నగు శ్రీరామాలయమును నిర్మించి యందు శ్రీరామవిగ్రహమును బ్రతిష్ఠించి నిరంతరము నరుణోదయమునకుముందుగ లేచి యాదివ్యమూర్తిని సందర్శించి యారాధించుచుండెను. మఱియుఁ దనయున్నవలెనే లంకానగరమునఁ బ్రతిష్ఠింపఁబడిన శివాలయంబులయందలి శివలింగములకు సద్భక్తితోఁ బూజించుచుండెను.

తరువాత విభీషణుఁడు శ్రీరామచంద్రుని పట్టాభిషేకసమయంబున కమూల్యోపాయనంబులు గైకొని యయోధ్యానగరంబునకుఁ బోయి యచ్చట మహారాజచంద్రుఁడగు శ్రీరామునిచేఁ దమ్ములగుభరతాదులతో సమానమగుగౌరవముం గాంచి యాయనఘుని యపారకరుణాకటాక్షంబునకుఁ బాత్రుండై కొన్నాళ్లందుండి యవ్విభుని యనుజ్ఞవడసి లంకానగరంబునకు విచ్చేసి మహానందంబున రాజ్యపరిపాలనంబు సేయుచు, దేవదానవమానవసంఘంబులచే సంస్తూయమానుండై స్వప్నంబునందైనను సన్మార్గంబును దప్పక సంచరించుచుఁ జిరంజీవియై పరమభక్తాగ్రేసరుండను ప్రఖ్యాతిం గాంచి సుఖంబుండెను.

చిరంజీవులు

౬ కృపాచార్యుఁడు

గర్భనరకబాధ ♦ గానక జనియించి
ఆత్మశక్తిచేత ♦ హరుని గాంచి
దీర్ఘజీవియైన ♦ తేజస్వికృపుని, మా
నసమునందుఁ దలఁచి ♦ నతులొనర్తు.

కృపాచార్యుఁడు శరద్వంతుఁడను మహర్షికిఁ దనయుఁడు. ఈతఁడు చిన్నతనమునుండియు భూతదయగలవాఁడు. చీమలుమొదలగు నల్పజంతువు లెండవానలతాఁకున కోర్వఁజాలక శ్రమపడుచున్నప్పుడు దయాళుఁడగునీతఁడు సాధ్యమైనంతవఱకు వాని కుపచారములుగావించుచుండెడివాఁడు. ఈతఁడెంతటిసుందరమూర్తియో యంతటికరుణామూర్తియగుటచేఁ గృపాశాలియగు నీతనిఁగాంచినవా రందఱును పేరునకుఁదగినసద్గుణములు గలవాఁడే యని మెచ్చుకొనుచుండిరి. ఈతఁడువిద్యానిధియగు తనజనకునియొద్దనే వేదవేదాంగములును, శాస్త్రములును, ధనుర్వేదమును గూడ నభ్యసించి క్రమముగా సమస్తవి

ద్యాపారంగతుఁ డయ్యెను. విద్యాభ్యాససమయంబున నీతఁడు మిగులశ్రద్ధాన్వితుఁడై తండ్రియుపదేశించిన విషయంబుల నన్నిటినిఁ దనవినిర్మలహృదయఫలకంబునముద్రింపఁజేసికొనుచు మాటిమాటికిని, వానివిశేషార్థములను మననముచేసికొనుచు విద్యాలంకారుఁడై వెలయుచుండెను.

ఆతనివిద్యాబుద్ధులును స్వరూపస్వభావములును, శక్తియుక్తులును, గాంచి కురుపితామహుఁడగు భీష్ముండు శరద్వంతుని బ్రార్థించి తదనుమతంబునఁ గృపాచార్యుని హస్తినాపురంబునకుఁ దోడ్కొనిపోయి, కురుకుమారుల కందఱకును విద్యాగురునిగాఁజేసి యాతని ననేకవిధంబుల నాదరించి పూజించుచుండెను. కృపుండును దనయసాధారణబోధనానైపుణ్యముచే నుచితపద్ధతిని గురుకుమారులకందఱకును సకలవిద్యల నుపదేశించుచు రాకుమారులగువారిని ధనుర్విద్యావిశారదులుగఁ గూడఁ గావించి ప్రభునిమన్ననకును, శిష్యులగౌరవమునకును బాత్రుండై స్వధర్మనిర్వహణమును గావించుకొనుచుండెను.

అంతఁగొన్నిదినంబులకుఁదనసహోదరీభర్తయగుద్రోణాచార్యుండు కురుకుమారులకు ధనురాచార్యుండుగా హస్తినాపురంబునకు విచ్చేయుటయుఁగృపాచార్యుండుదనకించుకవిశ్రాంతి కలిగినదని సంతోషించి భీష్మానుమతంబువడసి యాధ్యాత్మికతత్త్వచింతాపరుండై బ్రహ్మతత్త్వజ్ఞానంబును సాధించునుద్దేశముతో సాధుజనసమాకీర్ణంబగు కాశీపురంబునకుంబోయెను.

అట నొకనాఁటిసాయంకాలంబునఁ గృపాచార్యుండు గంగాతీరంబునఁ గూర్చుండి పరమపావనంబులగు భాగీరథీవిమలజలంబులలోఁ బ్రతిబింబించుచున్న ప్రశాంతకిరణుండగు ప్రభాకరుని విలోకించుచుండెను. అప్పు డాతని కనతిదూరంబున నట్టిప్రభాకర తేజమే వదనమండలంబున వెల్లివిరియుచుండ సాక్షాత్కరించినశంకరునింబోలి వెలుంగుచున్న దివ్యతముఁడను సంయమీంద్రుం డాతనికి దృగ్గోచరుండయ్యెను. తోడనే కృపాచార్యుండు పరమానందకందళితహృదయారవిందుండై ఈమహాత్ముని సేవించినచో నాయభిమతార్థంబు సిద్ధింపఁగలదని భావించి యచటనుండి లేచి యాతనిసమీపంబునకుం బోయి యమ్మునీంద్రుని చరణకమలంబులకు సాష్టాంగప్రణామంబుఁ గావించెను. అప్పుడు తపోధనుండగు దివ్యతముఁడు వాత్సల్యపూర్వకంబుగ నాతని నాశీర్వదించి నీ వెవ్వరివాఁడ వేలవచ్చితివని ప్రశ్నించెను.

కృపుం డప్పుడు తనకులగోత్రనామంబులఁ దెలిపికొని "మహాత్మా! నీసేవఁగావించి కృతకృత్యుండఁ గావలయునని తలంచి భవదనుగ్రహముఁ గోరి వచ్చియున్నాఁడను." అనివిన్నవించుటయు, మునివరుండగుదివ్యతముం డించుకసేపు నిమీలితనేత్రుండై యాలోచించి మందస్మితవదనారవిందుండై "వత్సా! కృపాశాలివగునీవు నీకుఁదగినసదుద్యోగమునకుఁ బ్రయత్నించుచుంటివి. నీవుదుర్భరంబును, సంతాపభాజనంబును నగుగర్భనరకము ననుభవింపకయే యవతరించినపుణ్యమూర్తివి. శర

స్తంబసంఘర్షణంబున వ్యక్తంబైన నీయీభౌతికమూర్తి కేవలము నీ దివ్యమూర్తియైయున్నది. నీవంటిపుణ్యాత్మమూర్తి శిష్యుఁడుగా లభించుటచే నేను ధన్యుఁడనైతిని. నావలనఁ దెలియందగినధర్మరహస్యంబు లేవైన నున్నచో నిస్సంశయంబుగ నడిగి తెలిసికొనవచ్చును. ఉత్తమాధికారివగు నీకుఁ దెలుపందగనిగూఢతత్త్వంబు లేవియును లేవు," అని యనుగ్రహించి యాదరించుటయుఁ గృపుండు పెన్నిధిగన్నపేదవలె నానందతన్మయుండై "మహాత్మా! నేను నాజనకునియొద్ద సమస్తవేదవేదాంగములను సరహస్యంబులుగా నభ్యసించితిని. వానినన్నిటిని సంపూర్ణముగా నిప్పటివఱకును మననముచేసికొనుచునే యుంటిని. కాని, "చదువులకును, వాక్కులకును, మనస్సునకున్ గూడ నందరానిదియు, సర్వమును దానయై వెలుంగుచున్నదియు, సులభంబయ్యు దుర్లభంబైనదియు నగుపరమతత్త్వముం గూర్చి తెలిసికొనవలయునని చాలఁ గుతూహలపడుచున్నాఁడను. నీయనుగ్రహంబున నాయభీష్టార్థంబు సిద్ధింపఁగలదని యాసపడుచున్నాఁడను. నన్ననుగ్రహింపవలయును." అని ప్రార్థించెను.

దివ్యతముం డాతనిసదభిలాషంబునకు సంతుష్టుండై "వత్సా! అడుగందగినయర్థమునడిగితివి. ఆధ్యాత్మికచింత సర్వకార్యసంఘటనమునకును బ్రధానాధారమైనది. ఆత్మసమ్మేళనము సేయనిదే యేకార్యమును సాధింపఁజాలము. సాధకుండగు

వాఁడు ముందుగ నితరకార్యతత్త్వమును సంపూర్ణముగ మఱచిపోవలయును. సాంసారికవ్యాసంగమును విస్మరింపవలయును. కష్టసుఖంబులయందుఁ దలంపులేకుండవలయును. గురూపదేశమును గ్రహించుటయందే తనమనంబును నిశ్చలంబుగ నిలువరించియుండవలయును. గురువుకూడ నిట్లే యితర వ్యావృత్తిని మఱచి ప్రబోధింపవలయును. ఆత్మదృష్టికి గోచరముగాని దెద్దియును లేదు. నిశ్చలచిత్తముతోఁ బ్రయత్నించినచోఁ బరమేశ్వరుని సత్యస్వరూపమును గాంచఁగలరు. ఆత్మయే భగవంతుని లీల. ఆత్మశక్తిచేఁ బర్వతములను గరఁగింపవచ్చును. సముద్రములను శోషింపఁజేయవచ్చును. దారుణానలజ్వాలలను జల్లార్పవచ్చును. కాని, యగ్నికి ధూమమువలె నాత్మకుఁ బ్రకృతిసంబంధమగు మోహవికారము వ్యాపించియుండును. ఆవికారమును దొలఁగించువఱకును నాత్మకు నిర్మలత్వము గలుగనేరదు. కావున, సాధకు లీవిషయమును జ్ఞప్తియందుంచుకొని యజ్ఞాననివృత్తికై యనుక్షణమును బ్రయత్నించుచుండవలయును. అట్లు సేయకున్నచోఁ బరిపూర్ణజ్ఞానము లభింపఁజాలదు. నీవిప్పుడు ముందుగ నీయంతరంగమును వినిర్మలముగఁ జేసికొనఁ బ్రయత్నింపుము. నీమనం బెప్పుడు నిర్మలంబగునో నీవుతలంచిన సద్వస్తువప్పుడు నీకు దృగ్గోచరంబు కాఁగలదు. అదిగో నాయాశ్రమమువంకఁ జూడుము. ఆయావరణమునఁ గవాటమున కెదురుగ నేమున్నదో తదేకదృష్టితోఁ

గన్గొనుచుండుము. అనంతరము తక్కినవిషయములం గూర్చి ప్రయత్నింపవచ్చును." అని యుపదేశించెను.

తత్త్వదర్శనకుతూహలుండగు కృపాచార్యుఁడు మహాప్రసాదమని తదేకదృష్టితో మనంబు నేకీభవింపఁజేసి యాకవాటమువంక లక్ష్యముంచి ధ్యాననిమగ్నుఁడై యుండెను. ఆసమయంబున దివ్యతముండు తనచెంతనున్న బ్రహ్మదండమును దీసి మెల్లఁగఁ గృపునియంకతలంబునం దుంచుటయు నాతఁ డులికిపడి యాదండమును జేతితో నవ్వలికిఁ ద్రోసివైచెను. అది చూచి గురుండు "కృపా! నీచిత్తమింకను నిశ్చలముకాలేదు. అన్యచింతలను విడిచి, యహంకారమును ద్యజించి, నిర్వికారుండవై యింకను బ్రయత్నింపుము" అని బోధించెను.

శ్రద్ధాయుక్తుండగు కృపుండు మరల లక్ష్యసాధనంబునకై ప్రయత్నము చేసెను. సాయంకాలమయ్యెను. గురుండగు దివ్యతముండు గంగాతీరమునకుం బోయి సంధ్యావందనాదికృత్యంబులు నిర్వర్తించుకొని మరలివచ్చెను. కృపుండింకను లక్ష్యసాధనంబు సేయుచునే యుండెను. క్రమముగా జాము రాత్రియైనది. నాఁడు పూర్ణిమయగుటచే వెన్నెల పుచ్చపువ్వువలె జగమంతట వ్యాపించియుండెను. అంతవఱకును శిష్యుని యభ్యాసముం గాంచి యానందించుచున్న దివ్యతముం డవ్వా డాతని చిత్తమెంత నిశ్చలముగనున్నదో పరీక్షింపవలయునని తలంచి యొక రజ్జువు నాతని మెడకుఁ దగిలించెను. కాని, కృపుం డెంతమా

త్రిమును జలింపలేదు. అంతలో నూరకుండక గురుండు తన కమండలుజ్జలంబుల నాతనిపైఁ జిలుకరించెను. క్రమముగా జలమంతయు నాతనిపైఁ గుమ్మరించెను. కృపుండు సుంతయుఁ జలింపలేదు. శీఘ్రగ్రహణశీలుండును గుశాగ్రబుద్ధియు నగు నాకృపాచార్యుఁ డచిరకాలంబుననే తత్త్వజ్ఞానసంపన్నుఁడుగాఁ గలఁడనియు, నిట్టి ప్రియశిష్యుఁడు లభించుటచేఁ దనయుపదేశంబు సార్థకంబు గాఁగలదనియు నామునీంద్రుండు పరమానందభరితుఁ డయ్యెను.

ఈవిధముగాఁ గృపుండు గురూపదేశంబు వడయుచు నియతవ్రతుండై జ్ఞానసాధనంబు సేయుచు నచిరకాలంబుననే బ్రహ్మజ్ఞానసంపన్నుండై పరమయోగిశిరోమణియయ్యెను. సర్వజ్ఞుండగు నాతనికిఁ గాలత్రయంబును గరతలామలకం బయ్యెను. అట్లు కొంతకాల మాత్రఁడు కాశీనగరమునందుండి యనంతరము గురునియనుజ్ఞంగాంచి మరల హస్తినాపురంబునకే తెంచెను.

అప్పటికప్పుడే కురుపాండవులలో నంతఃకలహములు వర్ధిల్లుటయు దుర్యోధనుఁడు లాక్షాగృహదహనాదిదుష్కర్మంబులఁ గావించుటయుఁ బరమేశ్వరానుగ్రహంబునఁ బాండవులు విపద్విముక్తులై ద్రుపదరాజతనయయగు పాంచాలిం బరిణయంబై మరల రాజ్యంబునకే తెంచుటయు ధర్మజుండు రాజ

సూయయాగంబు నతివైభవంబుగ నిర్వర్తించుటయు జరిగిపోయెను.

దుర్యోధనునిదుస్తంత్రముచే మఱునాఁడు సుహృద్ద్యూతము సేయ నిశ్చయమయ్యెను. కృపాచార్యుండు వచ్చినతోడనే యీదారుణవార్త నాలకించి యతిత్వరితంబుగ సుయోధనుని చెంతకేఁగి యాకస్మికంబుగనే తెంచిన బాల్యగురుండగుత న్నాతఁడు కుశలప్రశ్నము సేయకున్నను గోపగించుకొనక శిష్యవాత్సల్యంబునను కురుకులమునందలి యభిమానంబునను నాతని కనేకవిధంబుల హితోపదేశంబుఁ గావించెను. కాని, దురభిమానియగు దుర్యోధనున కాసద్బోధనములు చెవి కెక్కలేదు. అందుచేఁ గృపున కాకస్మికముగ విరక్తి కలిగి యచ్చటినుండి వెడలిపోయెను. కాని, చిరకాలమునుండి దృఢపడియున్న సంబంధ మంతలో నెట్లు సడలిపోఁగలదు? తనకిష్టము లేకపోయినను గృపుఁడు పాండవధార్తరాష్ట్రులు జూదమాడ నిశ్చయించినసభకుఁ బోవుట తప్పించుకొనఁజాలకపోయెను. ఆమాయజూదమునందుఁ బాండవులు సర్వస్వము నోడిపోయిరి. అప్పుడు భీష్మద్రోణులతోఁ గలసి కృపాచార్యులుగూడ దుర్యోధనున కట్టిదారుణకార్యములు తగవనియు నంతఃకలహములవలనఁ గులక్షయంబు కాఁగలదనియు నెన్నియోవిధముల బోధించెను. దుర్యోధనుఁడు వానిని లక్ష్యపెట్టక నిండుసభలో ద్రౌపదిని పరాభవించుచుండఁ గృపామయుండగు కృపుఁ డాదుష్కర్మమును

గనుంగొనఁజాలక, దుర్బుద్ధులగు దుర్యోధన దుశ్శాసనులను వారింపఁజాలక, విరక్తుండై సభనుండి వెడలిపోయెను.

పాండవులకును గౌరవులకును గూడ నెవ్వరెన్నివిధములఁ బ్రయత్నించినను, విధివశంబున మహారణము తప్పినది కాదు. మొదటినుండియు రాజోద్యోగియై యుండుటచేతను, అప్పుడప్పుడు తాత్కాలికముగ యుధిష్ఠిరుఁడు రాజై యున్నను, ధృతరాష్ట్రుఁడే హస్తినానగరరాజ్యమునకంతకును బ్రభుండై యుండుటచేతను, నాతనితనయులగు దుర్యోధనాదులే రాజ్యమునకుఁ బ్రధానాధీశ్వరులై యుండుటచేతను, బావయగు ద్రోణాచార్యుఁడును, మేనల్లుఁడగు నశ్వత్థామయు ధర్మాధర్మపక్షభేదమును విడిచి స్వధర్మములు నిర్వర్తించుకొనుటకై నామమాత్రముగ గౌరవపక్షమునఁ జేరియుండుటచేతను, దానుగూడ నాపక్షము నందేయుండి యుద్ధముచేయవలసినవాఁ డయ్యెను.

కాని, నిర్లిప్తుండగు మనకృపాచార్యుఁ డామహారణంబునఁ గావించినప్రధానకార్యం బేదియును లేదు. తన్నెదిరించిన వారితోఁ బోరాడుటకంటెఁ దానెవ్వరినెదిరించి యుద్ధముసేయ లేదు. యుద్ధమంతయు ముగిసినవెనుకఁగూడ నశ్వత్థామ దురాగ్రహవశంబున నప్పటికి సగముసచ్చిపడియున్న దుర్యోధనుని మాటవిని యధర్మమునకు వెనుదీయక యర్ధరాత్రివేళఁ బాండవశిబిరంబులపైఁబడి నిదురించుచున్న యోధులయెడ నకారకరణంబుఁ బూనికొనియున్నప్పు డాతని కనేకవిధంబుల బోధించి క్రూరకర్మంబునుండి యాతని నివారింపఁజూచెను. కాని, ప్రయోజనము లేకపోయెను.

ఈమహాత్ముఁడు మొదటినుండియు మహారాజుసంబంధముగలవాఁ డయ్యును, నిర్లిప్తుండై నిష్కామకర్ముండై తామరాకునందలిజలంబునుంబోలి యేవిషయంబులయందును దగులు వడక నిస్సంగునింబోలి, కాలక్షేపముం గావించెను. ఈతఁడు మహావీరుఁడయ్యును, బరమశాంతుఁడు; ప్రజ్ఞానిధియయ్యును, వినయవ్రతుఁడు; భవబంధితుండయ్యును, బరమయోగిశిఖామణి; బ్రహ్మజ్ఞానసంపన్నుండగునీతఁడు పవిత్రక్షేత్రంబగు వారాణసీనగరంబునఁ బరమేశ్వరారాధనంబుఁ గావించుకొనుచు నప్పటికి నిప్పటికి నెప్పటికినిగూడఁ జిరంజీవియైయున్నాఁడు.

చిరంజీవులు

౭. పరశురాముఁడు.

జనకు నాజ్ఞదీర్చి ♦ జనయిత్రి బ్రదికించి
యవనిభరముమాన్చి ♦ యశముఁగాంచి
తామసంబుఁబూనఁ ♦ దగదని బోధించి
నట్టి పరశురాము ♦ నాత్మఁదలఁతు.

కన్యాకుబ్జమునకుఁ బ్రభుండగు గాధిరాజునకు సత్యవతి యను రూపవతియగు నొకతనయ గలిగెను. మహర్షియగు నౌర్వునితనయుండు రుచికుం డనువాఁ డాకన్యకామణినిఁ బ్రేమించి యొకప్పుడు గాధిరాజును సందర్శించి నీతనయను నాకిచ్చి పరిణయంబుఁ గావింపుమని ప్రార్థించెను.

అసమానసౌందర్యముచేతను, సుగుణంబులచేతను, విమలజ్ఞానముచేతను, బరమధర్మనిష్ఠచేతను బ్రసిద్ధుండగు రుచికుండు రాజపుత్త్రికిఁ దగినవరుఁడే. కాని యాతఁడు పరమదరిద్రుఁడు. రెండుపూటలును గడుపునిండించుకొనుట కాతనికిఁ దగినయాధారమేమియును లేదు. అట్టి పేదబాపనికిఁ దనపుత్త్రిక నొసంగుట మహారాజున కెంతమాత్రము నిష్టములేక

పోయెను. రుచికుఁడు నిరాశచేఁ గేవలము నింటికి మరలిపోవలసినవాఁడయ్యెను.

అప్పుడు మహారాజు తనలో "ఇంతటి మహాపురుషుని ప్రార్థనమును దిరస్కరించి యూరకపంపివైచుట యెట్లు? ఈ యకార్యంబువలన లోకులు నన్ను నిందింపకుందురా? మఱియు నీతఁడు విరక్తుండైనచో నేమివాటిల్లునో యెవ్వరు చెప్పఁగలరు? స్పష్టముగా నాతనయ నీకీయనని చెప్పక యేదోయొక విధముగఁ బులిమిపుచ్చి యీతనిఁ బంపివేయుట శ్రేయము." అని భావించుకొని, రుచికునిఁగాంచి "ఆర్యా! మావంశమునందుఁ గన్యకలకుఁ బరిణయంబు గావించుపట్టున వరులయొద్దనుండి స్త్రీధనంబుగాఁ బణంబునుగ్రహించుట యాచారమైయున్నది. నీవు నాపుత్త్రికను బెండ్లియాడఁ దలంచినచోఁ బణంబు నొసఁగవలసియుండును. నీవందుల కంగీకరింపఁగలవా?" అని ప్రశ్నించెను.

రుచికుండామాటవిని యెట్టిపణంబు నొసంగవలయునో యెఱింగించినచో దానిని సంపాదించి యిచ్చుటకై ప్రయత్నించిచూచెద ననియెను. మహారాజించుకసేపాలోచించి "మునికుమారా! శరీరమంతయుఁ దెలుపును, గర్ణాంతరంబునం దెఱుపును, నొకచెవి నలుపునుగల వేగవంతములగు వేయిగుఱ్ఱములను, నాకుమారియగు సత్యవతికిఁ బణంబుగా నొసంగవలయును. అట్లు నీవీయఁగలవేని, ఆమెను నీకిచ్చి పెండ్లిసేయఁగలవాఁడను." అనిచెప్పెను.

అట్టి యుత్తమాశ్వములు విక్రయస్థానములయందు లభించుట కెట్టి యవకాశమును లేదు. ఒకవేళ లభించినను, మునికుమారుఁడు వానికిఁ దగినమూల్య మెచ్చటినుండి తెచ్చి యీయఁగలఁడు? రాజదియంతయును బాగుగ నాలోచించియే యతినిపుణముగ నిట్లు సమాధానముచెప్పి తన తలపై బరువు దింపుకొనియెను. కాని రుచికుఁడు మాత్ర మతిసులభోపాయముచే నట్టిమహాపణమును సంపాదింపఁగలిగెను. ధనము కొఱకుఁ దల్లడపడుటఁగాని, విక్రయస్థానముల వెంటఁ బరిభ్రమించుట గాని, యాతని కావశ్యకము లేకపోయెను. ఆతఁడు తత్క్షణమె వరుణదేవుని చెంతకుం బోయి, అట్టిపోలికగల వేయిగుఱ్ఱములను దనకిమ్మని కోరెను, అప్పుడు వరుణదేవుండు సంప్రీతచిత్తుండై యట్టి యుత్తమాశ్వసహస్రంబు నాతనికిఁ బ్రసాదించుటయే కాక, వానిని వెంటఁబెట్టుకొని పోవు శ్రమకూడ మునికుమారునకుఁ గలుగకుండఁ జేయఁదలంచి "అయ్యా! నీవు నిశ్చింతుఁడవై స్వదేశంబునకుంబొమ్ము. నీవెచ్చటఁ దలఁచుకొన్న నచ్చట నివి నీకు లభింపఁగలవు." అని యనుగ్రహించెను.

అప్పుడు రుచికునకుఁగలయానందమునకుఁ బారము లేదు. పరమేశ్వరసంకీర్తనముం జేసికొనుచు మరల నాతఁడు కన్యాకుబ్జమునకువచ్చి గంగాతీరమున నిలిచి తలఁచినంత మాత్రముననే భాగీరథీగర్భమునుండి వెడలియయ్యుత్తమాశ్వంబులు హేషారవంబులచే దిగంతములు మారుమ్రోఁగుచుండ

నృత్యము చేసికొనుచు నాతనియొద్దఁ జేరుకొనియెను. మునితనయుండప్పు డాయశ్వసహస్రంబును వెంటఁబెట్టుకొని మందహాసవదనముతో గాధిమహారాజు చెంతకుఁ బోయి యాతని దర్శించెను. అట్టి రుచికుంగాంచినంతనే మహారాజునకు నోట మాటలేకుండఁబోయెను. ఇఁక నేవిధముచేతను నాతనిఁ దప్పించుకొననేరక యాతండొకశుభముహూర్తంబునఁ దనతనయ నమ్మునికుమారున కొసంగి వివాహంబుఁ గావించెను.

రాజనందినియగు సత్యవతి రుచికు నీవఱకే ప్రేమించి యుండెను. వివాహమైనపిమ్మట సాప్రేమమయదంపతులకు దినము లతిసుకరంబులుగఁ గడచిపోవుచుండెను. కాని, సత్యవతికి సంతానము కలుగలేదు. ఆమెతల్లికిఁగూడఁ బుత్రసంతానము లేకుండెను. ఆయిరువురకు నిరువురుపుత్త్రులుకలుగవలయునని ప్రజలందఱును గోరుకొనుచుండిరి. అప్పుడు మహాప్రభావసంపన్నుండగు రుచికుండు తన తపోమహిమచే నగ్నిహోత్రంబునఁ బాయసంబుఁ గల్పించి రెండుదొన్నెలయందుంచి వేఱువేఱుగ నభిమంత్రించి వానినిఁ దన భార్య కిచ్చి "ఇందొకటి నీవును, వేఱొకటి నీజననియుఁ బరిగ్రహింపుఁ"డని యాదేశించెను. సత్యవతి వానింగైకొని తల్లియొద్దకుఁ బోయెను. తల్లి యామెను బుజ్జగించి "అమ్మా! నీవు నీభర్తకంటెను నన్నధికముగ గౌరవించుచున్నావు. కావున నీవిప్పుడు నేఁజెప్పినట్లు కావించుట యుచితము. నీభర్తనీ

కొసంగినపాయసము నాదానికంటె మంచిదనిభావించుచున్నా
ను. నీపాయసమును నాకిచ్చి నాభాగమును నీవారగింపవల
యును." అనికోరెను. తల్లియట్లభిలషించినప్పుడు తనయ
యేమనఁగలదు? అట్లే కావించెను.

త్రికాలజ్ఞుఁడగురుచికుఁడీవిషయమునుగ్రహించి,విచారించి
సత్యవతింగాంచి "ప్రియా! నీవు చేసినపని మంచిదికాదు.
నీజనని మహారాజ్ఞి.నీవుతపస్వినివి. ఆమెకు వీరుండగు తేజస్వియు
నీకు ధార్మికుండగుతపస్వియుఁ గలుగవలయునని తలంచి పాయ
సమును వేఱువేఱుగఁగల్పించియిచ్చితిని. కాని, యిప్పుడుమీరు
వానినిమార్చుకొంటిరి. నాసంకల్పము విపరీతమైపోయినది.
మీసంతానముగూడ నట్లేకాఁగలదు." అనుటయు సత్యవతి
"అయ్యో! పొరపాటుజరిగినది. తపస్వినినగు నేనట్టిపుత్త్రునిఁబ
డసి యానందింపఁజాలను." అని విచారింపఁ దొడంగెను. అప్పు
డు రుచికుండు దయాళుండై "నీపుత్త్రుండు బ్రాహ్మణుండగు
నట్లు ప్రయత్నించెదను. కాని, నీపౌత్త్రుండుమాత్రము క్షత్రి
తేజస్సంపన్నుఁడుగాక తప్పదు." అని యూరడించెను.

అంతఁ గొంతకాలంబునకు సత్యవతికొకతనయుం డుద
యించెను. అతఁడు క్రమంబుగఁబెఱిగి మునిచంద్రుండై జమ
దగ్నినామంబునఁ బ్రసిద్ధుండయ్యెను.గాధిరాజునకుఁగూడ నప్పు
డే యొకపుత్త్రుండు పుట్టెను.అతండు విశ్వామిత్త్రనామంబునఁ

బ్రఖ్యాతుండై యాభిజాత్యంబునుబట్టి రాజలక్షణంబులుగలవాఁ
డయ్యును దుట్టతుదకు బ్రహ్మర్షియైపోయెను.

ఆజమదగ్ని ప్రసేనజిత్తునిపుత్త్రికయగు రేణుకను బెండ్లి
యాడెను. ఆమెకుఁ గ్రమముగ, రుమణ్వంతుఁడు, సుషేణుఁడు
వసువు, విశ్వవసుఁడు, రాముఁడు నను నైదుగురుపుత్త్రులు గలి
గిరి. వారిలో రాముఁడందఱికంటెను జిన్నవాఁడయ్యును గుణం
బులచే నెల్లరికంటెఁ బెద్దయైయుండెను. వెనుకరుచికమునీంద్రుఁ
డు తనభార్యతో "నీపౌత్త్రుఁడు క్షత్రియతేజస్సంపన్నుఁడగు"
నని చెప్పియుండెను. ఆక్షత్రియతేజస్సప్పుడు రామునియందు
మూర్తీభవించెను. ఈరాముఁ డించుకవయస్సువచ్చినంతనే
గంధమాదనంబునకుంబోయి మహాదేవునింగూర్చి కఠోరతపం
బుఁగావించి, యాతనియనుగ్రహంబున ననన్యసాధ్యంబులగుది
వ్యాస్త్రములంబడసి, త్రిభువనవిజయుండును, నద్వితీయుండును
మహావీరుండునై విరాజిల్లుచుండెను. ఆతనితపంబునకు సంతు
ష్టుండై మహాదేవుం డద్భుతసాధనంబగుపరశువునుగూడఁ బ్ర
సాదించియుండెను. దానివాఁడి యెన్నఁడును మొక్కవోవునది
గాదు. అయ్యస్త్రాఘాతముచేఁ గఠినశైలంబులుగూడ ఖండఖం
డములైపోఁగలవు. నిరంతరము నాపరశువుమధరించి సంచరిం
చుటచేతనే రామునకుఁ బరశురాముం డనుపేరు ప్రఖ్యాతం
బయ్యెను.

పరశురాముఁడు బ్రహ్మవంశమునందే జన్మించెనుగాని,

యాతనిమనసుమాత్రము క్షత్రియహృదయమువలె నతికఠినమైనదై యుండెను. ఆతనిహృదయ మెంతకఠినమైనదో యొకప్పుడుజరగినసంఘటనమువలన స్పష్టముగాఁ దెలిసికొనవచ్చును. జమదగ్నిమునీంద్రున కొకనాఁడు రేణుకయందుఁ గారణాంతరముచే సహింపరాని దారుణక్రోధము కలిగెను. క్రోధావేశముచే నాతఁడొక్కసారిగనున్మత్తప్రాయుఁడై తనతనయులంబిలిచి తత్క్షణమే మీరామెను సంహరింపవలయునని కఠినముగ నాజ్ఞాపించెను. అతని మొదటినలువురుపుత్త్రులునుగూడనిట్టియస్వాభావికంబును నతినిష్ఠురంబును,నధర్మయుక్తంబును నగుదారుణకృత్యంబున కొడంబడఁజాలకపోయిరి. కాని, పరశురాముఁడుమాత్రము తండ్రియాజ్ఞనాలకించినంతనే నిస్సంశయముగఁదనకరమునందలిగండ్రగొడ్డలిచే జననికంఠమును ఖండించివైచెను. పితృవాక్యపరిపాలకుండగు పరశురాముఁగాంచి జమదగ్ని సంతోషించి "వత్సా! నాయాదేశమాత్రంబున నీవతికఠినంబగుకార్యమును నిస్సంశయముగ నిర్వహించితివి. నీయెడలసంతుష్టుండనైతిని. నీకేమికావలయునో కోరుకొమ్ము" అనియనుగ్రహించెను.

పరశురాముం డప్పుడు జనకుని ప్రసన్నభావంబునకుఁ బరమానందభరితుండై "తండ్రీ! నీవు నాయెడలఁ బరితుష్టుండవైతివేని, క్రిమ్మఱ నాజనయిత్రిని బ్రదికించి మాతృఘాతుకుండను నపయశఃపంకమున మునిఁగిపోకుండ నన్నుద్ధరింపుము" అని వేఁడుకొనియెను.

జమ—కుమారా! అట్లేయగుఁగాక! ఇంకను నీకేమికావలయునో యడుగుము.

పరశు—తండ్రీ! నాకమరత్వమును బ్రసాదింపుము. మఱియు నీత్రిభువనంబులయందును నన్ను మించినమహావీరుఁడు లేకుండున ట్లనుగ్రహింపుము.

జమదగ్ని సంతోషముతోఁ గుమారుని కభిలషితవరంబులఁ బ్రసాదించి పితృమాతృభక్తితత్పరుండవగు నీవు చిరంజీవివై మనుమని యాశీర్వదించి, పునరుజ్జీవితయై వచ్చి తనకు నమస్కరించినసహధర్మిణి నాదరించి శాంతుం డయ్యెను.

అనంతరము కొంతకాలంబున కొకనాఁడు హైహయప్రభుండగు కార్తవీర్యుండు జమదగ్నితపోవనంబునకు విచ్చేసెను. అప్పుడు రేణుకాజమదగ్ను లిరువురుమాత్రమే తపోవనంబునందుండిరి. గృహిణియగు రేణుక యప్పుడు కుమారులింట లేకుండుటకు వ్యసనచిత్తయై యథాశక్తిగ నమ్మహారాజు నభ్యర్చితుంగావించి కుశలప్రశ్నంబుఁ జేసెను. కాని, గర్వోన్మత్తుఁడగు రాజయ్యాదరణంబును బరిగ్రహింపక యాశ్రమవనంబంతయు విధ్వస్తంబుఁగావించి బలవంతముగ జమదగ్ని హోమధేనువును బట్టి తీసికొనిపోయెను.

తరువాతఁ బరశురాముం డింటికివచ్చి యెల్లవృత్తాంతము నాకర్ణించి ప్రళయకాలరుద్రునివలె మండిపడుచు నొకనిమిషమైన నాలస్యము సేయక పరశువును ధనుర్బాణములను

ధరించి వేగముగఁ గార్తవీర్యుని వెదకికొనుచుఁ బోయి మార్గమధ్యమునందే కలిసికొని యాతనితో మహారణంబు గావించెను. అంతటి దారుణసమరము నిదివఱ కెవ్వరును వినియుండలేదు. కార్తవీర్యుఁ డప్పుడు ధనుర్బాణధారియయ్యును పరశురాముని కుఠారాఘాతములను దన వేయి చేతుల చేఁగూడఁ దప్పించుకొనఁ జాలకపోయెను. చూచుచుండఁగనే యమ్మహావీరుని పరశువు కార్తవీర్యుని సహస్రబాహువులను ఖండించి తుద కాతని యుత్తమాంగమును భూతలపతితంబుగఁ జేసివైచెను.

నిమిషములోఁ గార్తవీర్యుని మరణవార్త యతిదారుణముగ నాలనిపుత్త్రులకుఁ దెలియవచ్చెను. హైహయవీరులగు నా రాజకుమారు లప్పటినుండియుఁ బరశురాముని యెడలఁ బగదీర్చికొనుటకు సమయమును నిరీక్షించుచుండిరి. ఇట్లుండ నొకప్పుడు పరశురాముఁడు తన యన్నలతోఁ గూడి యాశ్రమమును విడిచిపోయిన సమయమును గనిపెట్టి యా రాజకుమారులు తపోవనమునఁ బ్రవేశించి జమదగ్నిపైఁబడి "రామా! రామా!" యని యాక్రందనంబు సేయుచుండఁగనే యమ్మునీంద్రుని దారుణవధ గావించి వెడలిపోయిరి.

అనంతరము పరశురాముఁ డాశ్రమంబునకువచ్చి యా క్రూరకృత్యముం గాంచి పితృమృతకళేబరము చెంత శోకార్తయై పడియున్న తల్లివలన నెల్లసంగతులను దెలిసికొని శోకానలసంతప్తచిత్తుండైపోయెను. జనకుని గుణగణంబులం దలంచికొని

దుఃఖించుచున్న కొలఁది నాతని హృదయాంతరాళమునఁ గ్రోధానలము వర్ధిల్లుచు నతిభీషణముగఁ బ్రజ్వరిల్లఁ దొడంగెను. ఈ ప్రపంచమునం దంతటి భయంకర క్రోధము నెవ్వరు నెచ్చటను గాంచియుండరు.

పరశురామున కప్పుడు జనకునికి దహనాదిసత్కారంబులు గావించుట ప్రధానకర్తవ్యమయ్యెను. తోడనే యాతఁ డక్కార్యంబులను ముగించి ధనుర్బాణంబులం దాల్చి యతిభీకరంబగు కుఠారంబును జేఁబూని మూర్తీభవించిన మృత్యువుంబోలి హైహయకులసంహారంబుఁ గావించుటకై బయలుదేఱెను. కొలఁదిసేపటిలోనే శత్త్రునగరంబునకుఁ బోయి యాతఁ డతిఘోరంబగు సంగ్రామంబు గావించి కార్తవీర్యతనూజుల నందఱను దన పరశుధారచే ముహూర్తమాత్రంబున ఖండఖండములుగాఁ జేసివైచెను. కాని, యంతటితో నాతని కోపము చల్లారలేదు. పిమ్మట నాతఁడు హైహయవంశమునందలి క్షత్రియవీరులను వారివారి యాశ్రితులనుగూడ వెదకి వెదకి చంపివైచెను. ఇంకను గోపము చల్లారకుండుటచే క్షత్త్రియమాత్రుల నందఱను బేరులేకుండ నాశనంబు సేయవలయునని సంకల్పించుకొనియెను. ఈ జగంబంతయు నక్షత్త్రంబగువఱకు మహావీరుఁడగు పరశురామునకు విశ్రాంతియను మాటయే లేకపోయెను. క్రమముగా నాతనిచేఁ జంపఁబడిన క్షత్త్రియవీరుల వెచ్చని నెత్తురుటేళ్ళచే ధరాతలమంతయుఁ బంకిలమైపోవుచుండెను. బాల

కులను శిశువులను గూడ నాతఁడువిడుచుటలేదు. ఈవిధముగా వెదకి వెదకి క్షత్రియులను పేరులేకుండఁ జేసివైచెను. అప్పటి కాతనికోపము శాంతించినది. తోడనే పశ్చాత్తాపదుఃఖమాతని హృదయమును గలంచివైచుటచే నాతఁడు నిలిచినచోటనిలువఁ జాలక, యరణ్యములఁబట్టిపోయెను.

అరణ్యములందున్నప్పుడుగూడ నాతనికప్పుడప్పుడహంకారము కలుగుచునేయుండెను. అప్పుడప్పుడు తపోవనంబులఁ బ్రవేశించి "నేనీభూమినంతయు క్షత్రియశూన్యంబుగాఁ జేసివైచితిని." అని యుగ్గడించుచుండెడివాఁడు. కాని, పరమశాంతులగుమునీంద్రులలోమాత్ర మట్టినిష్ఠురకార్యమున సంతుష్టింగాంచినవా రెవ్వరునులేకపోయిరి.

ఈవిధముగా వేయివత్సరములు గడచిపోయెను. దైవానుగ్రహముచేఁ బరశురామునిచేతులలోఁబడకుండఁ దప్పించుకొన్న యొకరిద్దఱుక్షత్రియశిశువులవలనఁ గ్రమముగా సంతానవర్ధిల్లి మరల భూమియంతయు క్షత్రియజనసంపూర్ణమయ్యెను. అప్పుడు విశ్వామిత్త్రునిపౌత్రుండగుపరావసుండను వాఁడు పరశురామునిచెంతకువచ్చి "నీవేమో క్షత్రియులను నిశ్శేషముగాఁ జేసితి నని ప్రగల్భము లాడుచున్నాఁడవు. అదిగో చూడుము! జగంబంతయు మరల క్షత్రియసంపన్నంబై యున్నది. పరమేశ్వరుని సృష్టినడ్డగించుటకు నీవెంతవాఁడవు." అని పరిహసించెను.

ఇంతవఱకును బరశురామునిహృదయాంతరాళమున మఱుగువడియున్నరోషానల మిప్పుడొక్కసారిగఁ బ్రకోపితమై ప్రజ్వరిల్లిపోయెను. ఇఁక నాతఁడు వనమధ్యమునం దూరక యుండఁజాలక జనపదములయందుఁబడి వెదకి వెదకి మరల క్షత్రియులనందఱను సంహరించివైచెను. ఈవిధముగా నాతఁడిరువదియొక్కమాఱు క్షత్రియసంహారముఁ గావించెను. ఆక్షత్రియరక్తమంతయు శమంతపంచకమనుపేర నైదుమడుగులయ్యెను. అందలిరక్తముచేఁ బరశురాముండు పితృదేవతలకుఁ దర్పణంబులు గావించి కోపమును జల్లార్చుకొనిపోయెను.

ఈభూమండలమున కంతకును బ్రభువులగువారు క్షత్రియులేయైయుండిరి. పరశురాముఁడు క్షత్రియవినాశనంబుఁ గావించుటచే ధరాతలమంతయు నాతనియధీనమయ్యెను. కాని, యాతఁడు రాజ్యలోభముచే క్షత్రియసంహారముం గావించి యుండలేదు. రాజ్యమువలన నాతనికెంతమాత్రమును బ్రయోజనము లేదు. క్షత్రియసంహారానంతరమునఁ బాపవిమోచనంబునకై యాతఁ డొకయశ్వమేధయాగమును గావించెను. నిరపేక్షుండగు నాతఁడయ్యజ్ఞసమయంబున మహర్షియగు కశ్యపునకీమహీమండలమంతయును మఖదక్షిణగా సమర్పించివైచెను. లోకమహితులగు నితరమునులవలెనే కశ్యపుఁడుగూడఁ బరశురాముని దారుణకృత్యములకు సహింపఁజాలకుండెను. కశ్యపుఁ డప్పు డాభూదానమునుగ్రహించి రాజ్యపాలనమునకేర్పడిన క్ష

క్షత్రియవంశము నుద్ధరించుట కిదియే మంచిసమయమని తలంచి పరశురాముఁ గాంచి దక్షిణాభిముఖంబుగ నంగుళిం జూపుచు, "మహాత్మా! నీవిప్పుడే యీమార్గమును బట్టి దక్షిణసముద్రతీరంబునకుం బొమ్ము; నీవు దానము సేయుటచే నీసమస్త భూమండలమును నాయధీనంబైనది. దాతవగు నీవిక నిందుండుట యుచితముగాదు." అని చెప్పెను.

పరశురాముండును మాఱుమాట చెప్పక యాక్షణము ననే బయలుదేఱి దక్షిణసముద్రతీరమునకుం బోయెను. ఆతనిం గాంచినంతనే సముద్రుం డించుక వెనుకకు జరిగి యాతనినివాసంబునకై శూర్పాకారంబుగఁ గొంతభూప్రదేశమును గల్పించెను. పరశురాముఁ డచ్చట తపంబుఁ జేసికొనుచుఁ బ్రశాంతుండై యుండెను.

అనంతరము లోకమంగళాకాంక్షియగు కశ్యపమునీంద్రుఁడు పలాయితులై యందు దాగియున్న క్షత్రియకుమారులం దెచ్చి ఆయారాజ్యంబులయందుఁ బ్రతిష్ఠించి యరాజకంబగు లోకంబును ధర్మపాలనరూపంబున సముద్ధరణంబుఁ గావించెను.

ఇట్లు పరశురాముండు ప్రశాంతుండై యుండినను జాలకాలమువఱకు నాతనిసన్నిధి కెవ్వరును జేరఁజాలకుండిరి. కాని, క్రమముగా భయమువిడిచి, రాజకుమారు లాతని నాశ్రయించి ధనుర్వేదాదివిద్యల నభ్యసించి పరాక్రమవంతులు కాఁజొచ్చిరి. దుష్టరాజన్యకులధూమకేతువగు పరశురాముని నిత్యమును

బూజించుట శ్రేయోదాయకమని భావించి ధర్మపరిపాలకులగు ననేకమహారాజులు దమతమసంస్థానములలో దేవాలయముల గట్టించి పరశురామమూర్తులను బ్రతిష్ఠించి నిత్యమును యథావిధిగ నర్చించుచుండుటకుఁ దగినవసతులనుగూడఁ గల్పించియుండిరి. ఇప్పటికిని గొన్నిసంస్థానములయందుఁ బరశురామాలయములు చూపట్టుచున్నవి.

పరశురాముఁ డొకప్పుడు భూసంచారము సేయుచు విశ్వామిత్రాశ్రమమునకుం బోయి యమ్మునీంద్రుఁడు రామలక్ష్మణసహితుండై ధనుర్యాగనిరతుండగు జనకుని జూడఁబోయెనని శిష్యులవలనఁ దెలిసికొని, మిథిలానగరమునకుఁ బయనమయ్యెను. త్రోవలో నాతనికి విజయభేరీధ్వనులు మంగళతూర్యారావములును వినవచ్చెను. రఘుకులతిలకుండగు రామచంద్రుఁడు శివధనుర్భంగంబుఁ జేసి సీతాదేవిని బరిణయంబై మహోత్సవంబున నయోధ్యానగరంబునకుఁ బోవుచుండెనని యాతనికిఁ దెలియవచ్చెను. అప్పుడు పరశురాముఁడు కన్నులనుండి నిప్పులఁ గుప్పుచుఁ గ్రోధోద్రేకంబున రాముని సమీపించి "నిఖిలక్షత్రియకులనిర్మూలనకారకుండనగు రాముఁడను నేనుండఁగా మరల రామనామధారివగు నీవెవ్వఁడవు? శివునిచివుకువిల్లువిఱిచి వీరగర్వాంధుఁడవై కులుకుచుంటివా? నిలునిలువుము! రామనామంబునకర్హులము నీవో నేనో తేలుతుము గాక!" అని యదలించుచు రాముని నడ్డగించెను.

దశరథుఁ డెన్నియో విధములఁ బరశురాముని శాంతింపఁ జేయఁ బ్రయత్నించెనుగాని ప్రయోజనము లేకపోయెను. అప్పుడు శ్రీరామచంద్రుఁడు పరశురామునకు నమస్కరించి "ఆర్యా! మీప్రభావము జగద్విదితమైనదని యెఱుంగుదును. పవిత్రబ్రహ్మవంశమున జన్మించి యెవ్వఁడో యొకరా జనుచితకార్యముఁ గావించినాఁడను కోపముచే రాజలోకమునంతను నిర్మూలనంబు సేయందలంచి కిరాతుండు సాధుమృగంబుల హింసించినట్లు ఘోరమారణకర్మంబులఁ గావించిన మీప్రతిష్ఠ యెఱుంగనివా రెవ్వరు? భూమండలమున నిప్పటికిని గూడ నింకిపోకుండ నగాధములై తరంగితములగుచున్న రక్తపుమడుగులే మీకీర్తి నాచంద్రార్కముగఁ జాటుచున్నవి." అని యుగ్గడించెను.

పరశురాముఁ డప్పుడు మహాక్రోధముచే "ఓరీ! రాకుమారా! పురాతనమైన శివచాపము నెక్కువెట్టుటగాదు. నాయొద్దనున్న యీ వైష్ణవచాపంబు సజ్యంబుగఁ జేయుము. నీశక్తి చూచెదను. అట్లు చేయఁజాలకుంటివేని, ఈపరశువుతో నీశిరః ఖండనంబుఁ గావింతును." అని గద్దించెను.

రామచంద్రుఁడు మందహాసముఁ జేయుచు వినతుండై యాతనికోదండముం గైకొని యశ్రమంబుగ నెక్కువెట్టి శరసంధానంబు సేయుటయుఁ బరశురాముం డాశ్చర్యంబునొంది

దశరథుఁ డెన్నియో విధములఁ బరశురాముని శాంతింపఁ జేయఁ బ్రయత్నించెనుగాని ప్రయోజనము లేకపోయెను. అప్పుడు శ్రీరామచంద్రుఁడు పరశురామునకు నమస్కరించి "ఆర్యా! మీప్రభావము జగద్విదితమైనదని యెఱుంగుదును. పవిత్రబ్రహ్మవంశమున జన్మించి యెవ్వఁడో యొకరా జనుచితకార్యముఁ గావించినాఁడనుకోపముచే రాజలోకమునంతను నిర్మూలనంబు సేయందలంచి కిరాతుండు సాధుమృగంబుల హింసించినట్లు ఘోరమారణకర్మంబులఁ గావించినమీప్రతిష్ఠ యెఱుంగనివా రెవ్వరు? భూమండలమున నిప్పటికిని గూడ నింకిపోకుండ నగాధములై తరంగితములగుచున్న రక్తపుమడుగులే మీకీర్తి నాచంద్రార్కముగఁ జాటుచున్నవి." అనియుగ్గడించెను.

పరశురాముఁ డప్పుడు మహాక్రోధముచే "ఓరీ! రాకుమారా! పురాతనమైన శివచాపము నెక్కుపెట్టుటగాదు. నాయొద్దనున్న యీవైష్ణవచాపంబు సజ్యంబుగఁ జేయుము. నీశక్తి చూచెదను. అట్లు చేయఁజాలకుంటివేని, ఈపరశువుతో నీశిరఃఖండనంబుఁ గావింతును." అని గద్దించెను.

రామచంద్రుఁడు మందహాసముఁ జేయుచు వినతుండై యాతనికోదండముం గైకొని యశ్రమంబుగ నెక్కుపెట్టి శరసంధానంబు సేయుటయుఁ బరశురాముం డాశ్చర్యంబునొంది

END OF
TITLE